www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

దుర్గమ్మ కానుకలు బ్యాంకులో డిపాజిట్



29.5 కిలోల బంగారు ఆభరణాలు

విలువ రూ. 26.58 కోట్లు

బెజవాడ దుర్గమ్మకు కానుకల రూపంలో వచ్చిన బంగారు నగలు

2

మంగళవారం | 8-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 122 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి రా.12:39 తదుపరి చతుర్దశి, నక్షత్రం: జ్యేష్ఠ తె. 3:15 తదుపరి మూల, వర్జ్యం: ఉ.7:16-9:00, దుర్ముహూర్తం: ఉ.8:26-9:18, రా.10:25-11:08, అమృతఘడియలు: సా.5:41-7:26, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిఘా నేత్రం!

టెక్‌తో నేరగాళ్లకు చెక్

విస్తృతంగా సీసీ కెమెరాల వినియోగం

క్రైమ్ హాట్‌స్పాట్‌ల వద్ద అమర్చండి

ప్రైవేటు సీసీ కెమెరాలతోనూ పోలీసింగ్

అవసరమైతే నిబంధనలు మార్చండి

ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ

రియల్ టైమ్ గవర్నెన్స్ సమీక్షలో సీఎం చంద్రబాబు

క్వాంటమ్‌పై అధ్యయనానికి ఐటీ శాఖకు ఆదేశం

నేడు బెంగళూరుకు లోకేశ్.. ఐటీ ప్రతినిధులతో భేటీ



రియల్ టైం గవర్నెన్స్‌పై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్, అధికారులు

రాజకీయం ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలి. కొందరు తెలివిగా నేరాలు చేసి.. వాటిని ప్రభుత్వంపైకి నెడుతున్నారు.
- చంద్రబాబు

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సాయంతో నేరగాళ్లకు చెక్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రాన్ని నేరరహితంగా మార్చాలన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్ఠంగా ఉపయోగించాలని... ఈ విషయంలో దేశానికే మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సీసీ కెమెరాల సాయంతో నిరంతర నిఘా పెట్టి నేరాలను

మిగతా 13వ పేజీలో...



అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన స్కానర్లు

సచివాలయంలోకి స్మార్ట్ ఎంట్రీ

12

ఉద్యోగులు, జర్నలిస్టులకు స్మార్ట్ కార్డులు

సందర్శకులకు క్యూఆర్ కోడ్‌తో స్లిప్పులు

వాహనాలకు ఫాస్ట్‌ట్యాగ్ తరహా స్టిక్కర్లు

భద్రతకు ఆధునిక టెక్నాలజీ వినియోగం

చకచకా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సెక్యూరిటీ లోపాలకు చెక్.. భద్రత కట్టుదిట్టం



పూర్తి స్థాయి నీటి మట్టానికి దగ్గరగా శ్రీశైలం జలాశయం

నిండుకుండలా శ్రీశైలం

నేడు గేట్లు ఎత్తనున్న సీఎం చంద్రబాబు

192.5 టీఎంసీలకు చేరిన నిల్వ

ఎగువ నుంచి భారీగా వరద

1,71,550 క్యూసెక్కుల ప్రవాహం

ఇంతముందుగా గేట్లు ఎత్తడం పాతికేళ్లలో ఇదే రికార్డు

సాగర్‌లో 147.95 టీఎంసీల కొరత

అది నిండితేనే పులిచింతలకు నీరు

రాష్ట్రంలో 13 జిల్లాల్లో వర్షాభావం

అమరావతి/నంద్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తి దిగువన నాగార్జునసాగర్‌కు నీరు విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం కృష్ణమ్మకు పూజలు చేసి గేట్లను ఎత్తనున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నది పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాం నిండుకుండలా దర్శనమిస్తోంది. నీటి నిల్వ 193.40 టీఎంసీలు ఉండగా.. నీటిమట్టం 880.80 అడుగులకు చేరింది. భారీ వరద కొనసాగుతుందన్న అంచనాతో.. డ్యాం భద్రత దృష్ట్యా.. పూర్తి స్థాయిలో నిండేదాకా వేచిచూడకుండా అధికారులు గేట్లెత్తి సాగర్‌కు నీరు విడుదల చేయాలని

మిగతా 14వ పేజీలో...



ధవళేశ్వరం ఆనకట్ట నుంచి సముద్రంలోకి పోతున్న వరద

శబరి, సీలేరు వరదతో ఎరుపెక్కిన గోదావరి

ఎగువన భారీ వర్షాలు.. 4 రోజుల్లో తీవ్ర ఉధృతికి అవకాశం

పోలవరం స్పిల్‌వేలోకి 1,95,294 క్యూసెక్కులు

ఆ మొత్తం దిగువకు విడుదల.. ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి 1,85,143 క్యూసెక్కులు.. సాగు అవసరాలకు డెల్టాకూ నీరు

14



13

జగన్ పర్యటనకు 500 మందికే అనుమతి

హెలిప్యాడ్ వద్దకు 30 మంది మాత్రమే రావాలి

రోడ్‌షోలు, సభలకు అనుమతి లేదు

గత సంఘటనల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు

చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ స్పష్టీకరణ

దుర్మార్గుడి దండయాత్రను అడ్డుకోండి



రైతులకు ఏంచేశాడో నిలదీయండి

ఆయన కాలు పెడితే విధ్వంసమే

యాత్రల పేరిట శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఊరుకోం: అచ్చెన్న

13

వైసీపీ హయాం ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా

సీవోఏ అనుమతుల్లేకుండా అడ్మిషన్లా?

జగన్, అవినాశ్‌దే ఈ పాపం



12

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నాటి వైసీపీ ప్రభుత్వం

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శ

ప్రస్తుత ప్రభుత్వం తప్పు సరిదిద్దాలని డిమాండ్

బ్రిక్స్‌కు మద్దతిస్తే 10% అదనపు సుంకం

ఆ కూటమివి అమెరికా వ్యతిరేక విధానాలు

ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

2

మస్క్ పూర్తిగా గాడితప్పారు

పార్టీ ఏర్పాటు ఓ హాస్యాస్పద నిర్ణయం

ఈవీలు కొనిపించాలని ఆయన ఎత్తు: ట్రంప్

పబ్లిక్‌గా పేకాట

మందు, విందులతో జూదగాళ్ల జోరు

రేపల్లెలోని చిన్నగ్రామం వెలమవారిపాలెం

రెవెన్యూ మంత్రి ఇలాకాలో బరితెగింపు

ఆరుబయటే షెడ్లు వేసి రాత్రంతా జూదం

నాన్ వెజ్ వంటకాలు.. తాగినంత మద్యం

ఫైవ్‌స్టార్ హోటల్‌కు మించిన విలాసం

జూదగృహాలకు తెలంగాణ నుంచీ రాక

నలభై మంది సొంత బలగంతో కాపలా

పోలీసుల ప్రేక్షక పాత్ర.. దీంతో మరింత జోష్



(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

వెలమవారిపాలెం...ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని చిన్నగ్రామం ఇది. ఇప్పుడీ ఊరి పేరు తెలుగునాట మారుమోగిపోతోంది. మంచిగా అయితే ఫరవాలేదుగానీ, మొత్తం రాష్ట్రాన్నే అప్రతిష్ఠపాల్జేసేలా ఈ ఊరే ఒక పేకాట క్లబ్‌గా మారిపోయింది. నాన్ వెజ్ వంటకాలతో విందు, తాగినవాళ్లకు తాగినంత మందు అందిస్తూ జూదరులను ఫైవ్‌స్టార్ హోటల్‌కు మించిన సౌకర్యాలతో ఉత్సాహపరుస్తున్నారు. పేకాటరాయుళ్ల చేతుల్లోని పేకలు రూ.కోట్లను

మిగతా 14వ పేజీలో...



అప్పుడు.. ఇప్పుడూ..

వైసీపీ హయాంలోనూ రేపల్లె ప్రాంతం జూద కేంద్రంగా వర్ధిల్లింది. అప్పట్లో క్లబ్బులను మూసివేయడంతో... జూదరులంతా రేపల్లెకు తరలి వచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇదే జోరు కొనసాగుతోందని వెలమవారి పాలెం వాసులు ఆవేదన చెందుతున్నారు. పేకాట జరిగే చోటుకే కాదు... సమీపానికి కూడా ఇతరులెవరూ వెళ్లలేనంత కట్టుదిట్టంగా దీనిని నడుపుతున్నారు.



నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో భక్తులకు సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బందితో లోకేశ్ సెల్ఫీ

సవాళ్లకు సై అంటేనే..

జీవితంలో ఎదుగుదల సాధ్యం

తొలిసారి ఓడిన మంగళగిరిలోనే భారీ మెజారిటీతో గెలిచాను

విద్యా శాఖ మంత్రి పదవిని ఒక సవాల్‌గా స్వీకరించా: లోకేశ్

నెల్లూరులో వీఆర్ స్కూల్ ప్రారంభం

నేను చదివిన స్కూలు కన్నా బాగుంది

రాష్ట్రమంతా నియోజకవర్గానికి ఒక్కటైనా ఇలాంటి స్కూలు ఏర్పాటు చేస్తాం

ఏడాదిలోపు మంగళగిరిలో: మంత్రి

నెల్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు ఎదురైన సవాళ్లను ఎదుర్కొన్నపుడే జీవితంలో పైకి ఎదుగుతారని మంత్రి లోకేశ్ అన్నారు. మంత్రి నారాయణ నేతృత్వంలో నెల్లూరులో ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న వీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూలును సోమవారం లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సవాళ్లను స్వీకరిస్తేనే ఫలితం ఉంటుందని, అందుకు తన జీవితాన్నే ఉదాహరణగా

మిగతా 13వ పేజీలో...



భీమిలి బీచ్‌లో నేహారెడ్డి ఏర్పాటుచేసిన అక్రమ కట్టడాల తొలగింపు (ఫైల్)

13

మరీ ఇంత తాత్సారమా?

నేహారెడ్డిపై చర్యలకు ఇన్నాళ్లూ మీనమేషాలు

హైకోర్టు ఆగ్రహంతో ఎట్టకేలకు కేసు నమోదు

భీమిలీ బీచ్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారంలో సాయిరెడ్డి తనయను తప్పుబట్టిన హైకోర్టు

కట్టడాలు తొలగించి, చర్యలకు పలు ఆదేశాలు

తాజాగా గట్టి వార్నింగ్‌తో అధికారులకు డెడ్‌లైన్

దీంతో భీమిలి స్టేషన్‌లో అధికారుల ఫిర్యాదు

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ఇంటిపై

మహిళల దాడి

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలే కారణం!

13

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

అయోమయం

ఫీజులు తేలలేదు.. అఫిలియేషన్లూ పూర్తికాలేదు

సీట్ల మంజూరు జీవోలూ ఇవ్వని ఉన్నత విద్యా శాఖ

షెడ్యూలు ప్రకారం ఎల్లుండి నుంచే ఆప్షన్ల ప్రక్రియ

ఆలస్యం కావడంతో 13వ తేదీకి వాయిదా

ఆప్షన్ల ఎంపికకు 9కి బదులు 6 రోజులే గడువు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ అంతా అయోమయంగా మారింది. ఓవైపు ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యా శాఖ షెడ్యూలు ప్రకటించగా.. ఇంతవరకూ ఫీజులపై నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు కాలేజీల అఫిలియేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. మరో విచిత్రం ఏంటంటే... ఏఐసీటీఈ మంజూరు చేసిన ఇంజనీరింగ్ సీట్లను ఆమోదిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఇంతవరకూ జీవోలు జారీ చేయలేదు. విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకునే సమయానికి ఈ మూడు ప్రక్రియలు పూర్తికావాలి. ఏ కాలేజీలో ఏ కోర్సు ఫీజు ఎంత? అనేది విద్యార్థులకు తెలియాలి. కాలేజీల్లో ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయనే జీవోలు విడుదల చేయాలి. 2025-26 విద్యా సంవత్సరానికి కాలేజీలకు అఫిలియేషన్లూ మంజూరు కావాలి. జేఎన్‌టీయూ అనంతపురంలో ఆదివారం, జేఎన్‌టీయూ కాకినాడలో

మిగతా 12వ పేజీలో...

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

తెలుగు కుటుంబం సజీవ దహనం

మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి డల్లాస్‌కు వెళ్లి స్థిరపడిన శ్రీవెంకట్ కుటుంబం

భార్య, పిల్లలతో కలిసి అట్లాంటాలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లిన శ్రీవెంకట్

తిరిగి వస్తుండగా రాంగ్ రూట్‌లో వారి కారును బలంగా ఢీకొట్టిన మినీ ట్రక్కు

మంటలు చెలరేగి నలుగురూ కాలి బూడిద!

2

కుపోలా.. భూమండలాన్ని చూపించే కిటికీ!



న్యూఢిల్లీ, జూలై 7: భారత సంతతి వ్యోమగామి శుభాన్షు శుక్లా వెనుక కనిపిస్తున్నది అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఐఎస్ఎస్)లోని ఓ కిటికీ. పేరు కుపోలా. మన ఇంట్లో కిటికీ నుంచి చూస్తే మహా అయితే వీధి చివర వరకు, ఇంకా అంటే ఊరి చివరి చెట్లు, భవనాల వరకు చూడొచ్చు. కానీ, ఈ కిటికీ నుంచి భూమండలం మొత్తం కనిపిస్తుంది. 14రోజుల మిషన్‌లో భాగంగా జూన్ 26న ఐఎస్ఎస్ వెళ్లిన శుభాన్షు శుక్లా సోమవారం ఈ కిటికీ దగ్గర ఉన్న ఫొటోలను పంపించారు. కుపోలా అంటే ఇటాలియన్ భాషలో డోము అని అర్థం. ఇది ఏడు గాజు అద్దాలతో కూడిన నిర్మాణం. 2010లో దీన్ని ఐఎస్ఎస్‌లో ఏర్పాటు చేశారు. ఉల్కల్లాంటివి తాకి అద్దాలు ధ్వంసం కాకుండా కిటికీలోని ఈ ఏడు అద్దాలకు షట్టర్లు ఉంటాయి. వ్యోమగాములు భూమండలాన్ని, అంతరిక్షాన్ని చూడాలనుకున్నప్పుడు ఆ షట్టర్లను తెరుస్తారు

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం


» 18 కి.మీ ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద

జకార్తా, జూలై 7: ఇండోనేషియాలోని మౌంట్ లెవోటోబి లాకీ లాకీ అగ్నిపర్వతం బద్దలయింది. సుమారు 18 కిలో మీటర్ల ఎత్తు వరకు నిప్పురవ్వలు, దట్టమైన బూడిద ఎగిసిపడుతున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ నష్టం నమోదు కాలేదు. అయితే అగ్నిపర్వతం నుంచి విడుదలైన లావా సుమారు 5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఇండోనేషియా భూగర్భశాస్త్ర ఏజెన్సీ తెలిపింది. గతేడాది నవంబర్‌లో లాకీ లాకీ అగ్నిపర్వతం బద్దలు కావడంతో తొమ్మిది మంది మృతి చెందగా చాలా మంది గాయపడ్డారు. గత నెలలోనూ పలుమార్లు అగ్నిపర్వతం బద్దలయింది. దాంతో మరిన్ని పేలుళ్లు సంభవించే ప్రమాదం ఉన్నందున పర్వతానికి ఏడు కిలోమీటర్ల వరకు



అధికారులు ఆంక్షలు విధించి చుట్టు పక్కల గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపారు.

లోకం తీరు



రేపు భారత్ బంద్

» 25 కోట్ల మంది పాల్గొంటారు: కార్మిక సంఘాలు

న్యూఢిల్లీ, జూలై 7: కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 10 కార్మిక సంఘాల వేదిక బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. మోదీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరింది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సమ్మెలో బ్యాంకింగ్, బీమా, తపాలా, బొగ్గు గనులు, జాతీయ రహదారులు, నిర్మాణ రంగాలకు చెందిన 25 కోట్ల మందికి పైగా పాల్గొంటారని పేర్కొంది. దేశవ్యాప్తంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల్లోకి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొంటారని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు చెందిన అమర్జీత్ తెలిపారు.

హిమాచల్‌లో వరదలకు నీట మునిగిన బ్యాంకు

మండి, జూలై 7: హిమాచల్ ప్రదేశ్‌లో వరదలకు ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. వరద ఉద్ధృతికి బ్యాంకులోని విలువైన వస్తువులన్నీ పాడైపోయి ఉంటాయని.. శిథిలాలు, బురద తొలగించిన తర్వాతే నష్టాన్ని అంచనా వేయగలుగుతామని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. మండి జిల్లాలోని ధునాగ్ పట్టణంలో ఉన్న హిమాచల్ రాష్ట్ర సహకార బ్యాంకులో సమీప పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, ఖాతాదారులు తమ డబ్బును డిపాజిట్ చేస్తుంటారు. నగలు, విలువైన పత్రాలను దాచుకున్నారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలోనే సహకార బ్యాంకు భవనం వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా కొంత మంది స్థానికులు బ్యాంకు వద్దే కాపలా ఉండటం గమనార్హం.

పదవి నుంచి తొలగించిన గంటల్లోనే తుపాకీతో కాల్చుకొని రష్యా మంత్రి ఆత్మహత్య

మాస్కో, జూలై 7: పదవి నుంచి తొలగించిన కొద్ది గంటల వ్యవధిలోనే రష్యా రవాణా శాఖ మంత్రి రోమన్ స్టారోవోయిత్ సోమవారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మాస్కో శివారులో తన సొంత కారులోనే ఆయన ప్రాణాలు తీసుకున్నారు. కొంతకాలంగా ఆయన పనితీరుపై అసంతృప్తితో ఉన్న అధ్యక్షుడు పుతిన్ ఆయనను పదవి నుంచి తొలగించినట్టు తెలుస్తోంది. పదవి నుంచి తొలగిస్తూ పుతిన్ ఇచ్చిన ఆదేశాలను రష్యా లీగల్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో పెట్టినా ఇందుకుగల కారణాలను వివరించలేదు. ఉక్రెయిన్‌కు సరిహద్దులో ఉన్న కుర్స్క్ రీజియన్‌కు అయిదేళ్లపాటు గవర్నర్‌గా పనిచేసిన స్టారోవోయిత్‌ను గత ఏడాది మే నెలలో రవాణా శాఖ మంత్రిగా పుతిన్ నియమించారు.

క్షుద్రపూజల నెపంతో బిహార్‌లో ఐదుగురి హత్య

బిహార్, జూలై 7: క్షుద్రపూజలు చేస్తున్నారనే నెపంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గ్రామస్థులు హత్య చేశారు. అనంతరం మృతదేహాలకు నిప్పంటించారు. ఈ ఘటన పూర్ణియా జిల్లాలోని టెట్‌గామా గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమారులలో ఒకరు ఇటీవల చనిపోగా, మరొకరు అనారోగ్యానికి గురయ్యారు. వీరికి గ్రామానికి చెందిన సీతాదేవి అనే మహిళ క్షుద్రపూజలు చేసిందనే అనుమానంతో 50 మంది గ్రామస్థులు అర్ధరాత్రి ఆమె ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో సదరు మహిళ సహా ఆమె కుటుంబసభ్యులు ఐదుగురు మృతిచెందారు. అనంతరం గ్రామస్థులు ఆ మృతదేహాలకు నిప్పంటించారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు ఇద్దరిని అరెస్టు చేశారు.

భద్రాద్రి రామయ్య భూముల్లో ఆగని ఆక్రమణలు

» దేవస్థానం భూముల్లో అక్రమంగా ఇంటి నిర్మాణం



ఏపీలోని పురుషోత్తమపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

భద్రాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పుణ్యక్షేత్రానికి సమీపంలో ఏపీ పరిధిలో ఉన్న భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో దేవస్థానం భూముల్లో ఆక్రమణదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అడ్డుకోవడానికి సోమవారం దేవస్థానం ఇబ్బంది వెళ్లగా "నిర్మాణాలు ఆపేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ ఆక్రమణదారులు తెగేసి చెప్పారు. "మీరు ఇక్కడకు రావడానికి వీలు లేదు. తెలంగాణ అధికారులు మా భూముల్లోకి రావద్దు" అంటూ బెదిరించారు. దేవస్థానం సిబ్బందిని ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని యటపాక రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు సరిగా స్పందించలేదని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సమస్యపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తుండటం పట్ల రామ భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

బ్రిక్స్‌కు మద్దతిస్తే 10% అదనపు సుంకం

దానివి అమెరికాకు వ్యతిరేక విధానాలు.. ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్/రియో డీ జనేరో: ఒక పక్క బ్రిక్స్ దేశాల సదస్సు బ్రెజిల్‌లో జరుగుతుంటే మరోపక్క అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వాణిజ్య కూటమి పట్ల విషం కక్కారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతుగా నిలిచిన దేశాలపై మరో పదిశాతం అదనపు సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలేంటో చెప్పలేదు. ప్రపంచ దేశాలకు వాణిజ్య విధివిధానాలు అధికారికంగా లేఖల రూపంలో పంపిస్తున్నట్లు తెలిపారు. 2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడి, తర్వాత దక్షిణాఫ్రికాను కలుపుకొని, ఇప్పుడు ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకు విస్తరించిన వాణిజ్య కూటమి బ్రిక్స్. ట్రంప్ అడ్డగోలు సుంకాలను పరోక్షంగా తప్పుబడుతూ బ్రిక్స్ ప్రకటన చేయగానే ట్రంప్ తాజా ప్రకటనతో బదులిచ్చారు. బ్రిక్స్ ప్రకటనలో ప్రపంచ వాణిజ్య సంస్థ మద్దతు కలిగిన నిబంధనలతో కూడుకున్న, పారదర్శకమైన, అందరినీ కలుపుకొనిపోయే, సమానత్వంతో కూడిన బహుళ వాణిజ్య వ్యవస్థకు మద్దతు తెలుపుతామని చెప్పింది. ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. అది బుధవారంతో ముగిసిపోతోంది. ఆలోపు భారత్ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలి. అందుకు సంబంధించిన చర్చలు ముగిశాయి. ట్రంప్ తాజా ప్రకటన ఇరు దేశాల మధ్య కుదరనున్న వాణిజ్య ఒప్పందం మీద ఎలాంటి ప్రభావం చూపబోదని అధికారులు అంటున్నారు. ట్రంప్ ప్రకటన మీద చైనా స్పందించింది. మూడో దేశాన్ని లక్ష్యంగా చేసుకొని బ్రిక్స్ పని చేయదని స్పష్టం చేసింది. వాణిజ్యంలో విజేతలు ఉండరని, రక్షణాత్మక వాణిజ్యం ముందుకు తీసుకెళ్లదని వ్యాఖ్యానించింది.

పహల్గాంపై ఖండన

బ్రిక్స్ సభ్య దేశాలు కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండించాయి. ఉగ్రవాదంపై పోరులో ఎలాంటి రాజీ ఉండరాదని పిలుపునిచ్చాయి. ఉగ్రవాదంపై కొన్ని దేశాల ద్వంద్వ ప్రమాణాలను తప్పుబట్టాయి. ఉగ్రవాదులకు నిధులు అందకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. మరోపక్క ప్రధాని మోదీ నిరుపేద దేశాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా బ్రిక్స్ దేశాలు పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ క్యూబా అధ్యక్షుడు మైగల్ డియాజ్ కెనాల్ బెర్ముడెజ్‌తో సమావేశం అయ్యారు. ఫార్మా, యూపీఐ అమలు వంటి అంశాలపై చర్చించారు. మలేసియా ప్రధాని, బొలీవియా, ఉరుగ్వే అధ్యక్షులతోనూ భేటీ అయ్యారు.

మస్క్ పూర్తిగా గాడితప్పారు

» పార్టీ ఏర్పాటు ఓ హాస్యాస్పద నిర్ణయం

» నాసాలోకి తన మిత్రుణ్ణి తీసుకోవాలని నాపై ఒత్తిడి: ట్రంప్

న్యూయార్క్, జూలై 7: టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ కొత్తగా రాజకీయ పార్టీని ఏర్పాటుచేయడాన్ని హాస్యాస్పదమైన నిర్ణయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. మస్క్ ఐదు వారాలుగా పూర్తిగా గాడి తప్పిపోయారన్నారు. అమెరికాలో మూడోపార్టీని ఏర్పాటుచేయడం తెలివితక్కువ నిర్ణయమని ట్రంప్ అన్నారు. ద్విపార్టీ వ్యవస్థ నడుస్తున్న అమెరికా రాజకీయాల్లో మూడో పార్టీ ఏర్పాటు గందరగోళానికి దారితీస్తుందని తెలిపారు. అమెరికాలో మూడోపార్టీ విజయం సాధించిన చరిత్రే లేదని వివరించారు. వాహన రాయితీలు రద్దయిపోయి, అందరూ ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేలా మస్క్ ఎత్తు వేశారని ట్రంప్ విమర్శించారు. తన స్నేహితుడు జార్డ్ ఇసాక్‌మన్‌ను నాసాలోకి ప్రవేశపెట్టాలంటూ తనపై మస్క్ ఒత్తిడిని తెచ్చారని ఆరోపించారు. బిగ్ బ్యూటీఫుల్ బిల్లు విషయంలో ట్రంప్‌తో విభేదించి 'డోజ్' నుంచి మస్క్ తప్పుకోగానే జార్డ్ ఇసాక్‌మన్‌కు సంబంధించిన నామినేషన్ కూడా రద్దయిపోయింది. స్పేస్ బిజినెస్‌లో ఉన్న ఇసాక్‌మన్‌కు నాసా పగ్గాలు అప్పగించడం సబబు కాదని భావించానని ట్రంప్ తెలిపారు.

ట్రంప్‌పై మస్క్ తొలి దాడి

మస్క్ తన తొలిదాడిని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎక్కుపెట్టారు. బాలలపై లైంగిక దాడుల కేసుల్లో నిందితుడిగా ఉండి 2019లో పోలీస్ కస్టడీలో మరణించిన జఫ్రీ ఎప్‌స్టీయిన్ వివాదాన్ని ఆయన మరోసారి తెరపైకి తెచ్చారు. ఎప్‌స్టెయిన్ తన క్లయింట్లకు బాలలను సరఫరా చేసేవాడు. ఆ తర్వాత వారిని బెదిరించి డబ్బులు గుంజేవాడు. ఇలాంటి క్లయింట్ల జాబితాలో ట్రంప్ కూడా ఉన్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఎప్‌స్టెయిన్ చనిపోయిన వ్యవహారంలో ఇంతవరకు అరెస్టులు జరగలేదని మస్క్ తాజాగా విమర్శించారు.

జపాన్, దక్షిణ కొరియాలపై 25% మేర సుంకాల హెచ్చింపు

వాషింగ్టన్, జూలై 7: జపాన్, దక్షిణ కొరియా దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై విధిస్తున్న సుంకాలను 25% మేర పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. వివిధ రంగాల వారీగా ఇప్పుడు వసూలు చేస్తున్న పన్నులకు అదనంగా దీన్ని విధిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్ ప్రధాని ఇషిబ షిగేరు, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జాయ్-మయుంగ్‌కు లేఖలు కూడా రాశారు. ఒకవేళ సుంకాన్ని ఎగవేయడానికి ప్రయత్నిస్తే మరింతగా పెంచుతామని పేర్కొన్నారు. ప్రతీకారంగా ఆ దేశాలు కూడా సుంకాలను పెంచితే కఠినంగా ఉంటామని తెలిపారు. పెంచిన శాతాన్ని, ఈ 25 శాతాన్ని కలిపి మొత్తం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ద్వైపాక్షికంగా వాణిజ్యలోటు ఉండకూడదన్న ఉద్దేశంతోనే సుంకాలు పెంచినట్టు చెప్పారు.

టెక్సస్ వరదల్లో 82కు పెరిగిన మృతుల సంఖ్య

కెర్‌విలే, జూలై 7: టెక్సస్‌లో భారీ వరదల కారణంగా మృతి చెందినవారి సంఖ్య 82కు పెరిగింది. 41మంది గల్లంతయ్యారు. ఇంకా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సెంట్రల్ టెక్సస్‌ను మరోసారి వరద ముంచెత్తవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. గల్లంతైనవారి కోసం 17 హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. ధ్వంసమైన నివాసాలు, కార్యాలయాల శిథిలాల కింద చాలా మంది ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కెర్ కౌంటీని తీవ్ర వరద ప్రభావ ప్రాంతంగా గుర్తిస్తూ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం డిక్లరేషన్‌పై సంతకం చేశారు. 11న (శుక్రవారం) సదరు కౌంటీని సందర్శిస్తానని ప్రకటించారు.

కుమార్తెలకు అనారోగ్య సమస్యలు

» అరుదైన జన్యువ్యాధి.. అందుకనే అధికారిక నివాసం ఖాళీ చేయలేదు

» మాజీ సీజేఐ చంద్రచూడ్



న్యూఢిల్లీ, జూలై 7: అరుదైన జన్యువాధితో బాధపడుతున్న తన ఇద్దరు కుమార్తెలకున్న ప్రత్యేక అవసరాల దృష్ట్యానే.. అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలేదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. గతేడాది నవంబరులో రిటైరైన చంద్రచూడ్ ఇప్పటికీ సీజేఐ అధికారిక నివాసంలోనే ఉంటున్నారని, ఆయనను ఖాళీ చేయించాలని కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు పాలనా విభాగం లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై చంద్రచూడ్ వివిధ మీడియా సంస్థలతో మాట్లాడుతూ.. తాను, తన భార్య కల్పన.. ప్రియాంక, మహి అనే ఇద్దరు బాలికలను గతంలో దత్తత తీసుకున్నామని, వారిరువురూ నెమలిన్ మయోపతి అనే అరుదైన జన్యువ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి వల్ల బాలికలిద్దరికీ కండరాలు, నాడీ, శ్వాస సంబంధమైన సమస్యలు తలెత్తుతుంటాయని.. ఈ వ్యాధికి ప్రస్తుతం చికిత్స లేదన్నారు. వారి ప్రత్యేక అవసరాల దృష్ట్యా.. అధికారిక నివాసంలో పలు మార్పులు చేశామని, రిటైర్మెంట్ తర్వాత అటువంటి ఇల్లు కోసం వెదికితే ఢిల్లీలో దొరకలేదన్నారు. పదవీ విరమణ తర్వాత తనకు ప్రభుత్వం కేటాయించిన భవంతిలో గత రెండేళ్లుగా ఎవరూ ఉండటం లేదని, ఆ భవనంలో మరమ్మతులు జరుగుతున్నాయని, అవి పూర్తి కాగానే దాంట్లోకి వెళ్తామన్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్‌కు ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు.

దలైలామాకు మోదీ శుభాకాంక్షలపై చైనా అభ్యంతరం

బీజింగ్, జూలై7: టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు భారత ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు చెప్పడంపై చైనా అభ్యంతరం తెలిపింది. దలైలామా 90వ జన్మదిన ఉత్సవాలకు భారత మంత్రులు, సీనియర్ అధికారులు, ప్రముఖులు హాజరుకావడంపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. టిబెట్‌కు సంబంధించిన వ్యవహారాల్లో చైనా మనోభావాలను అర్థం చేసుకోవాలని సూచించింది. టిబెట్ వ్యవహారాల్లో చైనా వైఖరి స్థిరంగా ఉందని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని పేర్కొంది. సోమవారం చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మీడియాతో మాట్లాడుతూ.. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని భారత్ మానుకోవాలని సూచించారు. దీనిపై భారత్‌కు అభ్యంతరం తెలియజేశామని చెప్పారు.

పాక్ ఆర్మీకి విశ్వాసపాత్రుడైన ఏజెంట్‌ని

2008లో ముంబైపై దాడుల్లో కీలకపాత్ర పోషించా

» దాడులకు ముందు ముంబైలో తిరిగా

» దాడుల సమయంలో ఆ నగరంలోనే ఉన్నా

» హెడ్లీ నా చిన్ననాటి స్నేహితుడు.. మేమిద్దరం కలిసి లష్కరే ఉగ్ర శిబిరాల్లో శిక్షణ పొందాం

» ఎన్ఐఏ విచారణలో తహవ్వుర్ రాణా వెల్లడి!



న్యూఢిల్లీ, జూలై 7: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో ఉన్న ముంబై పేలుళ్ల కేసు నిందితుడు తహవ్వుర్ రాణా.. విచారణలో పలు సంచలన విషయాలు బయటపెట్టాడు. 2008లో ముంబైపై దాడులు (26/11) జరిగిన సమయంలో తాను అక్కడే ఉన్నానని.. ఆ దాడుల వెనుక తన ప్రమేయం ఉందని అతడు అంగీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైల్లో ఉన్న తహవ్వుర్‌ను.. ఎన్ఐఏతోపాటు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కూడా విచారిస్తున్న సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ విచారణలో అతడు తన తప్పులన్నీ ఒప్పుకొన్నాడు. తాను 1986లో రావల్పిండిలోని పాకిస్థాన్ ఆర్మీ వైద్య కళాశాలలో వైద్య విద్య (ఎంబీబీఎస్) పూర్తిచేశానని.. అనంతరం పాక్ ఆర్మీ తనను క్వెట్టాలో కెప్టెన్ (డాక్టర్)గా నియమించిందని చెప్పాడు. తనకు సింధ్, బెలూచిస్థాన్, బహావల్‌పూర్, సియాచెన్-బలోత్రా వంటి సున్నితమైన ప్రాంతాల బాధ్యతలు అప్పగించారని, కానీ ఊపిరితిత్తుల్లో సమస్యల కారణంగా తాను విధులకు హాజరు కాకపోవడంతో ఆర్మీ తనను 'డెజర్టర్'గా ప్రకటించిందని చెప్పాడు (చెప్పాపెట్టకుండా, మళ్లీ తిరిగొచ్చే ఉద్దేశం లేకుండా ఆర్మీని విడిచిపెట్టి పారిపోయేవారిని ఆర్మీ 'డెజర్టర్'గా ప్రకటిస్తుంది). అలా తన మీద పడ్డ 'డెజర్టర్' అనే ముద్రను రికార్డుల నుంచి తొలగించుకోవడానికి.. డేవిడ్ హెడ్లీకి సాయం చేసేందుకు అంగీకరించినట్టు చెప్పాడు. 26/11 దాడులకు ముందు.. 'ఇమ్మిగ్రెంట్ లా సెంటర్' ప్రతినిధిగా డేవిడ్ హెడ్లీ ముంబై, ఢిల్లీ, పుణె సహా పలు నగరాల్లో పర్యటించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఆ కంపెనీని ఏర్పాటు చేయడం వెనుక తానే కీలకపాత్ర పోషించానని రానా విచారణలో తెలిపాడు. ముంబైలో కీలక లక్ష్యాలను గుర్తించడంలో కూడా హెడ్లీకి తాను సాయం చేశానని ఒప్పుకొన్నాడు. దాడులకు ముందు తాను కూడా ముంబైకి చేరుకుని.. ఒక హోటల్‌లో బస చేశానని.. ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ సహా ఆ నగరంలో పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించానని తెలిపాడు. డేవిడ్ హెడ్లీ భారత్‌కు రావడానికి అవసరమైన నకిలీ గుర్తింపు పత్రాలను సృష్టించానని వెల్లడించాడు. పాక్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) సహకారంతోనే దాడులు జరిపినట్టు స్పష్టం చేశాడు. 26/11 దాడుల్లో.. పాకిస్థాన్ ఆర్మీకి విశ్వాసపాత్రుడైన ఏజెంట్‌గా తాను పోషించిన పాత్ర గురించి వివరించాడు. పాకిస్థానీ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో తాను, తన చిన్ననాటి స్నేహితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ శిక్షణ పొందినట్లు తెలిపాడు. గల్ఫ్ యుద్ధం సమయంలో పాక్ ఆర్మీ తనను సౌదీఅరేబియాకు కూడా ఒక రహస్య మిషన్‌పై పంపిందని వెల్లడించాడు.

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

తెలుగు కుటుంబం సజీవదహనం.. నలుగురు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టిన మినీ ట్రక్కు

» మంటలు చెలరేగి కుటుంబం మొత్తం కాలి బూడిద!



మంటల్లో కాలిపోతున్న శ్రీవెంకట్ కారు

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో.. హైదరాబాద్‌కు చెందిన ఓ నిండు కుటుంబం సజీవ దహనం అయింది. కొంపల్లి ప్రాంతానికి శ్రీవెంకట్ బెజుగం, తేజస్విని దంపతులు, వారి ఇద్దరు పిల్లలు సిద్ధార్థ్ బెజుగం, మ్రిదా బెజుగం దుర్మరణంపాలయ్యారు. శ్రీవెంకట్, తేజస్విని ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. వీరు మూడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి, డల్లాస్‌లో ఇల్లు కొనుక్కొని అక్కడే స్థిరపడ్డారు. ఇటీవలే శ్రీవెంకట్.. అట్లాంటాలోని తన అక్క ఇంటికి భార్య, పిల్లలతో సహా వెళ్లారు. వారంరోజులపాటు అక్కడే ఆనందంగా గడిపి తిరిగి వస్తుండగా.. ఆదివారం అర్ధరాత్రి గ్రీన్ కౌంటీ ఏరియాలో.. రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ ట్రక్ వారి కారును ఢీ కొట్టింది. ట్రక్ వేగంగా ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. వెంకట్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆ నలుగురి శరీరాలూ పూర్తిగా కాలిపోవడంతో అధికారులు వారి ఎముకలను సేకరించి.. డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. ట్రక్ డ్రైవర్ తప్పిదమే ఈ ప్రమాదానికి కారణమని స్థానిక పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా.. వెంకట్ కుటుంబం మృతితో హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శ్రీవెంకట్ తల్లిదండ్రులు పశుపతినాథ్, గిరిజ నగరంలోని తిరుమలగిరి టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం వారు డల్లాస్‌లోని తమ కుమారుడి వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నారు.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి.. 'నాట్స్' రూ.85 లక్షల విరాళం

» ముగిసిన నాట్స్ 8వ తెలుగు సంబరాలు.. హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు



బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న నాట్స్ ప్రతినిధులు

(టాంపా నుంచి కిలారు గోకుల్ కృష్ణ): హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి.. ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) రూ.85 లక్షల (లక్ష డాలర్ల) విరాళం అందజేసింది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టాంపాలో నాట్స్ 8వ తెలుగు సంబరాల ముగింపు రోజైన ఆదివారం (ఈ నెల 6న) ఈ విరాళాన్ని ఆస్పత్రి చైర్మన్, సినీనటుడు నందమూరి బాలకృష్ణకు.. నాట్స్ సభల కన్వీనర్ గుత్తికొండ శ్రీనివాస్, బోర్డు చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, అధ్యక్షుడు మందాడి శ్రీహరి, మాజీ అధ్యక్షుడు మదన్ పాములపాటి చేతులమీదుగా అందజేశారు. బాలకృష్ణ-వసుంధర దంపతులను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. సంగీత దర్శకుడు థమన్ బృందంతో కలిసి బాలకృష్ణ పాటలు పాడి అలరించారు. నటీమణులు జయసుధ, మీనా, శ్రీలీలను నాట్స్ ప్రతినిధులు సత్కరించారు. ఎన్టీఆర్ గ్లోబల్ లిటరేచర్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 'శక పురుషుడు' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు వెంకటేశ్, నందమూరి రామకృష్ణ, అట్లూరి అశ్విన్, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, గౌతు శిరీష, వసంత కృష్ణప్రసాద్, అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ కానుకలు బ్యాంకులో డిపాజిట్

» 29.5 కిలోల బంగారు ఆభరణాలు.. విలువ రూ.26.58 కోట్లు



దుర్గమ్మకు కానుకల రూపంలో వచ్చిన బంగారు నగలు

విజయవాడ(ఇంద్రకీలాద్రి), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారు నగలను సోమవారం దుర్గామల్లేశ్వర దేవస్థానం అధికారులు విజయవాడ గాంధీనగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో డిపాజిట్ చేశారు. చాలా కాలంగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన వివిధ రకాల నగలను గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్ కింద 0.60 శాతం వడ్డీపై డిపాజిట్ చేశారు. ఇవి 22 క్యారెట్ల బంగారు నగలు. మొత్తం 29 కిలోల 510 గ్రాముల బరువు ఉన్నాయి. గ్రాము రూ.9,010 రేటు చొప్పున మొత్తం విలువ రూ.26 కోట్ల 58 లక్షల 85 వేలుగా అంచనా వేశారు. సోమవారం నాటి బంగారం ధరలను ఇంటర్‌నెట్‌లో పరిశీలించి ఆ మేరకు విలువ కట్టి బ్యాంకుకు అప్పగించినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ ఈవో శీనానాయక్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ పల్లంరాజు, విజయవాడ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకుడు సుబ్రహ్మణ్యం తదితరుల పర్యవేక్షణలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల నడుమ బ్యాంకులో నగలను అప్పగించారు.

శ్రీవారి భక్తులకు పుస్తక ప్రసాదం

» దాతల సహకారంతో కొత్త పథకం రూపకల్పనలో టీటీడీ

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులకు 'పుస్తక ప్రసాదం' అందించే ఆలోచనలో టీటీడీ ఉంది. టీటీడీ ముద్రించిన ఆధ్యాత్మిక పుస్తకాలను హిందూ ధార్మిక ప్రచార పరిషత్(హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేసేలా ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఇందుకు దాతల సహకారం తీసుకోవాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. 'కర్తవ్యం దైవమాహ్నికమ్, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం, శ్రీనివాసుని దివ్యకథ, భజగోవిందం, లలితా సహస్రనామ స్తోత్రం, రథసప్తమి, కళ్యాణ తేజో దీపిక వంటి వివిధ రకాల పుస్తకాలు భక్తులకు అందించనున్నారు. తొలుత తిరుమలకు వచ్చే భక్తులకు మాత్రమే పుస్తక ప్రసాదం అందిస్తారు. దశల వారీగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తారు. హిందూ భక్తి భావ జాల వ్యాప్తికీ, మతమార్పుడులను అడ్డుకోవడానికి కూడా పుస్తక ప్రసాదం ఉపకరిస్తుందని టీటీడీ భావిస్తోంది.

22న టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 22న చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరుగనుంది. దాదాపు 40 అంశాలపై రూపొందించిన అజెండాపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముడి సరుకుల కొనుగోళ్లపై కూడా చర్చించనున్నారు.

సౌత్ కోస్ట్ రైల్వే పరిపాలనను ప్రారంభించాలి

» సీఎంకు మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ విజ్ఞప్తి

విజయవాడ (రైల్వేస్టేషన్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): సౌత్ కోస్ట్ రైల్వే స్థాపనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించి ఆరు సంవత్సరాలైనా ఇంతవరకు పరిపాలన ప్రారంభించలేదని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సి.హెచ్.శంకరరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచైనా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని కోరారు. సౌత్ కోస్ట్ రైల్వేకు జీఎంను నియమించినప్పటికీ గెజిట్ ఉత్తర్వులు ఇవ్వలేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఫైర్'కు పైత్యం

అగ్నిమాపక శాఖలో అంతులేని అలసత్వం

» కేంద్ర, రాష్ట్రాలు నిధులిచ్చినా ఖర్చు చేయని వైనం
» ఫైరింజన్లు పాతబడినా కొత్తవి కొనని చాదస్తం
» అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా.. విపత్తుల శాఖ దైన్యం
» మొదటి విడత నిధుల్లో పైసా ఖర్చుచేయని పరిస్థితి
» రెండో విడత నిధులకు పొరుగు రాష్ట్రాల ప్రతిపాదనలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సైరన్ మోగిస్తూ వేగంగా వచ్చే ఫైరింజన్లు వయసు మళ్లి కదల్లేకపోతున్నాయి. ఏ మూలకైనా రయ్‌మంటూ చేరుకునే అగ్నిమాపక శకటాలు మొరాయించి మూలకు చేరాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులిచ్చి ఫైరింజన్లు కొనుక్కోమని చెప్పినా అలసత్వంతో నిధులు మురగ బెట్టేస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులది నిర్లక్ష్యమా? లేక చాదస్తమా? అనేది పక్కన బెడితే.. వరదలు సంభవిస్తే సహాయ చర్యలకు అక్కడికి చేరుకునేందుకు ఫైరింజన్లు కదలవు. కొనుగోలు చేయాల్సిన బోట్లు కొనలేదు. ఆఖరికి సిబ్బందికి బూట్లు కూడా లేవు. అన్నింటా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని పదే పదే చెబుతోన్న కూటమి ప్రభుత్వంలో పది నెలల క్రితం నిధులు మంజూరైనా ఖర్చు చేయకుండా నాన్చుతున్న అగ్నిమాపక శాఖ అధికారుల పనితీరుతో అది ఎలా సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని.. అనే సామెతను వీరి అలసత్వం గుర్తు చేస్తోంది.

ఆధునికీకరణకు రూ.252 కోట్లిచ్చినా..

రాష్ట్రంలో ప్రస్తుతం 230 ఫైరింజన్లు ఉండగా, వాటిలో 60శాతానికిపైగా పదిహేనేళ్లు పైబడినవే. దీంతో వాటికి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చేది లేదని రవాణా శాఖ అధికారులు ఆర్నెల్ల క్రితమే స్పష్టం చేశారు. వాటిలో 75 వాహనాలు గుజిరీకి వేయాల్సిందేనని తేల్చిచెప్పడంతో అగ్నిమాపక శాఖ ఆ పనిని పూర్తి చేసింది. అదే సమయంలో రూ.252 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందులో కేంద్రం వాటా రూ.189 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.63 కోట్లు భరించాల్సి ఉంది. ఇందుకు చంద్రబాబు ప్రభుత్వమూ సమ్మతి తెలిపింది. రాష్ట్రంలో 125 అత్యాధునిక ఫైరింజన్లు కొనుగోలు చేసుకుని, 17 చోట్ల ఫైర్ స్టేషన్లు నిర్మించుకోవాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగ్గా అగ్నిమాపక సేవలు అందించడానికి ఫైర్ ఫైటింగ్ అత్యాధునిక పరికరాలు సమకూర్చుకోవడం, దూళపల్లిలో శిక్షణకేంద్రాన్ని మెరుగుపరచుకోవడం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది. అందుకోసం మొదటి విడతగా కేంద్రం రూ.58 కోట్లు విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.17కోట్లు గతేడాది ఆగస్టులోనే విడుదల చేసింది. ఆ మొత్తం రూ.75కోట్లతో 125 ఫైరింజన్లు, సముద్ర తీరం ఎక్కువగా ఉన్న రాష్ట్రం గనుక 60 బోట్లు, సిబ్బందికి బూట్లు, ప్రత్యేక రక్షణ సూట్లు కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు పదినెలలు పూర్తైనా కనీసం టెండర్లు పిలవకపోవడం వారి పనితీరుకు నిదర్శనం. అలాగే, దక్షిణ భారతంలోనే అత్యుత్తమ శిక్షణ కేంద్రాన్ని దూళపల్లిలోని పదిహేను ఎకరాల్లో నిర్మించి జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పి ఏడాది గడుస్తున్నా పనులు కాగితాలు దాటలేదు.



రూ.500 కోట్ల అదనపు నిధులపై ప్రభావం..

విడతల వారీగా నిధులు మంజూరు చేసే కేంద్ర ప్రభుత్వానికి మొదటి విడత నిధులు ఖర్చు చేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్(యూసీ) ఇస్తేనే రెండో దశ నిధులు విడుదలవుతాయి. మన పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, ఒడిశా ఇప్పటికే తొలి విడత నిధులు ఖర్చు చేసి యూసీలు ఇచ్చి రెండో విడత ప్రతిపాదనలు కూడా పంపాయి. దేశంలోనే నెంబర్ వన్‌గా ఉంటామని చెబుతోన్న మనం ఇప్పటికీ పైసా ఖర్చు చేయకుండా వెనుకబడ్డాం. దీని పర్యవసానం రాబోయే రోజుల్లో రూ.500కోట్ల అదనపు నిధులపై పడే అవకాశం ఉందని ఆ శాఖ సిబ్బందే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» చైర్మన్‌కు 24 డిమాండ్లతో ఈయూ నాయకుల వినతి

విజయవాడ(బస్సుస్టేషన్), జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ చైర్మన్‌ను సోమవారం ఆయన చాంబర్‌లో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి 24 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) ద్వారా వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, పాత పద్ధతిలో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని కోరారు. కాగా..దేశవ్యాప్తంగా ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలుపుతున్నట్టు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఓ ప్రకటనలో తెలిపింది.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

అనంతపురం రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో అనంతపురం జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన కప్పల కరుణాకర్(32)కు ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. వేరుశనగ, కంది, కూరగాయలను సాగు కోసం రూ.10 లక్షలకు పైగా అప్పులు చేశాడు. దిగుబడులు సరిగా రాక అప్పులు తీర్చలేక ఈ నెల 3న పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కూడేరు మండల కేంద్రానికి చెందిన కటిక గురుస్వామి(55)కి పదకొండున్నర ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ, వరి తదితర పంటలు సాగు చేసేవాడు. దిగుబడి సరిగా రాక అప్పులు రూ.6 లక్షలకు పైగా పేరుకుపోయాయి. వాటిని తీర్చేమార్గం లేక ఆదివారం రాత్రి ఉరి వేసుకున్నాడు.

సీఏ ఫలితాల్లో సత్తా చాటిన మాస్టర్ మైండ్స్



వివరాలు వెల్లడిస్తున్న మాస్టర్ మైండ్స్ అడ్మిన్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్

గుంటూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విడుదల చేసిన సీఏ ఫైనల్, ఇంటర్, ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. సోమవారం గుంటూరు బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ విద్యార్థులు కొండ్ల సాయిరామరెడ్డి 23వ ర్యాంకు, కురువ మోహన్ 26, ఎస్.నిఖిల్ జైన్ 33, బి.నాగిరెడ్డి 41, పి.పూజిత 43వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. అదే విధంగా సీఏ ఇంటర్లో డి.నాగ సాయి లక్ష్మణ్ 15వ ర్యాంకు, జె.శరత్ చంద్ర 29 ర్యాంకులు సాధించారు. ఇంకా సీఏ ఫౌండేషన్‌లో గుంటూరు పూజిత 16, గుండాల సాయి పద్మ, పెనుగొండ సాయి రాఘవేంద్ర రెడ్డి 17వ ర్యాంకులు సాధించారని వెల్లడించారు.

ఎట్టకేలకు స్వదేశానికి నజీర్

» ఏపీ ప్రభుత్వం, 'సాటా సెంట్రల్' చొరవ
» ఉద్యోగం కోసం వెళ్లి.. పశువుల కాపరిగా మారిన నెల్లూరు వాసి



(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబాల్లో.. ఎదిగిన కొడుకు కష్టపడితేనే ఆయా కుటుంబాలకు ఒక ఆసరా. ఈ క్రమంలో ఆ కష్టమేదో ఏ అరబ్బు దేశంలోనో చేస్తే.. నాలుగు రాళ్లు వెనకేసుకుని..పేదరికాన్ని జయించవచ్చన్న కలలు కొందరికి సార్థకమవుతుండగా, మరికొందరికి దళారుల కారణంగా శాపంగా మారుతున్నాయి. నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన 23 ఏళ్ల షేక్ నజీర్ ఇలాగే గల్ఫ్ దేశంలో చిక్కుకుపోయాడు. ఎట్టకేలకు అక్కడి కష్టాల నుంచి గట్టెక్కి స్వదేశానికి రానున్నాడు. వివరాలివీ.. షేక్ నజీర్ కుల్లూరు గ్రామంలో చిన్నచిన్న పనులు చేసుకొంటూ గడిపేవాడు. పేద కుటుంబం కావడంతో.. ఎక్కడికైనా వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకున్నాడు. కొందరు దళారుల సాయంతో సూపర్‌మార్కెట్‌లో ఉద్యోగమని నమ్మి సౌదీ అరేబియా వెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక దళారులు మోసం చేయడంతో వేల కిలోమీటర్ల దూరంలోని మారుమూల పల్లెలో పశువుల కాపరిగా, తర్వాత వ్యవసాయ కూలీగా మారాడు. దీంతో తాను మోసపోయిన విషయాన్ని, తాను ఎదుర్కొంటున్న కష్టాలను వివరిస్తూ తల్లిదండ్రులకు వీడియో పంపించాడు. వారు ఆందోళన చెంది వెంటనే కొందరి సాయంతో సౌదీలోని తెలుగు ప్రవాసీయుల సంఘం 'సాటా సెంట్రల్' ప్రతినిధులు షేక్ జానీ బాషా, రంజిత్, ముజమ్మీల్, నరేంద్రలను సంప్రదించారు. దీనిపై జానీ బాషా బృందం వెంటనే స్పందించి, రియాద్ నుంచి సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలో నజీర్ ఉంటున్న ప్రాంతానికి, అతడు పంపిన జీపీఎస్ ఆధారంగా పయనమైంది. అయితే వారు ప్రయాణిస్తు కారు జీపీఎస్ సిగ్నల్ అందక దారితప్పి మధ్యలో ఇసుకలో దిగబడింది. అయినప్పటికీ జానీ బాషా బృందం కొన్ని వందల కిలోమీటర్ల దూరం కాలినడకన నజీర్‌ను చేరుకొంది. ఈ క్రమంలో నజీర్ కథనం 'ఆంధ్రజ్యోతి'లో రావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌తో పాటు ఏపీ ఎన్నార్టీ సంస్థ ఉన్నతాధికారులు స్పందించారు. రియాద్ నగరంలో నజీర్‌కు ఆశ్రయం కల్పించి, భారతీయ ఎంబసీ చొరవతో సౌదీ ప్రభుత్వ అధికారుల సాయంతో నజీర్ ఇండియా రావడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. విమాన టికెట్ కూడా సమకూర్చగా, నజీర్ ఒకటి రెండ్రోజుల్లో స్వదేశానికి చేరుకుంటారని జానీ బాషా బృందం వెల్లడించింది.

'తల్లికి వందనం' రాలేదని టవర్ ఎక్కాడు!



భీమవరం క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన బిడ్డలకు 'తల్లికి వందనం' నగదు రాలేదంటూ ఒక వ్యక్తి 33 కేవీ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మద్యం మత్తులో శ్యామ్ అనే వ్యక్తి సోమవారం విద్యుత్ టవర్ ఎక్కాడు. ఈ నెల 5వ తేదీన కూడా ఒకటో పట్టణంలోని విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులు సముదాయించి కిందకు దింపారు. ఈ క్రమంలో మళ్లీ సోమవారం టవర్ ఎక్కిన సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్లే ఇలా చేస్తున్నాడని, వైద్యం అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ కాళీచరణ్ చెప్పారు.

తిరుపతిలో సైకో వీరంగం

» కత్తి, కర్రతో ముగ్గురిపై దాడి, ఒకరి మృతి



దాడికి పాల్పడిన వ్యక్తి

తిరుపతి(నేరవిభాగం), జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో సోమవారం ఉదయం 7.15 గంటలకు ఓ సైకో వీరంగం సృష్టించాడు. తమిళనాడుకు చెందిన మతి స్థిమితంలేని వ్యక్తి కొన్ని నెలలుగా తిరుపతిలో తిరుగుతూ వాహనాలపై రాళ్లు రువ్వడం, ఫుట్‌పాత్‌లపై ఉన్న యాచకులపై రాళ్లదాడి చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం నంది సర్కిల్ వద్ద దాదాపు 10 మందిపై రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో ఐదారుగురు గాయపడ్డారు. అదే సమయంలో అక్కడున్న శేఖర్ అనే యాచకుడితో వాగ్వాదానికి దిగాడు. అది కాస్త కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో తన చేతిలోని కర్ర, కత్తితో శేఖర్ తలపై బలంగా మోదాడు. అక్కడ ఉన్న యాచకురాలు కల్పన అడ్డుకోగా.. ఆమెనూ కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అక్కడే పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న సుబ్రహ్మణ్యం సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా, అతన్నీ సైకో గాయపరిచాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి శేఖర్‌ను రుయాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మరో ఇద్దరు రుయాలో చికిత్స పొందుతున్నారు. సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ సైకోపై లునటిక్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

నా భార్యను తుర్కియే నుంచి కాపాడండి

» కైండ్‌నెస్ సొసైటీని ఆశ్రయించిన పశ్చిమ జిల్లావాసి



కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడికి వినతి పత్రం అందిస్తున్న దానియేలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం తుర్కియే(టర్కీ) వెళ్లిన తన భార్య, అక్కడి పని ఇచ్చిన ఓ యజమాని చేతిలో చిత్రహింసలు అనుభవిస్తోందని, ఆమెను కాపాడాలంటూ పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు అగ్రహారానికి చెందిన మద్దా దానియేలు తాడేపల్లిగూడేనికి చెందిన కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావుకు విన్నవించారు. ఏడు నెలల క్రితం తన భార్య రోహేలు ఖతార్ దేశం వెళ్లగా, అక్కడి ఏజెంట్ మోసం చేసి తుర్కియే పంపించారన్నారు. తుర్కియేలో ఓ యజమాని తన భార్యకు అన్నం కూడా పెట్టకుండా గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారని, అది తెలిసి తన పిల్లలిద్దరూ బెంగ పెట్టుకున్నారని వాపోయాడు. రోహేలు తండ్రి ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, తన భార్యను రక్షను రక్షించి స్వదేశానికి రప్పించాలని కోరారు. దీనిపై మాణిక్యాలరావు మాట్లాడుతూ ఎంబసీతో సంప్రదించి. వీలైనంత త్వరగా ఇండియాకు రప్పిస్తానని హామీ ఇచ్చారు.

పవన్‌పై ఇన్‌స్టాలో అనుచిత వ్యాఖ్యలు.. కేసు నమోదు

గంగాధరనెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఇన్‌స్టా గ్రామ్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన చిత్తూరు జిల్లాలోని గంగాధరనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మిపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసంతి తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

భక్తులతో కిటకిటలాడిన బారాషహీద్ దర్గా



స్వర్ణాల చెరువు ఘాట్‌లో భక్తజనం



స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటున్న మహిళలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టం గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత వేడుకగా జరిగింది. నగరంలో కోటమిట్ట అమీమియా మసీదు నుంచి 12 బిందెలతో గంధాన్ని మేళతాళాలు, ఫకీర్ల షరబ్‌లు ఊరేగింపుగా దర్గాకు చేరింది. పోలీసు పటిష్ట బందోబస్తు మధ్య కడప పెద్ద మసీదు పీఠాధిపతులు ఆరీఫ్‌వుల్లా బృందం, బారాషహీదులకు పూజలు చేసి గంధం ఎక్కించారు. ఈ కార్యక్రమంలో భక్త సుగంధాన్ని ప్రసాదంగా అందుకునేందుకు భక్తుల ఎగపడ్డారు. ఇక పండుగలో రెండో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి బారాషహీదులను దర్శించుకుంటున్నారు. స్వర్ణాల ఘాట్‌లో కోర్కెలు తీర్చే వరాల రొట్టెలను భక్తులు ఇచ్చిపుచ్చుకున్నారు. విద్య, ఉద్యోగం, ప్రమోషన్, సంతానం, గృహం, ఆరోగ్యం, వంటి రొట్టెలు కోసం భక్తులు ఎగబడ్డారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సోమవారం సాయంత్రం బారాషహీద్ దర్గాను దర్శించుకుని, ఆరోగ్య రొట్టెను అందుకున్నారు.



అనంతపురం జిల్లా కూడేరు మండలంలోని పీఏబీఆర్ పంప్ హౌస్‌లో మోటారు ఆన్ చేస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఆరు నెలల్లోనే ఉరవకొండకు తాగునీరిచ్చాం

» ఎన్నికల హామీని నెరవేర్చాం: పయ్యావుల కేశవ్
» 16 కోట్లతో చేపట్టిన పథకం ప్రారంభం

ఉరవకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు ఉరవకొండ పట్టణ తాగునీటి సమస్యను ఆరు నెలల్లోనే పరిష్కరించామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. ఒక పథకాన్ని చేపట్టి ఇంత తక్కువ కాలంలో పూర్తి చేయడం రికార్డు అని అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జలజీవన్ మిషన్ కింద రూ.16 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పంప్‌హౌస్‌లో మోటారు ఆన్ చేసి, పట్టణానికి నీటిని విడుదల చేశారు. కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు తాగునీటిని తరలించేలా దీనిని నిర్మించారు. అంతకు ముందు పీఏబీఆర్ పంప్ హౌస్‌లో మోటారును ఆన్ చేసి, ఈ పథకానికి నీటిని విడుదల చేశారు. నీటి శుద్ధి ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ హయాంలో తాగునీటి పథకం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. ఉరవకొండ తాగునీటి పథకానికి పూర్తి స్థాయిలో నీరు రావడానికి మరో రెండు నెలల సమయం పడుతుందని అన్నారు. గతంలో ఉరవకొండకు 15 రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క మీటరు పైప్‌లైన్ కూడా వేయలేక పోయారని విమర్శించారు. పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు, ప్రణాళికలు సిద్ధం చేసినా, పూర్తి చేయలేకపోయిన అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అని విమర్శించారు. ఉరవకొండకు మరో 30 ఏళ్లవరకూ తాగునీటి సమస్య లేకుండా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో పరిశుభ్రతపై దృష్టిపెడతామని తెలిపారు.

అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి

» మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి



రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, దీనికోసం సీఆర్‌డీఏ 25 ఎకరాల స్థలాన్ని గుర్తించిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన ఈఎస్ఐ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఇక్కడ 191 పోస్టుల్లో 97 రెగ్యులర్, 94 అవుట్ సోర్సింగ్ విధానంలో మంజూరయ్యాయని చెప్పారు. గుంటూరు, శ్రీసిటీ, కర్నూలు, పెనుగొండలలో కొత్త ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణం కోసం భూములు గుర్తించామన్నారు. రాష్ట్రంలో 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలకు ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. పలు ఆసుపత్రుల్లో వివిధ కేటగిరీల్లో ఉన్న 580 పోస్టులను రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అనుమానాస్పదం!

బిహార్‌లో నాలుగునెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ తీవ్ర రాజకీయ దుమారం రేపింది. 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–సర్) పేరుతో ఈసీ సాగిస్తున్న ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ లాలూ యాదవ్ పార్టీ ఆర్జేడీతో పాటు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), తృణమూల్ నేత మహువా మొయిత్రా, యోగేంద్రయాదవ్ ఇత్యాదులు పిటిషన్లు వేశారు. భారతరాజ్యాంగంలోని పలు అధికరణలను, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని పలు నిబంధనలను జూన్ 24న ఈసీ జారీ చేసిన ఆదేశాలు ఉల్లంఘిస్తున్నందున వాటిని రద్దుచేయాలన్నది ఈ పిటిషన్ల సారాంశం. స్వల్పవ్యవధిలో పౌరులు తమ ఉనికినీ, నివాసాన్నీ రుజువుచేసుకోలేక ఆఖరుకు లక్షలాదిమంది ఓటుహక్కు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోందని పిటిషన్‌దారులు సర్వోన్నత న్యాయస్థానానికి తెలియచేశారు. గురువారం అత్యవసర విచారణకు అంగీకరించిన కోర్టు, అంతవరకూ 'సర్' మీద స్టే విధించడానికి మాత్రం ఒప్పుకోలేదు. మోదీ ప్రభుత్వం అమితంగా ఆధారపడే, ప్రతీ సంక్షేమంతోనూ అనుసంధానించే ఆధార్ కార్డు కానీ, ఎన్నికల సంఘం స్వయంగా జారీ చేసిన ఓటరు గుర్తింపుకార్డు కానీ ఈ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'లో పౌరులు సమర్పించాల్సిన అధీకృత డాక్యుమెంట్ల జాబితాలో లేవు.

కోర్టులో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని కాబోలు, బిహార్ ఓటర్లకు ఆదివారం ఈసీ కొన్ని సూచనలు చేసింది. జూలై 25కల్లా అధీకృత డాక్యుమెంట్లు చూపించకుంటే ఓటర్లను జాబితానుంచి తొలగిస్తానని ఈసీ అంటోందని విపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో, ఆదివారం కొన్ని పత్రికల్లో హిందీలో ప్రకటనలు విడుదలచేసింది. 'బూత్‌స్థాయి అధికారి మీకు అందించిన ఎన్యుమరేషన్ ఫారమ్ నింపి డాక్యుమెంట్లు, ఫోటో జతచేసి ఇవ్వండి. సమర్థింపు పత్రాలు సిద్ధంగా లేనిపక్షంలో నింపిన ఫారమ్ ఇచ్చేస్తే సరిపోతుంది. తగిన డాక్యుమెంట్లు ఉంటే, దరఖాస్తును ప్రాసెస్ చేయడం సులువు, లేనిపక్షంలో అంతిమంగా సదరు అధికారి స్థానికంగా విచారించి ఏ నిర్ణయమూ తీసుకుంటాడు' అన్నది ఆ ప్రకటన సారాంశం. ఉపరితలంలో ఏదో మినహాయింపు, వెసులుబాటుగా కనిపిస్తున్నా ఈసీ చెప్పదల్చుకున్నదేమిటో అర్థమవుతూనే ఉంది.

2003లో 'సర్' జరిగింది కనుక, ఆ తరువాత ఓటర్ల జాబితాలో చేరివచ్చినవారి పుట్టుపూర్వోత్తరాలని పరీక్షించి, అర్హులు కానివారిని ఏరివేయడం ఈసీ ఉద్దేశం. ఆర్జేడీ, కాంగ్రెస్ ఓటుబ్యాంకు అయిన దళితులు, ప్రధానంగా ముస్లింలను ఏరివేయడం లక్ష్యంగా ఇది ఆరంభమైందని ఆ పార్టీలు అంటాయి. మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుంచి బిహార్‌కు అక్రమవలసలు అత్యధికంగా జరిగిపోతూ, మరోపక్క లక్షలాది మంది బిహారీ యువకులు ఇతర రాష్ట్రాలకు ఉపాధికి వలసపోతున్న తరుణంలో జాబితాను ప్రక్షాళించకపోతే ఎలా అన్నది ఈసీ, దాని సమర్థకుల వాదన. 2003 జనవరి 1 తరువాత జాబితాలోకి ఎక్కినవారినందరినీ ఈసీ అనుమానిస్తున్నదని అర్థం. అంతేనా, ఆనాటినుంచి నేటివరకూ జరిగిన ఐదు పార్లమెంట్, ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో వీరంతా అక్రమంగా ఓటేశారని కూడా ఒప్పుకున్నట్టే. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితాలనే ఏడాదికాలంగా చేర్పులూ తొలగింపులతో అప్‌డేట్ చేసుకుంటూ పోయి, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వాటినే వాడటానికి గతనెలలోనే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు తీర్మానించుకున్న తరువాత, హఠాత్తుగా ఈసీకి ఈ బుద్ధి ఎందుకు పుట్టిందో తెలియదు. రెండు దశాబ్దాలనాటి 'సర్' ఏడాదిపాటు కొనసాగడమే కాదు, నిర్దిష్టకాలపరిమితిలో ఓటర్లుగా నమోదైనవారిని ఇలా అనుమానించిందీ లేదు. సిద్ధం చేసిన జాబితాలో అనుమానాస్పద అంశాలేమీ లేవని స్థానిక అధికారులు చెబుతున్నప్పటికీ, బీజేపీ వ్యతిరేక ఓటర్ల ఏరివేత లక్ష్యంగానే కేంద్ర ఎన్నికల సంఘం హఠాత్తుగా ఈ నిర్ణయానికి వచ్చిందని విపక్షాల విమర్శ. ఇంటింటికీ పోయి సర్వేలు చేయడం నుంచి, జాబితాలు సిద్ధం చేయడం వరకూ సమస్తమూ రెండునెలల్లోనే చక్కబెట్టగల వ్యవస్థ తన దగ్గర ఉన్నదనీ, వేలాదిమందిని రంగంలోకి దించానని ఈసీ చెప్పుకుంటోంది. కానీ, కొత్తగా ఓటర్లయిన దాదాపు మూడు కోట్లమంది బిహారీల్లో ఎంతమంది తమ పుట్టుక, ఊరు, చదువుతో పాటు, తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలనూ చూపించి 1955నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సి) నిర్దేశించిన రీతిలో తమ పౌరసత్వాన్ని ఇంత స్వల్పకాలంలో రుజువుచేసుకోగలరన్నది ప్రశ్న.

'ఉపాధి హామీ'పై పరిమితి, పేదలకు నష్టం


ఉపాధి ఆదాయం కోసం మాత్రమే కాదు, అది మానవ గౌరవానికి సంబంధించింది.

– జీన్ డ్రెజ్, ఆర్థిక శాస్త్రవేత్త

ఇలాంటి గౌరవాన్ని కాపాడడమే లక్ష్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరెగా) రూపొందింది. ఒక కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల పనిని హామీ ఇచ్చే ఈ చట్టాన్ని భారత సుప్రీంకోర్టు సామాజిక న్యాయానికి ఆలంబనగా నిలిచిన చట్టంగా అభివర్ణించగా, ప్రపంచంలో అతిపెద్ద పని హామీ పథకంగా 'గ్రామీణ ఉపాధి'ని ప్రపంచ బ్యాంకు గుర్తించింది.

కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటం, వేతనాల చెల్లింపుల్లో కావాలనే ఆలస్యం చేయడం, సాంకేతిక జోక్యాల పేరుతో కార్మికులపై భారం వేయడం... ఇవన్నీ దీని లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా నరెగాకి సంబంధించి ఇటీవల కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం ఈ పథకాన్ని పూర్తిగా నిస్సారంగా మార్చే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ఆ నిర్ణయం ఏమిటి? దాని ప్రభావం కార్మికులపై ఎలా ఉండబోతుంది అనే అంశాలను చర్చిద్దాం. చర్చలోకి వెళ్లేముందు నరెగా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కొన్ని ప్రాథమిక విషయాలు మననం చేసుకుందాం.

నరెగా– ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కార్యక్రమం. అయితే ఆర్థిక సంవత్సరం మొదట్లో ఆ సంవత్సరంలో ఉపాధి హామీలో పని డిమాండ్ ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి, కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్లో అంచనాగా ఆ నిధులు కేటాయిస్తుంది. మునుపటి సంవత్సరపు నిధుల వినియోగం, రాష్ట్రాల నుంచి వచ్చే అభ్యర్థనలు దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు జరుగుతుంది. అయితే కేటాయించిన నిధులు ఖర్చు కాగానే, రాష్ట్రాలు అదనపు నిధుల కోసం కేంద్రాన్ని ఆశ్రయిస్తాయి. ఆ అభ్యర్థనలు పరిశీలించి కేంద్రం అదనపు నిధులు విడుదల చేస్తుంది. అంటే సిద్ధాంత పరంగా ఉపాధి హామీ బడ్జెట్ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులకు గల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే అసలు ఉపాధి హామీ బడ్జెట్‌ను కట్టడి చేయడం చట్ట మూల సూత్రాలకు వ్యతిరేకం.



తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలలోని పేద ప్రజలు నష్టపోయే అవకాశం ఎక్కువ. గ్రామీణ పేదల హక్కులను కాలరాసే, వారి జీవనోపాధిని దెబ్బతీసే కొత్త నిబంధనలపై ప్రభుత్వం తిరిగి సమీక్షించాలి. లేకపోతే ప్రధాని నిత్యం వల్లించే 'మంచి ఉద్దేశంతో కూడిన మంచి పాలన' నినాదం నీటిమీద రాతగా మిగులుతుంది.

అసలు విషయానికి వస్తే, ఈ సంవత్సరం మే 29న కేంద్ర ఆర్థిక శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖకు ఒక అధికారిక లేఖ (ఆఫీస్ మెమొరాండం) జారీ చేసింది. అందులో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి అర్ధ సంవత్సరం (ఏప్రిల్–సెప్టెంబర్)లో నరెగా కోసం కేటాయించిన వార్షిక బడ్జెట్లో 60 శాతం వరకే ఖర్చు చేయాల్సిందిగా సూచించింది. ఈ నిర్ణయానికి వెనుక ఉన్న కారణాలను కేంద్రం స్పష్టంగా, బహిరంగంగా వెల్లడించలేదు. అయితే లేఖలో మాత్రం ఇది ఆర్థిక నిర్వహణపరమైన నిర్ణయమని మాత్రమే రేఖామాత్రంగా పేర్కొంది. కానీ ఈ నిర్ణయం పలు సమస్యలకు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు; ఇందుకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనుభవాలను ఉదాహరణలుగా చూపుతున్నారు.

మొదటిగా, ఈ కొత్త విధానంలో ముఖ్యమైన అంశం– క్షేత్రస్థాయి అవసరాలతో సంబంధం లేకుండా, సంవత్సరం ప్రారంభంలోనే అంచనాల ఆధారంగా నరెగా నిధుల వినియోగాన్ని పరిమితం చేయడం. దీని ప్రకారం, నరెగా ఖర్చును ముందస్తుగా నియంత్రించాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉందని అనుమానించక తప్పదు. ఈ అనుమానానికి కారణాలు ఉన్నాయి.

ప్రతి ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం ఖర్చయిన తర్వాత, అదనంగా నిధులు మంజూరు చేయడం సాధారణంగా అనుసరించే విధానం. కానీ గత దశాబ్దంలో తొలిసారిగా, 2024–25లో, కేటాయించిన మొత్తం ఖర్చు అయినప్పటికీ, కేంద్రం అదనపు నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా, గత సంవత్సరం ఎక్కువగా పనులు నమోదవుతున్న తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో 'నియమాల ఉల్లంఘన' అనే పేరుతో ఉపాధి హామీ పనులకు అడ్డంకులు కలిగించింది.

నిజానికి ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో గ్రామీణులు పని కోసం దరఖాస్తు చేసుకున్నా, వారికి పని లభించడం లేదని, పథకం అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పని డిమాండ్‌ను కృత్రిమంగా తక్కువ చేసి చూపుతున్నారని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం 2023–24లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పేర్కొంది. ఇప్పుడిక ఆ పరిమితి విధించే పనిలో కేంద్రం కూడా పాలుపంచుకుంటుందని అనిపించక మానదు.

అలాగే రెండో అంశానికి వస్తే– 2025–26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నరెగాకు రూ.86వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు కేంద్రం తెచ్చిన నియమాల ప్రకారం, తొలుత ఆరు నెలల కాలానికి 60 శాతం మించి అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రాలు రూ.51,600 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేయలేవు. ఉపాధి కోరితే ప్రభుత్వం పనిని కల్పించాలి అన్న నిబంధన ఉండగా, ఇప్పుడు కేంద్రం జరిపిన కేటాయింపుల పరిమితిని చూపిస్తూ పనిని నిరాకరించే అవకాశం ఉంది. ఇది నేరుగా చట్టాన్ని ఉల్లంఘించడమే.

ఇక మూడో విమర్శకు వస్తే– ఆరు నెలలకు అందుబాటులో ఉన్న 60 శాతం కేటాయింపు అంటే పైన పేర్కొన్న విధంగా రూ.51,600 కోట్ల నుంచి గత ఏడాది పెండింగ్‌లో ఉన్న రూ.18,300 కోట్ల బకాయిలను తీర్చాల్సి ఉంటుంది. అలా చేస్తే ఈ సంవత్సరంలో కొత్తగా పనికి మిగిలే మొత్తం కేవలం రూ.30,600 కోట్లు మాత్రమే. గత సంవత్సరంలో నరెగాలో ఒక కార్మికునికి ఒక్క రోజు పని కల్పించడానికి రూ.390 ఖర్చు అయ్యింది. అదే లెక్కన ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో కేవలం 78 కోట్ల పని దినాలు మాత్రమే కల్పించగలిగే అవకాశం ఉంది. గత సంవత్సరం మొదటి ఆరు నెలల్లో నరెగాలో 161 కోట్ల పని దినాలు నమోదు అయ్యాయి. అంతే కాకుండా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఖర్చు చేయడానికి అవకాశం ఉన్న రూ.51,600 కోట్లలో 56 శాతం జూన్ 29 నాటికే ఖర్చు అయిపోయింది. ఇక మిగిలిన నాలుగు శాతం నిధులతో మిగతా మూడు నెలలు పనులు నడపాలి.

నిజానికి ఈ సంవత్సరమే కాదు, ప్రతి ఏడాది మొదటి ఆరు నెలల్లో బడ్జెట్‌లో దాదాపు 20 నుంచి 25 శాతం వరకు నిధులు గత సంవత్సరపు బకాయిల చెల్లింపునకే ఖర్చవుతున్నాయి. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఖర్చులను ముందుగానే పరిమితం చేయడం వల్ల, కార్మికులకు అవసరం అయినప్పుడు పని దొరకకుండా పోయే అవకాశం ఎక్కువగా ఉంది. కేంద్రం ఈ నిర్ణయానికి 'ఆర్థిక మేనేజ్‌మెంట్' అనే పేరు పెట్టినా, దీని వెనుక ఉన్న ప్రాతిపదిక పూర్తిగా తప్పు అవగాహనపై ఆధారపడింది. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఎక్కువ. ఎందుకంటే మొదటి ఆరు నెలల్లో తెలుగు రాష్ట్రాలలో అధికంగా ఉపాధి హామీ పనులు జరుగుతాయి. ఉదాహరణకు 2024–25లో మొదటి ఆరు నెలల్లో తెలంగాణలో 84శాతం పనులు జరగగా, ఆంధ్రప్రదేశ్‌లో 74 శాతం పనులు జరిగాయి. కారణం– మన తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. వర్షాలు ముమ్మరంగా పడుతూ, వ్యవసాయ పనులు అందుబాటులో ఉన్నప్పుడు నరెగా కార్మికులు వ్యవసాయ పనులకు హాజరవుతారు. నరెగా పనుల్ని వేరే ఉపాధి అవకాశాలు లేనప్పుడు ఉపయోగించుకుంటారు.

మొత్తానికి కేంద్ర నిర్ణయం వల్ల ప్రధానంగా ఆదివాసీలు, దళితులతో సహా అణగారిన వర్గాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఎందుకంటే ఉపాధి పనులలో వాళ్ళే ఎక్కువగా పాల్గొంటున్నారు. ఉదాహరణకు దేశంలో ఆదివాసీల జనాభా కంటే ఉపాధి హామీ పనిదినాలలో వారి వాటా 2.5 రెట్లు ఎక్కువ. ఈ మార్పు ప్రకటించడంలో కేంద్రం తీసుకున్న ధోరణి కూడా గర్హనీయం. రాష్ట్ర ప్రభుత్వాలతో, గ్రామ పంచాయతీలతో, కార్మిక సంఘాలతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఇది. ఉపాధి హామీ వేదికగా గ్రామీణ ప్రజల జీవితాల్లో ఒక సామాజిక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో, దీన్ని తగ్గించే చర్యలు వారిపై నైతిక, ఆర్థిక దాడులుగా మారుతున్నాయి.

ఉపాధి హామీ పథకం డిమాండ్–ఆధారిత హక్కుగా ఉండాలి. ఇది చట్టబద్ధ హామీ. కానీ కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఇది సరఫరా పరిమిత పథకంగా మారే ప్రమాదం ఉంది. ఇది కేవలం పరిపాలనా మార్పు కాదు. గ్రామీణ పేదల హక్కులను కాలరాసే, వారి జీవనోపాధిని దెబ్బతీసే చర్య. ప్రభుత్వం దీనిపై తిరిగి సమీక్షించాలి. లేకపోతే ప్రధాని నిత్యం వల్లించే 'మంచి ఉద్దేశ్యాలతో కూడిన మంచి పాలన' (Good governance with good intentions) నినాదం నీటిమీద రాతగా మిగులుతుంది.

■ చక్రధర్ బుద్ధ

సామ్రాజ్యవాద అంతిమ బుసలు!

అమెరికా సామ్రాజ్యవాదులు తమ తొత్తు నెతన్యాహు ఫాసిస్టు ప్రభుత్వాన్ని రంగంలోకి దింపటమే కాకుండా, యుద్ధం ఆరంభమైన పదవ రోజున ఇరాన్‌పై ప్రత్యక్షంగా బంకర్ విధ్వంసక బాంబు దాడులు జరిపి, అణు ఇంధన పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ధ్వంసం చేశారు. ఇది ఇరాన్ సార్వభౌమాధికారాన్నీ, ఐరాస నిబంధనావళినీ, అంతర్జాతీయ చట్టాన్నీ ఉల్లంఘించడమే. అమెరికా దాడులకు ఇరాన్ గట్టిగా బదులివ్వడంతో డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటించక తప్పలేదు. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి సిద్ధమవుతున్నదనే అమెరికా ప్రకటనలు దొంగ ప్రచారమే. రసాయనిక ఆయుధాలున్నాయనే సాకు చూపి ఇరాక్‌పై అమెరికా అక్రమంగా దాడి చేసిన విషయం ప్రజలు మరచిపోలేదు.

అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని ఇరాన్ సవాల్ చేసినందుకే ఇజ్రాయెల్ జియోనిస్టు, జాత్యహంకార పాలకుల్ని ఉసిగొల్పి దారుణ మారణ కాండకు పాల్పడ్డారు. సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసి తమ అనుకూల టెర్రరిస్టు ముఠాను అధికారంలోకి తీసుకువచ్చారు. సిరియా, లెబనాన్, యెమెన్ భూభాగాలను దురాక్రమించారు. గాజాలో నెత్తురుటేరులు పారుతున్నాయి. వేల సంఖ్యలో మరణాలు, లక్షల సంఖ్యలో క్షతగాత్రులు, ఇంకా అనేకమంది శరణార్థులు– ఇదీ నేటి పశ్చిమాసియా రణరంగ దృశ్యం.



మొదటి ప్రపంచ యుద్ధానంతరం అక్టోబరు సోషలిస్టు విప్లవం జయప్రదమై సోవియట్ రష్యా ఆవిర్భవించింది. యూరప్‌కి చెందిన చాలా దేశాల్లో విప్లవజ్వాలలు మిన్నుముట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా, తూర్పు యూరప్‌లలో విప్లవాలు చెలరేగి సోషలిస్టు శిబిరం ఏర్పడింది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మూడవ వరుస విప్లవాలు సమీప భవిష్యత్తులో జయప్రదం కానున్నాయి.

ఇక, ఉక్రెయిన్–రష్యా యుద్ధరంగానికి వస్తే, నాటో సేనలు రష్యా వైపుగా విస్తరించబోవు అనే హామీని సామ్రాజ్యవాదులే ఉల్లంఘించారు. ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూలదోశారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీ ఫాసిస్టులతో చేతులు కలిపిన బండేరాకు అనుచరులుగా వ్యవహరించిన వారిని అధికారంలోకి తీసుకువచ్చారు. అక్కడ మైనారిటీగా ఉన్న రష్యా జాతి ప్రజల మీద క్రూరమైన దాడులు చేసి వేలాది మందిని హతమార్చారు. రష్యా దేశమే దురాక్రమణ ప్రమాదాన్ని ఎదుర్కోవలసి రాగా, దీనిని నివారించాలనే లక్ష్యంతో, అది సైనిక చర్యకు పాల్పడింది. మూడు సంవత్సరాలుగా అక్కడ యుద్ధం కొనసాగుతూనే ఉంది. అంతేగాక తూర్పు ఆసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతాలకు యుద్ధరంగాన్ని విస్తరింపజేసి, ఉత్తర కొరియా, చైనాలను లక్ష్యాలుగా చేసుకుని అణు యుద్ధాన్ని సైతం ఎగదోయాలని వ్యూహాలు రచిస్తున్నారు. అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు ఒక పథకం ప్రకారం కొనసాగిస్తున్న ఈ యుద్ధాలన్నింటి లక్ష్యం. దోపిడీని, ప్రపంచాధిపత్యాన్నీ నిలుపుకోవడమే.

ఆయుధ పోటీ, అణ్వస్త్రవ్యాప్తి, యుద్ధ ఉద్రిక్తతలు నిత్యకృత్యమయ్యాయి. రష్యా, చైనాల నుంచి ప్రమాదం ఉందనే పేరుతో సామ్రాజ్యవాద దేశాలు సైనిక వ్యయాన్ని భారీగా పెంచేశాయి. నాటో దేశాల మిలటరీ బడ్జెట్ జీడీపీలో రెండు నుంచి ఐదు శాతానికి పెరగనుంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో ప్రాణనష్టం, పాలస్తీనా ప్రజల హత్యాకాండ, స్థానిక యుద్ధాలలో సంభవిస్తున్న విధ్వంసం... ఇవన్నీ గత ప్రపంచ యుద్ధాల నాటి పరిస్థితులను తలపిస్తున్నాయి. మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం తీవ్రమవుతోంది.

మొదటి ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా ఆరంభమయినా ఫాసిస్టు హిట్లరు నేతృత్వంలోని జర్మనీ, సోవియెట్ యూనియన్‌పై దాడి జరపడంతో ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంగా పరిణమించింది. ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధంగా పెంపొందుతోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్, నాటో సామ్రాజ్యవాద దేశాలన్నీ ఒక కూటమిగా సమీకృతమవుతుంటే, సోషలిస్టు వారసత్వం కలిగిన పెట్టుబడిదారీ దేశం రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్, వియత్నాం, లావోస్, క్యూబా వంటి దేశాలు సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌గా ఏర్పడడానికి సిద్ధమవుతున్నాయి. ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్‌లు అంతిమంగా సామ్రాజ్యవాద వ్యతిరేక లక్ష్యాలనే నెరవేరుస్తాయి. రష్యా, చైనా దేశాల్ని సోషల్ సామ్రాజ్యవాద దేశాలుగా పేర్కొనటం గానీ, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా పరిగణించడం పూర్తి అవాస్తవికం.

సామ్రాజ్యవాద దోపిడీని ప్రతిఘటిస్తున్న దేశాలు తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని బలంగా ఆకాంక్షిస్తున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించి, దానిని ఆర్థికంగా కృంగదీయాలనే ప్రయత్నాలు విఫలమయ్యాయి. పాశ్చాత్య దేశాలకు బలమైన ఆర్థిక శక్తిగా చైనా ఎదిగింది. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గణనీయంగా పెరిగింది. లాటిన్ అమెరికా దేశాలలో వామపక్ష శక్తుల విజయపరంపర కొనసాగుతోంది. ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్య పోరాటాలు బలోపేతమవుతున్నాయి. యూరప్ ప్రజలు ప్రపంచ శాంతి, సుస్థిరతల కోసం ఉద్యమిస్తున్నారు. ట్రంప్ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా ప్రజలు వీధుల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న ఇజ్రాయెల్, అమెరికా అనుకూల విదేశాంగ విధానం పట్ల ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రపంచ యుద్ధం ఏనాడైనా బద్దలుకానున్న ప్రస్తుత పరిస్థితులలో ఆయా దేశాల విప్లవ వ్యూహాలు ప్రపంచ విప్లవ వ్యూహంలో సంలీనం కావాలి. రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు రెగ్యులర్ సైన్యాలను కలిగివున్నాయి. కనుక అవి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాయుధ యుద్ధాన్ని కొనసాగిస్తాయి. మిగిలిన దేశాలలోని విప్లవశక్తులు విస్తృత ప్రజా ఉద్యమాల నిర్మాణానికి కృషి చేయాలి. దండకారణ్య గిరిజన పోరాటాలపై కొనసాగుతున్న నిర్బంధాన్ని ఖండిస్తూ ఇటీవల విస్తృతంగా జరిగిన ప్రదర్శనలు, ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు ఆహ్వానించదగినవి. రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు ఇవి ఒక ప్రతీకగా నిలుస్తాయి.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం అక్టోబరు సోషలిస్టు విప్లవం జయప్రదమై సోవియట్ రష్యా ఆవిర్భవించింది. యూరప్‌కి చెందిన చాలా దేశాల్లో విప్లవజ్వాలలు మిన్నుముట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా, తూర్పు యూరప్‌లలో విప్లవాలు చెలరేగి సోషలిస్టు శిబిరం ఏర్పడింది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మూడవ వరుస విప్లవాలు సమీప భవిష్యత్తులో జయప్రదం కానున్నాయి. సామ్రాజ్యవాదానికి అంతిమ ఘడియలు దాపురించాయి. ప్రపంచ కార్మికులు ఏకమై తీరుతారు. సమైక్యంగా నిలిచిన పీడిత ప్రజానీకాన్ని ఏ శక్తీ ఓడించజాలదు.

○ డా. శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ

విశ్వకర్మలకు చేయూతనందించాలి

మట్టిని నమ్ముకున్న రైతులెందరో నష్టాల బారినపడ్డప్పుడు పురుగుల మందునే పరమాన్నంగా చేసుకుని, ఆ మట్టిమీదే ప్రాణాలు వదిలినట్లుగా... చేసే వృత్తి కూడు పెట్టలేకపోతోందనే ఆవేదనతో, పూటగడవక విశ్వకర్మలు కూడా నిప్పుల కుంపట్లలో తమ అసువులను ఆవిరి చేసుకుంటున్నారు. ఈ వాక్యాలు రాయడానికి నేనేమీ చేయి తిరిగిన రచయితను కాదు కానీ, విశ్వకర్మల జీవితాల్ని లోతుగా చదివినవాణ్ణి. విశ్వకర్మలకు చెందిన పంచకులాల వారు తరతరాలుగా తమ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు. కానీ చేతినిండా పని లేకపోవడంతో, ప్రభుత్వం నుంచి సరైన చేయూత లేకపోవడంతో.. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో ఇలా ప్రాణాలు తీసుకున్న విశ్వకర్మలెందరో.

అనేక పోరాటాల అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విశ్వకర్మల కార్పొరేషన్లు పెట్టారు. కానీ ప్రభుత్వాలు వాటికి నిధులు కేటాయించడంలో అశ్రద్ధ చూపుతున్నాయి. కార్పొరేషన్లకు తగినన్ని నిధులు కేటాయిస్తే, వస్తుత్పత్తి ద్వారా ఆ నిధులకు ఐదు రెట్లు ప్రభుత్వాలకు ఆదాయం అందించడానికి మా విశ్వకర్మలు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు సమృద్ధిగా నిధులు కేటాయించాలి. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోని వడ్రంగులకు ఫెడరేషన్లు వేయాలి. నోడల్ అధికారితో పాటు ఆ సంఘం నాయకులు సంయుక్తంగా అవసరమైన వస్తుత్పత్తి పనులకు రూపకల్పన చేస్తారు. ఆ జాబితాను ప్రభుత్వం పరిశీలిస్తుంది. గృహ సంబంధ, ప్రభుత్వం నిర్మించబోయే పేదల ఇండ్లకు కావాల్సిన చెక్క పనులన్నీ కాంట్రాక్ట్ ద్వారా ఆ ఫెడరేషన్లకే ఇవ్వాలి. ఇతర ఇనుము సంబంధిత పనులనూ విశ్వకర్మలకే అప్పగించాలి. ఎన్నో తరాలుగా కంచాలు, బిందెలు, గునపాలు, కత్తులు వంటి పనిముట్లు చేసి విశ్వకర్మలు నాగరికతలో భాగమయ్యారు. వారందరికీ చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహం కల్పించాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సులభంగా వస్తువులను తయారు చేయడానికి ఈ పంచకులాల వారికి ప్రభుత్వం అవసరమైన శిక్షణనివ్వాలి. మా విశ్వకర్మ కులాలను ప్రోత్సహిస్తే వస్తుత్పత్తిలో ఇక్కడే మినీ చైనాను సృష్టించవచ్చు. ఆలయాల్లో చెవులు కుట్టించడం, వివాహ సందర్భాల్లో పలు కార్యక్రమాలకు విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం అధికారికంగా నియమించాలి. వారికి దేవస్థానాల నిధులతోనే జీతభత్యాలు చెల్లించాలి. బ్యాంకుల్లో గోల్డ్ అప్రైజర్స్‌గా స్వర్ణకారులను నియమించాలి. విశ్వకర్మల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. తద్వారా వస్తుత్పత్తికి ప్రోత్సాహం అందించినట్లవుతుంది. అది రాష్ట్ర సంపదగా, దేశ సంపదగా మారుతుంది. నూతన మార్పులకు శ్రీకారం చుట్టిన చంద్రన్న ప్రభుత్వం మా విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపాలి.

– గోడి నర్సింహాచారి
రాష్ట్ర కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ బీసీ సాధికారిక కమిటీ


'సీమ' జలసమృద్ధికి బనకచర్ల భరోసా

పోలవరం–బనకచర్ల పథకంపై గత కొద్ది రోజులుగా రాజకీయ ధర్మోపన్యాసాలు పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. చట్టబద్ధత లేని, స్వయంప్రకటిత కేటాయింపుగా 1450 టీఎంసీల గోదావరి జలాలలో తమ వాటా 1000 టీఎంసీలని తెలంగాణ చెప్పుకుంటూనే, వరద జలాలతో 80 నుంచి 90 రోజులలో పంపింగ్ జరిగే ఆంధ్రప్రదేశ్ బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం కలుగుతుందని చాటించుకుంటున్నారు. 2016లో జరిగిన గోదావరి జల యాజమాన్య బోర్డు మీటింగులో తెలంగాణ ప్రతినిధులు గోదావరి జలాలు ఇరు రాష్ట్రాల మధ్య కేటాయింపులు జరగలేదనీ, రాష్ట్రాల మధ్య పరస్పర ఒడంబడిక ద్వారా గానీ, ట్రిబ్యునల్ నిర్ణయం ద్వారా గానీ కేటాయింపులు జరగాలని చెప్పారు. అయితే ఈ రెండూ జరగలేదు. కానీ తమ వాటా 1000 టీఎంసీలనీ, (ఇంతకు ముందు ప్రభుత్వం 945 టీఎంసీలుగా చెప్పింది) ఆంధ్రప్రదేశ్ వరద జలాలు కూడా ముట్టుకోవడానికి వీలులేదనీ దబాయిస్తున్నారు. ఇటువంటి దబాయింపులు గత పదకొండేళ్ళుగా వింటూనే ఉన్నాం. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఏ రాష్ట్రమయినా వారి వాటా జలాలను ఇంకొక బేసిన్‌కి తరలించుకోవచ్చు. చట్టబద్ధమయిన కేటాయింపులు లేని నికర జలాల ఆధారంగా తెలంగాణ అనేక ప్రాజెక్టులు చేపట్టవచ్చు కానీ, ఆంధ్రప్రదేశ్ మాత్రం వరద జలాలతో కూడా ప్రాజెక్టులు నిర్మించకూడదు. కొందరు తెలంగాణ నాయకులయితే మళ్లించిన గోదావరి జలాలకు సమానంగా వారికి కృష్ణా జలాలు సమర్పించుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు.

తెలంగాణతో బనకచర్ల ప్రాజెక్టు వివాదాల్ని పక్కన పెట్టి, ఆ ప్రాజెక్టు ఆవశ్యకత గురించి పరిశీలిద్దాం. రాయలసీమ ప్రాజెక్టులయిన హంద్రీ–నీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, ప్రకాశం జిల్లాలోని వెలిగొండలకు గోదావరి నీటి సరఫరాకు ఉద్దేశించిన పథకం పోలవరం–బనకచర్ల. ఈ ప్రాజెక్టులు బచావత్ ట్రిబ్యునల్ కల్పించిన మిగులు జలాల వినియోగానికి ఉద్దేశించినవి. కానీ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–2 తీర్పు తరువాత ఈ వెసులుబాటుకు ఆటంకం కలిగింది. ఈ తీర్పు ఇంతవరకు అమలులోకి రానందున పాత పద్ధతే కొనసాగుతోంది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్–1 తీర్పులో ఒక రాష్ట్రం తమ వాటాని రాష్ట్రంలో ఎక్కడయినా వాడుకోవటానికి వీలు కల్పించింది.

విభజన చట్టం–2014లో షెడ్యూల్ పదకొండు, ఈ ప్రాజెక్టులకు ప్రస్తుతం ఉన్న నీటి వినియోగం కొనసాగుతుందని చెప్పింది. ఇప్పుడు నడుస్తున్న ట్రిబ్యునల్–2 ఎక్స్‌టెన్షన్ ఇరు రాష్ట్రాల మధ్య వారి వారి ప్రాజెక్టులకి నిర్దిష్ట కేటాయింపు లేకపోతే, ఆ పరిమాణాలని కూడా నిర్ణయించి, ఆపరేషన్ ప్రోటోకాల్ నిశ్చయించాల్సి ఉంది. 2013లో ఇదే ట్రిబ్యునల్–2 ఈ ప్రాజెక్టులకి కేటాయింపులు చేయకపోగా, సగటు నీటి లభ్యత వరకు (2578 టీఎంసీలు) అన్ని రాష్ట్రాలకి కేటాయింపులు చేసేసింది. కనుక ప్రస్తుత ట్రిబ్యునల్–2 ఎక్స్‌టెన్షన్ ఒకవేళ చేస్తే ఈ 2578 టీఎంసీలకు అధికంగా లభ్యమయ్యే నీటిని వాడుకోవచ్చు అని అనవచ్చేమో? లేదా

పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమ జిల్లాలలో తాగునీటి అవసరాలకు, ముందు ముందు రాబోయే ఇంజనీరింగ్, రక్షణ రంగ పరిశ్రమల అవసరాలకు గోదావరి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. పది సంవత్సరాలలో మూడేళ్ళు మాత్రం కృష్ణాజలాలు పారటానికి అవకాశమున్న హంద్రీ–నీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు ఉండాలి. కనుక గోదావరి జలాల మళ్ళింపు ఉత్తమ మార్గం.



అసలు వీలు కాదని చెప్పినా చెప్పవచ్చు. ఈ 2578 టీఎంసీల కంటే అధికంగా లభ్యమయ్యే నీటికి తెలంగాణ కూడా పోటీదారు(విభజన చట్టం షెడ్యూల్ 11లో కల్వకుర్తి, నెట్టెంపాడు కూడా ఉన్నాయి). అంతేకాదు ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల హెడ్ వర్క్స్ అన్నీ ఆయా రాష్ట్రాల నిర్వహణలో ఉన్నాయి. ముందు ముందు ఇవి కృష్ణా యాజమాన్య బోర్డు ఆధీనంలోకి వెడతాయి. అప్పుడు, ఇప్పుడున్న వెసులుబాటు కూడా ఉండదు. పైగా మిగులు నీటిని (2578 టీఎంసీల కంటే ఎక్కువగా లభ్యమయ్యే) ఆరు ప్రాజెక్టులకి పంచాలి. ఒకవేళ ట్రిబ్యునల్ ప్రాధాన్యక్రమం నిర్ణయించకపోతే, అనుక్షణం జగడం జరుగుతుంది. వరద ఎంత కాలం లభ్యమవుతుందో కూడా ఒక సందిగ్ధమే కనుక, రాయలసీమ ప్రాజెక్టులయిన హంద్రీ–నీవా, గాలేరు–నగరిలకు నీటి సరఫరా ఒక అనిశ్చితిగా ఉంటుంది. తెలుగు గంగ ప్రాజెక్టుకు ట్రిబ్యునల్–2 సరాసరి నీటి లభ్యత ఆధారంగా 25 టీఎంసీలు కేటాయించినా (ప్రాజెక్టు రూపకల్పన 29 టీఎంసీలకి జరిగింది), ఈ కాలువ ద్వారా చిత్తూరు జిల్లాలో అదనపు ఆయకట్టుకు, ముఖ్యంగా రాయలసీమ జిల్లాలలో తాగునీటి అవసరాలకు, ముందు ముందు రాబోయే ఇంజనీరింగ్, రక్షణ రంగ పరిశ్రమల అవసరాలకు గోదావరి నీటిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

పది సంవత్సరాలలో మూడేళ్ళు మాత్రం కృష్ణాజలాలు పారటానికి అవకాశమున్న ఈ ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు ఉండాలి. కనుక గోదావరి జలాల మళ్ళింపు ఉత్తమ మార్గం. ఒకవేళ మళ్ళించకపోతే నష్టపోయేది రాయలసీమే, అదీగాక, ప్రస్తుతం రాష్ట్రం మొత్తం వాటాలో కొంత నీటిని ఎక్కడయినా వాడుకునే వెసులుబాటు కూడా రద్దవుతుంది. ఎందుకంటే ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు నిర్ణయించినప్పుడు, వేరే చోట ఆ నీటిని వాడలేరు, అప్పుడు బోర్డు చేతులు కూడా కట్టివేసినట్టు అవుతుంది. సోమశిల, కండలేరు రిజర్వాయర్లను గత కొద్ది సంవత్సరాలుగా కృష్ణా జలాలతో గండికోట ప్రాజెక్టు ద్వారా అదనంగా నింపుతున్నారు. గోదావరి జలాల మళ్ళింపు తర్వాత కూడా ఆ జలాలతోనే వాటిని బనకచర్ల–గండికోట ద్వారానే నింపటం ఉత్తమం.

పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుని తెలంగాణ వారి కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చి అవినీతి జరగవచ్చని సంకోచం వెలిబుచ్చుతున్నారు. అవినీతి అంశం వదిలేస్తే– పెట్టుబడి పరిమాణం, చేపట్టవలసిన నిర్మాణ స్థూలత్వం గమనిస్తే, బహుశ ఆ పోలిక సమర్థనీయం కావచ్చు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మితమైన టన్నెళ్ళు, భూగర్భ పంపుహౌస్‌లు, కాలువలు, చెరువులు గణనీయంగా ప్రశంసించదగినవే. బారేజ్‌లలో తప్పిదాలు జరిగాయి కాని, సమగ్రంగా అది ఒక మెగా ప్రాజెక్టు. బారేజ్‌లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నా, తక్కువ రోజుల పంపింగ్‌తో వరదల సమయంలో పాక్షిక లాభాలు పొందవచ్చు.

దశాబ్దాల క్రితంలా కాకుండా ఇప్పుడు ప్రాజెక్టులన్నీ మెగా పరిమాణంలోనే ఉంటున్నాయి. జాతీయ రహదారుల విస్తరణ, కొత్త బాటల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం వంటివి తలచుకుంటే సాధించగలమని చెబుతున్నాయి. సరైన సంకల్పంతో పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు కూడా నిర్ణీత సమయంలో అలా నిర్మించవచ్చు.

● కురుమద్దాలి వెంకటసుబ్బారావు
విశ్రాంత చీఫ్ ఇంజనీర్





మిర్చి ఎగ్జిబిషన్‌లో వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

- ఖరీఫ్‌పై ప్రభావం చూపుతున్న వరుణుడు
- 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- విత్తు కోసం ఆకాశం వైపు రైతుల చూపు
- నైరుతీ నిరాశ.. సంక్షోభంలో సాగు

కరిగిపోతున్న సాగు కాలం!



పొలం దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేసిన రైతులు



(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు కాలం కరిగిపోతోంది. దుక్కులు దున్ని.. రైతులు విత్తు కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. మేలో ఊరించిన వర్షాలు జూన్‌లో ముఖం చాటేశాయి. నైరుతి నిరాశ పరిచింది. సాగు సందిగ్ధంలో పడటంతో అన్నదాతలు అందోళనలో ఉన్నారు.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 71 మండలాలకు 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. కేవలం ఐదు మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదైంది. వరుణిడి కురణ కోసం ఎదురుచూస్తున్నారు.

ఇంకా అందుకోని అంచనాలు..

ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 4,53,205, బాపట్ల జిల్లాలో 2,80,353, గుంటూరు జిల్లాలో 2,25,525 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తారని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. సీజన్ ప్రారంభమై వారాలు గుడుస్తున్నా ఇంకా వ్యవసాయం ఊపందుకోలేదు. మేలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 15,650, బాపట్ల 863, గుంటూరు 1,905 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక పల్నాడులో బోరు బావుల కింద పత్తి సాగు చేపట్టారు.

జిల్లాల వారీగా నమోదైన వర్షపాతం(మి.మీ.లో)

జిల్లా	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం	లోటు శాతం
పల్నాడు	108	41.9	61.2
బాపట్ల	94.2	51.1	45.8
గుంటూరు	131.1	68.3	47.9

- పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్ల మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగతా 27 మండలాల్లో వర్షాభావం ఏర్పడింది. 15 మండలాల్లో అత్యధిక లోటు, 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు 108 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 41.9 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. 61.2 శాతం లోటు వర్షపాతం నమోదైంది.
- బాపట్ల జిల్లాలో 94.20 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 51.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 45.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 25 మండలాలకు.. 11 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, 12 మండలాల్లో లోటు, కర్లపాలెం మండలంలో సాధారణ, నిజామపట్నం మండలంలో అధిక వర్షపాతం నమోదైంది.
- గుంటూరు జిల్లాలో 47.9 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 131.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 68.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, తొమ్మిది మండలాల్లో లోటు, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

గతేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నిండటంతో పంటలను విస్తృతంగా సాగు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేన్న అందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. వర్షాలు కురిపించాలని వరుణుడిని రైతులు ప్రార్థిస్తున్నారు.



మట్టి రోడ్డుగా మారిన ఇన్నర్ రింగు రోడ్డు

- గోతుల మయంగా ఇన్నర్ రింగురోడ్డు
- గుల్లవుతున్న భారీ వాహనాలు
- దుమ్మూధూళితో స్థానికుల ఆందోళన
- ప్రజల వినతులు పట్టించుకోని సీఆర్డీఏ

దీన్ని రోడ్డంటారా..



రోడ్డు పక్కన వేస్తున్న వ్యర్థాలు

వేడి కొండవారు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అది పేరుకే ఇన్నర్ రింగ్ రోడ్డు.. ప్రత్యక్షంగా చూసిన వారు దీన్ని రోడ్డంటారా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు గోతుల్లో పడి గుల్లవుతున్నాయి. గుంటూరు నగరంలోని నల్లపాడు, అంకిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా నేషనల్ హైవే 16ను కలిపే మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ దుస్థితి ఇది. రహదారిలో ఏర్పడిన గోతుల కారణంగా వాహన డ్రైవర్లతో పాటు స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తారు రోడ్డు రూపు రేఖలు కోల్పోయి.. మట్టి రోడ్డుగా మారింది. దుమ్మూ ధూళి కారణంగా సమీప అపార్ట్‌మెంట్‌ల నివాసితులు అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. ప్రజలు, వాహన డ్రైవర్ల నుంచి ఎన్ని ఫిర్యాదులు అందినా సీఆర్డీయే అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. నల్లపాడు నుంచి అంకిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డును సీఆర్డీఏ పరిధిలోకి తీసుకొని.. అభివృద్ధి చేశారు. కొన్నేళ్లుగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టలేదు. స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు రహదారి దుస్థితిపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులను కలిసి విన్నవించారు. గుంటూరు నగర సమీపంలో జాతీయ రహదారి చేరుకునేందుకు.. అనువుగా ఉండటంతో ఎక్కువ శాతం భారీ వాహనాలు ఈ రహదారిలో వెళ్తుంటాయి. నల్లపాడు సమీప గ్రామాల నుంచి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే వాహనాలు ఈ రహదారిలో వెళ్లలేక పోవడంతో.. రోడ్డు పక్కనే వ్యర్థాలను వదిలి వెళ్తున్నారు. వ్యర్థాలతో రోడ్డే డంపింగ్ యార్డును తలపిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సీఆర్డీయే అధికారులను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినా.. వారిలో కదలిక లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆటకు వీడని వైసీపీ శాపం..!



8

- లీజుకు క్రీడా ప్రాంగణాలు
- తాజాగా నరసరావుపేట, తెనాలి ఇండోర్ స్టేడియాలు..
- నిర్వహణ లేక అధ్వానంగా తెనాలి స్టేడియం
- పరిమితి లేని వసూళ్లతో క్రీడాకారులు దూరం
- పర్యవేక్షణ పట్టు కోల్పోయిన శాప్
- దెబ్బతింటున్న రూ.కోట్ల విలువైన ఆస్తులు

హైరిస్క్ గర్భిణులపై.. అవగాహన ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి వెల్లడి
- పీహెచ్‌సీ వైద్యాధికారులకు రెండు రోజుల శిక్షణ



మాన్యువల్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణీల్లో ప్రసవానికి ముందే ఆరోగ్యపరంగా పలు లక్షణాలు కనిపిస్తాయని, వీటిపై పీహెచ్‌సీ వైద్యాధికారులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, గర్భవతుల ఆరోగ్య పరిరక్షణపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భవతుల్లో కనిపించే 19 రకాల ప్రమాదకర లక్షణాలు అనే అంశంపై రూపొందించిన మాన్యువల్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ ఆవిష్కరించారు. 32 ఏళ్లు దాటిన, బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబ్బసం, ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్న గర్భిణీలను హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులుగా పరిగణించాలని ఆమె సూచించారు. వీరి ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించి, సుఖ ప్రసవం జరిగేంత వరకు వైద్య సిబ్బంది తగిన శ్రద్ధచూపాలని ఆమె కోరారు. అనంతరం గర్భిణీల్లో కనిపించే 19 రకాల లక్షణాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చికిత్సలపై గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చెందిన డాక్టర్ శిరీష, ఈమని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవల్లీ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ అన్నపూర్ణ, డీపీహెచ్‌ఎన్‌వో డాక్టర్ ప్రియాంక, ఆర్మన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకట్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3.64 లక్షల మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వ

- లింగాయపాలెం, బోరుపాలెం, గుండిమెడలో స్టాకు

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలంలో ఇసుక క్వారీలు నీట మునిగి ప్రజల అవసరాలకు కొరత తలెత్తుతున్న దృష్ట్యా ఈ ఏడాది జిల్లా యంత్రాంగం ముందస్తుగా నిల్వలు పెట్టింది. ఇప్పటికే మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఇసుకని కృష్ణానదిలో నుంచి బయటకు తీసి స్టాకు పాయింట్లకు చేర్చింది. జిల్లాలో ప్రస్తుతం ఇసుక నాలుగు స్టాకు పాయింట్‌లు ఉన్నాయి. ఇందులో లింగాయపాలెం-1లో 2 లక్షల 6 వేల 443, లింగాయపాలెం-2లో 92 వేల 32, బోరుపాలెంలో 52 వేల 288, గుండిమెడలో 14 వేల 134 మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వలున్నాయి. కాగా చౌడవరం, పెదకాకాని, ప్రాతూరులో మాన్‌సూన్ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం లింగాయపాలెం, గుండిమెడ నుంచి ఇసుకని ఈ స్టాకు పాయింట్లకు రవాణా చేయాల్సి ఉన్నది. చౌడవరం, పెదకాకాని స్టాకు పాయింట్ల నుంచి త్వరలో ఇసుకని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీని దృష్ట్యా కృష్ణానదికి వరద వచ్చి ఇసుక మైనింగ్ ఆపరేషన్స్‌కి ఇబ్బంది తలెత్తినా ప్రజల అవసరాలకు మాత్రం ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. దీని వలన నిర్మాణ రంగానికి ఎలాంటి ఆటంకాలు తలెత్తవు. దాంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కోల్పోవడం అన్న ప్రశ్నే తలెత్తదని చెబుతున్నాయి. అంతే కాకుండా స్టాకు పాయింట్ల నుంచి మాన్‌సూన్ స్టాక్ పాయింట్లకు చేర్చి అక్కడి నుంచి ప్రజలకు సరఫరా చేయడం వలన ధర కొంత పెరిగే అవకాశం ఉన్నది.



గుండిమెడ రీచ్‌కు అనుబంధంగా ప్రాతూరులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు

మన మిర్చికి జాతీయ స్థాయి అవార్డు

- 14న ఢిల్లీలో స్వీకరించనున్న కలెక్టర్

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కింద గుంటూరు మిర్చిపై ఉద్యాన శాఖ సమర్పించిన నివేదికకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు స్థానిక ఉత్పత్తులపై నివేదికలు సమర్పించగా ఏడు మాత్రమే జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. వాటిల్లో గుంటూరు జిల్లా సమగ్రంగా నివేదించిన రిపోర్టు కేంద్ర వాణిజ్య శాఖని ఆకట్టుకొన్నది. ఈ నెల 14వ తేదీన ఆ శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదగా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అవార్డుని అందుకోనున్నారు. గుంటూరు జిల్లాకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కేలా చేసినందుకు ఉద్యాన శాఖని జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు అభినందిస్తున్నాయి.

మిర్చి రకాలలో గుంటూరు సన్నం(ఎస్4) ప్రత్యేకమైనది. ఈ రకం మిర్చి ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. దీనికి జియోట్యాగింగ్‌కు కూడా లభించింది. ప్రస్తుత గుంటూరు జిల్లాలో మిర్చిని 18400 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. మిర్చిలో నాణ్యతని పెంపొందించేందుకు సుగంధ ద్రవ్యాల సంస్థ, లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ వంటివి ఏడాది పొడవునా అనేక పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి వాళ్లకి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తాయి. వీటన్నింటిపై కేంద్ర ప్రభుత్వ బృందానికి జిల్లా ఉద్యాన శాఖ క్షేత్రస్థాయికి తీసుకెళ్లి చూపించాయి. రైతులతో మాట్లాడించారు. చివరగా ఒక సమగ్ర నివేదికని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదగా అందజేశాయి. నెలల తరబడి పడిన కష్టానికి ఎట్టకేలకు ప్రతిఫలం లభించింది. జాతీయ స్థాయి ఉత్తమ ఓడీఓపీకి ఎంపిక కావడంతో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమర్థవంతంగా... పేరెంట్స్ మీట్ నిర్వహించాలి

- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతు న్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు (విద్య) జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో జూనియర్ కళాశాలలో ఈనెల 10వ నిర్వహించే మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0 ను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ,విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకొని ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, విద్యాశాఖ అధికారులు, తహసిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0 పై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో సమావేశ నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లలో ఇబ్బందులు ఉంటే మంగళవారం మధ్యాహ్నం నాటికి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు తెలియచేస్తే అవసరమైన సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి స్థానిక సచివాలయ ఉద్యోగులను నియమించేందుకు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ బర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో పొగాకు పంటను సాగుచేసిన రైతులు నమోదు చేసుకొని వారికి షెడ్యూలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు మంజూరయ్యేలా రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డీఈవో రేణుక, విద్యాశాఖ, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణలో భాగస్వాములవ్వండి

- మేయర్ కోవెలమూడి రవీంద్ర



ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జులై 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు స్వచ్ఛంధ సంస్థలు, స్టేక్ హోల్డర్స్ ని భాగస్వాములను చేస్తామని గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, వెండింగ్ కమిటి సభ్యులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చి దిద్దుకోవాడానికి నగరంలో విస్తృతంగా మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రెయిన్లను ఆక్రమించి వ్యాపారం చేసే వారికి త్వరలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని, అనంతరం ఆయా ఆక్రమణలను తొలగించాలని, సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాటి సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొక్కలను సంరక్షించడానికి నగరంలోని ప్రముఖ సంస్థలు ముందుకు రావాలని కోరారు. అలాగే నగరంలోని 2 ప్రాంతాల్లో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేశామన్నారు. నగర వెండింగ్ కమిటి నేతృత్వంలో గుర్తించిన మరి కొన్ని ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు.సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఏడీహెచ్ జే శాంతి, ఎంహెచ్‌ఓ (ఇంచార్జి) రామారావు, స్టేక్ హోల్డర్స్, రేట్‌పేయర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

తెనాలి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం ముగిశాయి. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మూడు రోజులపాటు పలు నాటికలు ప్రదర్శించారు. రోటరీ క్లబ్ పితామహుడు పాల్‌హారీస్ పురస్కారాన్ని మాజీ గవర్నర్ పాటిబండ్ల సాంబశివరావుకు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. రోటరీ పీడీజీ అన్నే రత్నప్రభాకర్ మాట్లాడుతూ.. సమాజానికి దిశానిర్దేశం చేసే కళా రంగాన్ని ఆదరించాలన్నారు. కళాకారులు పోటీ పడి నాటికలు ప్రదర్శించారని అభినందించారు. హైదరాబాద్ బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వి.బాలకోటిరెడ్డి మాట్లాడుతూ.. తెనాలి ప్రాంతం కళలకు, కళాకారులకు నిలయమన్నారు. సాంస్కృతిక రాజధానిగా పిలుచుకునే పట్టణంలో కళాకారులకు తగిన గుర్తింపు అందుతుందన్నారు. ఈదర వెంకటపూర్ణచంద్, డాక్టర్ జీవనలత, రోటరీ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు ప్రసంగించారు. చివరిరోజు విశాఖపట్నం తెలుగు కళా సమితి కళాకారులు నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత నాటిక ప్రదర్శించారు. మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు. కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన ఖరీదైన జైళ్లు నాటికకు మూలకథ వెంకటేశ్వరరావు అందించగా నాటికీకరణ పి.శివరామ్, దర్శకత్వం మంచాల రమేష్ వహించారు.

ఉత్తమ ప్రదర్శనగా ఐ ఏట్ ఇండియా నాటిక

తెనాలి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ద్వితీయ ఆహ్వాన నాటిక ప్రదర్శనలో ఐ ఏట్ ఇండియా నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల విజేతలకు సోమవారం రాత్రి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఖరీదైన జైళ్లు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదు నాటికలు నిలిచాయి. ఉత్తమ సంగీతం లీలామోహన్, రంగాలంకరణ దివాకర ఫణీంద్ర, ఆహార్యం దినేష్, దర్శకత్వం ఎంఎస్ చౌదరి, రచన మాధవ్, హాస్యనటుడు చలపతి, ప్రతినాయకురాలు హేమ, క్యారెక్టర్ నటి నాగరాణి, క్యారెక్టర్ నటుడు రామారావు, ఉత్తమ నటిగా శోభారాణి, ఉత్తమ నటుడుగా వరప్రసాద్, జ్యూరీ 1, 2 అవార్డులను రుత్విక్, రోహిత్‌లకు అందజేశారు. డీఎల్ కాంతారావు, ఈదర వెంకటపూర్ణచంద్, బుర్రా సాయిమాధవ్, జయలక్ష్మి, నల్లూరి వెంకటేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు పాల్గొన్నారు.





ఐ ఏట్ ఇండియా, ఖరీదైన జైళ్లు, నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత నాటికల కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

రోడ్డు ప్రమాదంలో..
ఆపరేషన్ సిందూర్ జవాన్ మృతి

● కుమారుడు కూడా మృతి.. వరగానిలో విషాద ఛాయలు


నాగేశ్వరరావు (పాత చిత్రం)

పెదనందిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని గ్రామానికి చెందిన ఆర్మీలో సుబేదారుగా పనిచేస్తున్న ఉదయగిరి నాగేశ్వరరావు(45), కుమారుడు వెంకట అవినాష్(22) రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు.. సుబేదార్ నాగేశ్వరరావు సెలవుపై ఇంటికి బయలు దేరారు. కారులో కుటుంబం సభ్యులతో కలిసి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో నల్గొండ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కుమారుడితో కలిసి కారు దిగారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మృత్యువు రూపంలో వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. దీంతో అవినాష్ అక్కడికక్కడే మృతిచెందగా, నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. నాగేశ్వరరావు ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. చిరునవ్వుతో ఇంటికి రావాల్సిన తండ్రీ కొడుకులు.. విగతజీవులుగా మారడంతో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నిందితుడికి జీవిత ఖైదు, రూ.పది వేల జరిమాన విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. పొన్నూరులోని వల్లభరావు పాలెం గ్రామానికి చెందిన మహిళ కూతురు, మనవరాళ్లతో ఉంటోంది. 2014 జూలైలో రాత్రి ఆరుబయట ఆడుకుంటున్న ఆమె పెద్ద మనువరాలిని(13) స్థానికంగా ఉండే మద్దసాని సురేంద్ర (32) అనే వ్యక్తి ఇంటికి దగ్గరలోని ఓ డాబా మీదకు తీసు కెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారయత్నం చేశాడు. ఆ సమయంలో బాలిక అరుపులు విని.. చుట్టుపక్కల వాళ్లు డాబాపైకి చేరు కున్నారు. వారిని చూసి నిందితుడు సురేంద్ర అక్కడ నుంచి పారిపోయాడు. బాధితురాలు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసు లు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యా ధారాలను పరిశీలించిన గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం నిందితుడిని దోషిగా తేల్చి.. జైలు శిక్ష, జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడటంలో సహకరించిన దర్యాప్తు అధికారి సీఐ వీరయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ఖాన్, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ నరసిం హారావు, పోక్సో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు, కోర్టు కానిస్టేబుల్ వెంక టేశ్వరరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

ఆర్టీసీలో అక్రమ ఓడీలపై విచారణ!

● ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ● ఓడీలపై మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర కార్యాలయం

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోల్లో అక్రమ ఓడీలపై ఉన్నతాధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. డిపోల్లో అక్రమ ఓడీలపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'ఆర్టీసీలో అక్రమ 'ఒరవోడీ' ' పేరుతో ప్రత్యేక కథనం ప్రచు రితమైంది. దీనిని ఆర్టీసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిం చినట్లు తెలిసింది. అలానే ఆర్టీసీ విజలెన్స్ కూడా ఇప్పటికే నివేదిక అందజేసినట్లు సమాచారం. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని గుం టూరు -1 , 2 డిపోలతో పాటు మం గళగిరి, పొన్నూరు. తెనాలి డిపోలలో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్) పేరు తో కొందరు ఉద్యో గులు దర్జాగా విధులు నిర్వహిస్తోన్న వైనంపై కథనంలో ప్రస్తావించడం జరిగింది. గుంటూరు 2 డిపోలో అత్యధికంగా 18 మంది అక్రమ ఓడీలు పొందడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు-1 డిపోలో 16 మంది, తెనాలి డిపోలో ఏడుగురు, పొన్నూరు డిపోలో నలుగురు, మంగళగిరి డిపోలో ఐదుగురు మొత్తం 48 మంది ఉద్యోగులు ఓడీలపై విధులు నిర్వహించడంపై ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఆర్టీసీలో ఓడీ వినియోగించుకోవాలంటే సంబంధిత జోనల్ కార్యాలయం అనుమతి తప్పనిసరి అయినప్పటికీ ఇక్కడ అటువంటి నిబంధనలు ఏవి పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగాలు చేసే వారికే ఈ ఓడీ సుదపాయం ఉంటుంది.



ఓడీలపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ

ఉద్యోగులకు ఓడీ ఇచ్చే ముందు సీనియార్టీ పాటించాలని ఉన్నతాధికారులు సూచించారు. మరో వైపు డ్రైవర్, కండక్టర్లను చార్ట్ బుకింగ్, మస్టర్లు, డిస్పాచ్ చార్ట్ విభాగంలో ఉపయోగిం చకూడదని, అనివార్యమైతే ఎగ్జిక్యూ టివ్ డైరక్టర్ నుంచి అనుమతి తీసు కోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చే శారు. ఇటీవల కొన్ని డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లను ఓడీలపై నియమించుకున్నట్లు ప్రధాన కార్యాలయం దృష్టికి వచ్చింది. ఇది కార్యాచరణను ప్రభావితం చేస్తోందని, అంతేగాక సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని భావించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అటవీ ప్రాంతంలో
పేకాట శిబిరంపై దాడి

పోలీసుల అదుపులో 22 మంది ● రూ.1,87,680 నగదు స్వాధీనం

దుర్గి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకిరాల అటవీ ప్రాంతంలో కొందరు పేకాట స్థావరం ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జూదరులు ఇక్కడ పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం కారంపూడి సర్కిల్ సీఐ శ్రీనివాసరావు, దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్, రెంటచింతల ఎస్ఐ నాగార్జునతోపాటు 40 మంది పోలీసు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను డీఎస్పీ జగదీష్ దుర్గి పోలీస్‌స్టేషన్లో విలేకరులకు వెల్లడించారు. శిబిరంలో పేకాట ఆడేందుకు ఎంట్రీ ఫీజు కింద రూ.300 నుంచి రూ. 500 వరకు వసూ లు చేస్తున్నారని చెప్పారు. వీరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని, పోలీసుల కదలికలను పసిగడుతూ జూదరులకు సమాచారం ఇస్తుంటారని పేర్కొన్నారు. పోలీసుల దాడిలో 23 ద్విచక్రవాహనాలతోపాటు రూ. 1,87,680 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే 22 మందిని అదుపులోకి తీసుకొని కేసున మోదు చేసినట్లు వెల్లడించారు. వీరిని కోర్టులో హాజరుపరచను న్నామని, కాగా మరికొందరు పరారైనట్లు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బైకులతో డీఎస్పీ జగదీష్, పోలీసు సిబ్బంది

80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

వట్టిచెరుకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అనంతవరప్పాడు గ్రామంలోని శ్రీవల్లి రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వలపై ఆదివారం అధికారులు దాడ్జులు నిర్వహించారు. సోమవారం డీఎస్‌వో చంద్రమని సమక్షంలో సీఎస్‌డీటీ శివశంకర్ బియ్యం నిల్వల లెక్క తేల్చారు. 80 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసి నందు కు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. 2,268 బస్తాల బియ్యంలో 2,108 బస్తాలకు రసీదులు చూపించ గా.. మిగిలిన 120 బ్యాగుల్లోని 80 క్వింటాళ్ళ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ విచారణ

నూజెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిధులు దుర్విని యోగంపై స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజి లెన్స్ సీఐ సైదులు ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించి, క్రీడాకారులతో మాట్లా డి క్రీడా పరికరాలు, ప్రోత్సాహక బహుమతుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఉమాదేవి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎన్.వెంకటరత్నం, విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరావు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజారోగ్యానికే కూటమి ప్రాధాన్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య భద్రత కూటమి లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. నగరంలోని 12వ వార్డుకు చెందిన కురంగుంట్ల త్రిలోకేశ్వర్‌రెడ్డి కుమార్తె రెండేళ్ల ధనలక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు కావడంతో అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నసీర్ సహకారంతో వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.2,08,477 రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేశారు. ఆ చెక్కును ఎమ్మెల్యే నసీర్ బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ.3 కోట్ల విలువైన సీఎం నిధులు అందించామని వెల్లడించారు.

అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కారించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్య పరిష్కారం కోసం డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలు, ఇతర సేవలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 30 అర్జీలు అందుకున్నారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 2, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు మొత్తం 39 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

● అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలని, క్యాంటీన్లలో ఆహార సరఫరాకి నిర్దేశిత సమయాన్ని పాటించాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం నల్లచెరువు మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని ఆయన పరిశీలించారు.

రోడ్లు, కాలువలలో వ్యర్థాలు లేకుండా చూడాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో నూరు శాతం ఇంటింటి నుంచి చెత్త సేకరించ డం ద్వారా రోడ్లు, కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు, ఐపీడీ కాలనీ, గొలుసు కొండలరావు నగర తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా మైక్రో ప్యాకెట్స్ ప్రాతిపదికన ప్రజారోగ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. కార్యదర్శులు విధిగా ఉదయం మస్టర్ సమయా నికి హాజరై కార్మికుల పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో డంపింగ్ పాయింట్స్ ఉండడానికి వీల్లేదని, త్వరలో ప్రతి ఇంటికి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వార్డుల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి, స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ అబీద్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పికిల్ బాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డు, హనుమయ్య నగర్‌లోని వీవీవీ హెల్త్ క్లబ్ ఆవరణలో సోమవారం పికిల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా డీఎస్‌డీవో నరసింహారెడ్డి, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, ఒలింపిక్ సంఘ ప్రతినిధి కే వేణుగోపాల్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఛైర్మన్‌గా చుక్కపల్లి రాకేష్, చీఫ్ ఇన్ పాటర్న్‌గా టీ.అరుణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడిగా టీ హరికిషన్ సాయి, అధ్యక్షుడిగా డాక్టర్ ఎం శివకుమార్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రవీంద్రబాబు, ఎన్‌వీ కమలాకాంత్, ఎస్వీ రామకోటేశ్వరరావు, డాక్టర్ పీ వరుణ్, టీ హనుమంతరావు, ఎం భరత్‌కుమార్, కార్యదర్శిగా జీవీఎస్ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.అరుణ్‌కుమార్, కోశాధికారిగా కే సుస్మితాచౌదరి, సంయుక్త కార్యదర్శులుగా ప్రముఖ వైద్యులు ఎం కళ్యాణ చక్రవర్తి, రాజశేఖర్, ఎన్.ఫణీంద్ర, ఎన్.ఫణి రామ్, బీ కృష్ణారావు, కే రక్షిత్, మన్సూర్ వలి, ఏ సుబ్బారావుతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


నూతన కార్యవర్గ సభ్యులతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి తదితరులు

నిత్య అన్నదాన పథకానికి రూ.లక్షా 16వేల విరాళం


దాతలకు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

పెదకాకాని, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన ఫణి రాఘవేంద్ర జ్ఞాపకార్థం మల్లికార్జునరావు సోమవారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి రూ.లక్షా 16వేలు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరి విగా విరాళం సమర్పించి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 259 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 259 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తుల్లో మళ్లీ వస్తున్నాయని, అర్జీని పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, హౌసింగ్, డీఆర్‌డీఏ పీడీలు ప్రసాద్, విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, డీపీవో హేమ, వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లడంపై కలెక్టర్ నాగలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లడంపై వివరణ కోరుతూ పొన్నూరు, లాలాపురం, కంతేరు గ్రామానికి చెందిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశాలు ఇచ్చారు. అర్జీదారుడికి ఫిర్యాదును సరిగా ఎండార్స్ చేయడం లేదని, సంబంధిత శాఖలో సరైన అధికారికి పంపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత బస్సుతో ఆటో కార్మికులకు ఉపాధి తగ్గుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని కోరారు. జీవో నెంబరు 21ని సవరణ చేసి వాహనాలపై విధిస్తున్న పెనాల్టీలను పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవరుకు వాహన మిత్ర పథకం వర్తింప చేయాలని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ప్రభుత్వం చూపించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ మస్తాన్ వలి, జే శంకర్, షేక్ ఇస్మాయిల్, కే కొండలు తదితరులున్నారు.

● రోడ్డును ఆక్రమించుకుని ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, అదేమని అడిగితే బెదిరిస్తున్నారని స్థానిక శ్రీనివాసరావుపేట 11 లైనుకు చెందిన స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమంది ముస్లింలు, వారి కుటుంబసభ్యులు కలిసి పోరంబోకు, ప్రభుత్వ స్థలాలను పొజిషన్ సర్టిఫికెట్లు తెచ్చుకొని ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

● గుంటూరు ఛానల్‌లో ఏర్పడిన గండ్లు పూడ్చివేయాలని రైతు సంఘ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో వర్షాలు కురిసినపుడు కాలువ కట్టలకు అనేక చోట్ల గండ్లు పడి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాల్వ కట్టలు వద్ద కోతలు ఏర్పడి, బలహీనంగా మారాయని అన్నారు. ముఖ్యంగా పెదకాకాని నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డు వద్ద కాలువ కట్టకు అనేకచోట్ల లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. దీంతో పాటు కాలువలో గుర్రపుడెక్కను పేరుకుపోయిందని, వాటిని తొలగించకుండానే ఈ మధ్యనే దానిపై గడ్డి మందు పిచికారి చేశారని తెలిపారు. దీంతో కాలువ పూర్తిగా విషపూరితంగా మారిందన్నారు. తక్షణమే గుర్రపు డెక్కను తొలగించాలని, లాకులను మరమ్మతులు చేపట్టాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు, రైతులు ఉన్నారు.

● ఇంటి పట్టాలు మంజూరు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక 41వ డివిజన్‌కు చెందిన పుల్లయ్యపేట సుందరయ్య కాలనీ వాసులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దీనిపై అనేక మార్లు వినతిపత్రం ఇచ్చినా సరైన స్పందన రావడం లేదని తెలిపారు. కోర్టు కేసులు, సమస్యలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు ఏర్పాటు చేసుకున్నవారికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తుచేసుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆది నికల్సన్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, పద్మ, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో వయోజన విద్యపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వయోజన (15-59 సంవత్సరాలు) నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ - అక్షరాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం జిల్లాలో నిర్దేశించిన ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమాజం లోని అందరికీ జీవిత కాల అభ్యాసనం, అవగాహన (ఉల్లాస్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి 90,426 మంది నిరక్షరాస్యులను 2029 నాటికి వందశాతం క్రియాత్మక సాక్షరతను సాధించే విధంగా లక్ష్యం రూపొందించారన్నారు. ఉల్లాస్ ముఖ్యలక్ష్యాలు ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే నని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన మండల, మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు, అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలో ఆయాలు, వాచ్‌మెన్, కుక్ సర్వే చేసి వీరిలో నిరక్షరాస్యులైన వారిని నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. 2025లో నమోదయ్యే వయోజనులకు 2026 మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందిస్తారన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్వో ఎన్ ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వయోజన విద్య డీడీ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ ప్రసా దు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా ముంతాజ్

గుంటూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్‌కే ముంతాజ్‌ను నియమిస్తూ ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సత్తె నపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటిదాకా ఆమె పని చేశారు. తాజాగా ఇంటర్ బోర్డు గుంటూ రులోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకులు నూతన ప్రిన్సిపాల్ ముం తాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎస్‌కే ముంతాజ్

ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

● జీఎంసీ ఎదుట కార్మికుల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మి కుల జీతాలను పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలి పారు. గుంటూరు నగరం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, కార్మిక సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, ప్రధానం గా ఉద్యాన కార్మికులను పారిశుధ్య కార్మికులుగా గుర్తించాలని, వారితో సమానంగా జీతం రూ.21వేలు ఇవ్వాలని కోరినా కానీ ప్రభుత్వం స్పం దించలేదని అన్నారు. అనంతరం కమిషనర్ పులి శ్రీనివాసులుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్య క్షుడు చినబోతుల వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సద్గుణరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ కార్యదర్శి చల్ల మరి యదాసు, ఆదినారాయణ, మంగమ్మ, బసవమ్మ, వీరమ్మ, నాగమ్మ, దానియేలు మన్నెమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



జీఎంసీ ఎదుట ధర్నా చేస్తున్న కోట మాల్యాద్రి తదితరులు

గురువైభవంపై ప్రవచనం


ప్రవచనం చేస్తున్న నిష్టల నరసింహామూర్తి

గుంటూరు(తూర్పు), జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావ న్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్న మయ్య కళావేదికపై సోమవారం శ్రీనిష్టల నరసింహమూర్తిచే గురు వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకాకుళం, ఉపనిషన్మందిరం కార్యనిర్వాహక అధ్యక్షుడు నిష్టల నరసింహమూర్తి ప్రవచిస్తూ రాబోయే గురు, వ్యాస పూర్ణిమ సందర్భంగా వ్యాస మహర్షి వైభవాన్ని వివిధ కోణాల్లో తెలియజేశారు. దేశభక్తి, దైవభక్తి రెండు కన్నుల వంటివని, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ, గురువుల వైభవాన్ని తెలియజేశారు.

చుట్టుగుంట పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

● 10న శాకాంబరి అలంకరణలో అమ్మవారు దర్శనం

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట వద్ద వేంచేసిన శ్రీ పోలేరమ్మతల్లి ఆలయంలో ఆషాఢమాసం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీన అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవి అలంకరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కూరగాయలు సమర్పించే వారు ఆలయంలో మంగళ, బుధవారాలు అందజేయవచ్చని ఆలయ భక్త బృందం సభ్యులు తెలిపారు. అలానే అమ్మవారికి సారె సమర్పించే భక్తులు 10, 11 వ తేదీల్లో ఆలయంలో అందజేయాలని కోరారు. ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవిగ్రహానికి అభిషేకం, కుంకుమార్చనలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం వైఖరి

● రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయకపోగా, కొత్త విధానాలను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారని అన్నారు. కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టే విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు. మన్నవ హరిప్రసాదు మాట్లాడుతూ ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో, మండలాల్లో నిరసనలు, సభలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పచ్చల శివాజీ, పీవీ జగన్నాథం, కంజుల విఠల్‌రెడ్డి, ముసలయ్య, ఈమని అప్పారావు, రామకృష్ణ, కోటయ్య, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంచుమాటి అజయ్‌కుమార్, పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమరావతి రోడ్డులో గోరంట్ల నుంచి పేరేచర్లకి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. దీంతో పట్టుబడిన వ్యక్తిని విచారించగా నిందితుడు నల్లచెరువుకు చెందిన చల్లా వెంకటేష్ అని తేలింది. అమరావతిరోడ్డులోని నగరాలు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటినే పేరేచర్ల పరిసర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, 3వ లైన్లోని శ్రీసాయినాధ సన్నిదానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సాయినాధునికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, అర్చనలు జరిగాయి. అనంతరం వందలాది మంది భక్తులతో సాయి సచ్చరిత్ర పారాయ ణం చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయినాధునికి నాగవల్లీ దళార్చన జరు గుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్ల పాటి ఆశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య తదితరులు పర్యవేక్షించారు.


పారాయణ చేస్తున్న భక్తులు


కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి
● 23వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 23వ డివిజన్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం ఆమె నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి, డివిజన్‌లో పర్యటించి, ప్రజాసమస్యలు తెలుసుకుని, సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. ఆటో డ్రైవర్లను పలకరించగా గత ప్రభుత్వంలో గుంతలమయంగా మారిన గుంటూరు నేడు రోడ్లు వేయటం వల్ల ప్రయాణం సాఫీగా సాగుతోందని, ప్రమాదాలు కూడా తగ్గాయని తెలిపారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, పింఛన్ల పెంపుదలపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. ఆదివారం నుంచి వర్షదారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో లామ్ వర్గన్‌రావు, గంటా మౌలిక, సాధు రాజేష్, మల్లె ఈశ్వరావు, యాకోబు, నవమి, గోపి, గంధం చలపతిరావు, తోట సాంబశివరావు, సయ్యద్ ఇంతియాజ్, బాబూరావు, మస్తాన్ వలి, అబ్దుల్లా ఖాన్, ఫణి పృథ్వీ బుడేమియా, గుంటా సాయి, మువ్వ వేణు, కెవికరమద్రయ్య పాల్గొన్నారు.

ఆర్వీఆర్ అండ్ జేసీలో ప్రాంగణ నియామకాలు

● 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 20మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 852 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగ ళూరుకు చెందిన ఎక్సెల్ ఆర్ కంపెనీలో 9 మంది, ప్రిధిని ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 7 మంది, ఎవరెస్ట్ ల్యాబ్ లో ఇద్దరు, బెటర్ క్యాస్టింగ్స్ కంపెనీలో ఇద్దరు చొప్పున మొత్తం 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. అకడమిక్, ఆర్ అండ్‌డీ డైరెక్టర్ కే.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, కే సురేష్‌బాబు తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీతారామయ్య హైస్కూల్‌లో వన మహోత్సవ ర్యాలీ

గుంటూరు కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం లోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో వారంరోజు ల నుంచి జరిగిన వనమహోత్సవ కార్యక్రమం సోమవారం నాటి ర్యాలీ తో ఘనంగా ముగిసింది. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసేవిధంగా ప్లకార్డు లు, పోస్టర్లతో నినాదాలు చేశారు. ఈ ర్యాలీని పాఠశాల సెక్రటరీ, కర స్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసా దరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న సీతారామయ్య హైస్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు

సుమేధ స్కూల్లో ఘనంగా నాయకత్వం ఎంపిక

గుంటూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీ లోని సుమేధ స్కూల్లో సోమవారం నాయకత్వం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దూరదర్శన్ పూర్వ వార్తా విభాగాధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు మాట్లాడుతూ విద్యార్థు ల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని సూచించారు. కార్యక్రమం లో విశ్రాంత ఉపాధ్యాయురాలు ఏవీకే సుజాత, సహాయ మున్సిపల్ కమిషనర్ కేదారేశ్వరరావు స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఎస్పీఎల్‌గా దూదేకుల మహ బూబ్ సుభానిని, ఏఎస్‌పీఎల్‌గా ద్రోణం రామ్‌పవన్ తేజ, గుణశ్రీ అవంతిక తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే రాంబాబు, మెడికల్ హబ్ ఛైర్మన్ ఆనం సంజీవరెడ్డి, ధర్మపీఠం నిర్వ హకులు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, ఎస్ సంతోష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని సుమారు 55 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి సోమవారం ఉదయం గుంటూరు ప్రభుత్వాస్పత్రి అవుట్ పేషంట్ మెయిన్ గేటు ఎదురుగా అపస్మారక స్థితిలో పడి ఉండగా పోలీసులు జీజీహెచ్‌కు తరలించామన్నారు. అక్కడ సెక్యూరిటీ గార్డ్ రవికుమార్, జీజీహెచ్ క్యాజువాలిటీలో అడ్మిట్ చేయగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి ఆ వ్యక్తి అప్పటికే చనిపోయినట్లు చెప్పారు. కొత్తపేట పోలీసు వారికి సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాస్పత్రి శవగారంలో భద్రపరిచారు. మృత దేహాన్ని గుర్తించిన వారు కొత్త పేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. కొత్త పేట పీఎస్ ల్యాండ్ లైన్ నెంబర్ 08632221815కు గానీ లేదంటే 8688831320కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

బడి బస్సు భద్రతపై.. ప్రశ్నలెన్నో!

- ఫిట్నెస్ పరీక్షలు తొలిసారిగా ప్రైవేటుకు అప్పగింత
- ఏ పరీక్షలు నిర్వహించారో తెలియని పరిస్థితి
- ప్రారంభం కాని రవాణాశాఖ తనిఖీలు
- బస్సుల సామర్థ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల సామర్థ్యంపై అనేక ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. ఈ ఏడాది వాటి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) జారీలో అసలు పరీక్షల నిర్వహణపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రైవేట్ ఏజెన్సీల వద్ద కూడా దళారులు పాగా వేయడం ఇందుకు ప్రధాన కారణం. అధికారులు తనిఖీలు నిర్వహిస్తే.. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రత ఏమాత్రం అనేది తేలుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరం మొదలై దాదాపు 25 రోజులు గడుస్తోంది. విద్యాసంస్థల బస్సుల ఫిట్నెస్ పరీక్షలు, తనిఖీలు మాత్రం వేగంగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు ఫిట్నెస్ పరీక్షలు జరుగుతాయి. ఎనిమిదేళ్ల లోపు సర్వీసులో ఉన్న విద్యా సంస్థల బస్సులు రెండేళ్లకు, ఆ పైబడి సర్వీసు ఉన్న బస్సుకు ఏటా ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ విధానాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఎన్ని బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించారో అనే విషయం తెలియడం లేదు.

ప్రైవేటు ఏజెన్సీపై ఆరోపణలు

విద్యా సంస్థల బస్సుల ఫిట్నెస్ పరీక్షలు ఈ ఏడాది ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. స్థానిక గుంటూరులోని అనంతవరప్పాడు రోడ్డులో ఈ సంస్థ కార్యాలయం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌సీ కావాలంటే సీటింగ్ కెపాసిటీని బట్టి ప్రతి బస్సు రూ.1,500 నుంచి రూ.3వేలు చలాన ప్రభుత్వానికి చెల్లించాలి. ఇతరత్రా మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు యాజమాన్యమే భరించాలి. ఈ ఏజెన్సీ వద్ద దళారులు పాగా వేశారు. ఏజెన్సీతో ఒప్పందం చేసుకుని ప్రతి స్కూల్ యాజమాన్యం నుంచి రూ.2 వేల నుంచి రూ.3వేలు వరకు అదనపు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెంటు ద్వారా వెళితేనే దాదాపు వాహనాలన్నీ ఫిటినెస్ పాస్ అవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. నేరుగా వెళితే ఆటోమేటెడ్ మిషన్ ద్వారా కాకుండా మాన్యువల్ చేసే కొన్ని నిబంధనల్లో ఏదో ఒక కొర్రీ పెట్టి.. వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

డ్రైవర్ల విషయంలో నిబంధనలు

- డ్రైవర్‌కు 60 ఏళ్లు మించకూడదు.
- బస్సు డ్రైవింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- డ్రైవరు నియామకాన్ని.. పేరెంట్స్ కమిటీకి తెలపాలి.
- బస్సు డ్రైవరు, అటెండర్ యూనిఫాం ధరించాలి.
- డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించాలి

20 శాతం పెరిగిన బస్సు చార్జీలు

ఇది ఇలా ఉంటే స్కూల్ బస్సుల చార్జీలు మాత్రం ఈ ఏడాది ఒక్కసారిగా 20 శాతంపైనే పెంచారు. కొన్ని పాఠశాలల్లో అయితే స్కూల్ ఫీజుల కంటే బస్సు ఫీజులే అధికంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రారంభం కాని తనిఖీలు

బడి బస్సుల తనిఖీలు జిల్లాలో ఇంతవరకు ప్రారంభం కాలేదు. మిగిలిన జిల్లాలో తనిఖీలు ప్రారంభించి, నిబంధనలు పాటించని బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. వాస్తవానికి నూతన విధానంలో ప్రైవేట్ ఏజెన్సీలు ఎఫ్‌సీ జారీ చేస్తున్న సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. లోపాలు గమనిస్తే వాటిని తిరిగి ఏజెన్సీకి పంపాలి. కానీ, ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు ఏజెన్సీలు జారీ చేసిన సర్టిఫికెట్లు మోటారు వాహన తనిఖీ అధికారులు ఆమోదం తెలుపుతారా లేదా అని విద్యాసంస్థల యాజ మాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కాల్లం చెల్లిన బస్సుల సంగతేంటి?

కాలం చెల్లిన బస్సులను రోడ్లపైన తిప్పవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఈ ఆదేశాలను విద్యా సంస్థల యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. సగం బస్సులను నిబంధనలకు అనుగుణంగా ఉంచి, మిగిలిన వాటిని వారి ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

తల్లిదండ్రులు గమనించాలి

విద్యా సంస్థల బస్సుల ప్రమాదాలు ఎక్కువ శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే జరుగుతుంటాయి. అనుభవం, ఇతర విషయాలను పట్టించుకోకుండా ఆ యా యాజమాన్యాలు డ్రైవర్లు నియమించు కుంటున్నాయి. రవాణా శాఖ నిబంధనల మేరకు డ్రైవర్ల నియామకం జరుగుతుందా..? లేదా అనే అంశాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.



బస్సుల విషయంలో పాటించాల్సిన నియమాలు

- పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోను, మొబైల్ నంబర్లు సహా పూర్తి చిరునామా బస్సు ఎడమ వైపు స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- అత్యవసర ద్వారం తప్పనిసరిగా ఉండాలి.
- ప్రతిబస్సులో ఒక అటెండర్ ఉండాలి.
- బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్టిక అందుబాటులో ఉండాలి. అందులో పేర్లు, చిరునామా తప్పనిసరి.
- బస్సు ఇంజన్ కంపార్టుమెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి అందుబాటులో ఉంచాలి.
- సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించ కూడదు.
- బస్సులో టీచరు, పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులు తప్పనిసరిగా ప్రయాణించాలి.
- బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక షెల్పులు ఏర్పాటు చేయాలి.

తనిఖీలను త్వరలోనే ప్రారంభిస్తాం



విద్యా సంస్థల బస్సుల తనిఖీలను త్వరలోనే ప్రారంభిస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించక పోయినా.. ఇతర నిబంధనలు మేరకు బస్సులు లేకపోయినా భారీ జరిమానాలు విధిస్తాం. అవసరమైతే విద్యా సంస్థ లైసెన్స్ కూడా రద్దు చేస్తాం. అలాగే స్కూల్ పిల్లలను చేరవేసే ఆటోలపై తనిఖీలు నిర్వహిస్తాం.

-కే సీతారామిరెడ్డి,
జిల్లా ఉప రవాణా కమిషనర్

ఘాటెక్కిన పచ్చిమిర్చి

- కిలో రూ. 80లు, రూ.40 చేరిన టమాటా
- అదే బాటలో ఇతర కూరగాయల ధరలు




గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. మొన్నటి వరకు అందుబాటులో ఉన్న టమాటా, పచ్చి మిర్చి ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని పెద్ద మార్కెట్‌లో పచ్చి మిర్చి కిలో రూ. 80కు విక్రయిస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ.40 ఉన్న ధర...ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. ఇక టమాటా కిలో రూ.20 నుంచి రూ.40కు చేరింది. వంకాయ మొన్నటి వరకు కిలో రూ. 30 ఉండగా ఇప్పుడు రూ. 60లు రెట్టింపు ధర పలుకుతోంది. దొండ కాయలు కూడా కిలో రూ.40 ఉండగా తాజాగా రూ. 60కి ధర చేరింది. ఇక ములక్కాయ మొన్నటి వరకు ఒకటి ఐదు రూపాయల ఉండగా.. ప్రస్తుతం ఒకటి రూ. 15ల నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కూరగాయల ఉత్పత్తి డిమాండ్‌కు అనుగుణంగా లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. ఇతర కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయని పేర్కొన్నారు. మరి కొన్ని రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. రైతు బజార్లలో కూడా ధరలు పెరుగుతున్నాయి. టమాటా కిలో రూ. 33 ఉండగా పచ్చి మిర్చి కిలో రూ.62లకు విక్రయిస్తున్నారు. ఇక దొండ కాయలు కిలో రూ. 39లు కాగా క్యారెట్ రూ. 45లు ధర చెబుతున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.27 లక్షల మోసం

గుంటూరు, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని.. పెట్టుబడులు పెట్టించి రూ.27 లక్షల మోసం చేశారని పొన్నూరు లోని ఇటికంపాడు రోడ్డుకు చెందిన మున్సిపల్ స్కూలు ఉపాధ్యాయుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను ఓ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని దాని ద్వారా ట్రేడింగ్ ప్రారంభించగా.. కొందరు తనకు ఫోన్ చేసి.. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించారన్నారు. మొదట్లో పెట్టుబడి పెట్టగా లాభం వచ్చినట్టు చూపించారన్నారు దీంతో ఆశపడి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టగా తర్వాత ఒక రూపాయి కూడా రాలేదని తెలిపారు. ఖాతాలో తనకు లక్షల రూపాయలు వస్తున్నట్లు చూపిస్తున్నారని, డ్రా చేసేందుకు అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని.. న్యాయం చేయాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

నేడు డీఆర్‌సీ సమావేశం



గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి సమావేశం మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యన ఈ సమావేశం జరుగుతుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. గత సమావేశంలో ఆమోదించిన తీర్మానాలపై తీసుకొన్న చర్యలను తొలుత చర్చిస్తారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుని సమీక్షిస్తారు.

● జిల్లాలో ప్రస్తుతం ప్రధానంగా మండుతున్న అంశం హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు. ఏపీ మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతుల్లో అసంతృప్తి తొలగిపోలేదు. పొగాకు కొనుగోలు చేయడానికి అనేక కొర్రీలను అధికారులు వేస్తున్నారు. నాణ్యమైన పొగాకు తీసుకొచ్చినా థర్డ్ గ్రేడ్ కింద లెక్కించి క్వింటాకు రూ. 6 వేలు మాత్రమే లెక్కగడుతున్నారని రైతులు వాపోతున్నారు.

● రేషన్ పంపిణీలో ఎండీయూలను తొలగించి డీలర్ల వ్యవస్థని పునరుద్ధరించినప్పటికీ అక్రమాలు ఆగడం లేదు. నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. గత సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశంపై ఆగ్రహం వ్యక్తం చేసినా.. అధికారుల తీరులో ఎలాంటి మార్పు రాలేదు.

● జిల్లాలో నకిలీ పురుగు మందులు, విత్తనాలు విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారే తప్పా సూత్రధారులను అడ్డుకోలేకపోతున్నారు.

● ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఇంకా పంటల సాగు లక్ష్యం మేరకు ప్రారంభం కాలేదు. డెల్టాలో కాల్వలకు నీరు విడుదల చేసినా ప్రస్తుతానికి తాగునీటి అవసరాల నిమిత్తం చెరువులు నింపడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

● ఫిరంగిపురం పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న డ్రాగన్, బొప్పాయి పంటల దిగుబడులు భారీగా రావడంతో వాటి ధరలు పతనం అయ్యాయి. నేడు కేజీ రూ.100కు డ్రాగన్ విక్రయించుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. బొప్పాయి అయితే రూ. 100 ఐదు కాయలు ఇస్తున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు.

ఈ అంశాలన్నింటిపై డీఆర్‌సీలో చర్చ జరగాలని జిల్లా ప్రజలు కోరుకొంటున్నారు.

ఆటకు వీడని వైసీపీ శాప్‌ం..!

పేదలకు క్రీడా సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. ఆట ఆడాలంటే డబ్బు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) చేతిలో నడవాల్సిన ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు ప్రైవేటు వ్యక్తులకు ఆదాయ వనరుగా మారాయి. స్టేడియాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసి.. ఆటలకు పనికిరాకుండా చేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వేలం వేసి మైదానాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై ఎన్నికల సమయంలో పెదవి విరిచిన కూటమి నేతలూ.. ఇప్పుడు వారి దారిలోనే ఆక్షన్ పెట్టి..స్టేడియాలను అప్పగించేశారు.

- లీజుకు క్రీడా ప్రాంగణాలు
- తాజాగా నరసరావుపేట, తెనాలి ఇండోర్ స్టేడియాలు..
- నిర్వహణ లేక అధ్వానంగా తెనాలి స్టేడియం
- పరిమితి లేని వసూళ్లతో క్రీడాకారులు దూరం
- పర్యవేక్షణపై పట్టు కోల్పోయిన శాప్
- దెబ్బతింటున్న రూ.కోట్ల విలువైన ఆస్తులు
- వైసీపీ ప్రభుత్వంలో చేసిందే కూటమిలోనూ..



తెనాలి ఇండోర్ స్టేడియం

తెనాలి, జూలై 7, (ఆంధ్రజ్యోతి): నిధులు లేవన్న సాకుతో.. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనే అమలు చేస్తూ.. తాజాగా స్టేడియాలకు ఆక్షన్ పెట్టి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. నరసరావుపేట స్టేడియంను ఐదు నెలల క్రితమే అప్పగించగా.. తెనాలి స్టేడియానికి ఈ నెల 27న ఆక్షన్ నిర్వహించారు.నరసరావుపేట స్టేడియం గతంలో రూ.26,500 వేలం జరిగితే.. దీనిపై పది శాతం అదనంగా కలిపి వేలం నిర్వహించారు. తెనాలి స్టేడియం రూ.1.01 లక్షలకు గతంలో వేలం జరిగింది. దీనిపైనా అదనంగా ఆక్షన్ మొత్తాన్ని నిర్ణయించి వేలం పెట్టారు. నిజంగా నిర్వహణకు నిధులు లేమి ఉంటే..ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన తర్వాత వారు వసూలు చేసే ఫీజుల విషయంలో ఒక పరిమితి పెట్టాల్సి ఉంది. కానీ అదేమీ, లేకుండా.. వేలం డబ్బు కట్టేసి, ఎంతైనా వసూలు చేసుకోండి అన్న చందంగా శాప్ తీరు ఉంది. క్రీడాకారులు వస్తే మాకేంటి? రాకపోతే మాకేంటి? ఆపై మీ ఇష్టం అన్నట్లు నిర్ణయాలు ఉండటం క్రీడాకారులను విస్మయానికి గురి చేస్తోంది.

> 'మేము అధికారంలోకి వచ్చాం.. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను రద్దు చేస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తులను ఖాళీ చేయించి, శాప్ ఆధ్వర్యంలోనే క్రీడా మైదానాలు, స్టేడియంలు నిర్వహిస్తాం. క్రీడలకు పూర్వ వైభవం తీసుకొస్తాం.' ఇదీ శాప్ చైర్మన్ రవినాయుడు ఇటీవల తెనాలి వచ్చినప్పుడు చేసిన వ్యాఖ్యలు.

ఆక్షన్‌లో..ఆట

క్రీడాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆదాయ వనరుగా చూడలేదు. పేద, ధనిక తేడా లేకుండా నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చే ఒక గొప్ప అవకాశంగానే పరిగణిస్తూ వచ్చాయి. అయితే.. రాష్ట్రంలోని క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాల నిర్వహణకు గత వైసీపీ ప్రభుత్వం ఆక్షన్ విధానం తీసుకొచ్చింది. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అప్పగించేసింది. పైగా వారు ఎంత ఫీజులు వసూలు చేస్తే అంత దండుకునే విధంగా విధివిధానాలు రూపొందించింది. దీనిని అప్పట్లో వారు బాగానే ఉపయోగించుకున్నారు. క్రీడాకారుల దగ్గర ముక్కు పిండి మరీ వసూలు చేసి దోచుకున్నారు. కానీ, క్రీడా మైదానాలను యథా స్థితిలో అప్పగించాలనే నిబంధనను మాత్రం గాలికొదిలేశారు. దెబ్బతిన్న మైదానాలు, స్టేడియం పరికరాలను మాత్రం అలానే వదిలేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలి, నరసరావుపేట ఇండోర్ స్టేడియాలు, జిమ్ పరికరాలను భ్రష్టు పట్టించారు.

పేదలు క్రీడలకు దూరం..

గత వైసీపీ సర్కారు రావడంతోనే.. ఏ రంగం నుంచి ఎంత ఆదాయం పొందొచ్చు! ఏ రూపంలో దోచుకోవచ్చనే తరహాలో ఆలోచన చేసింది. క్రీడలను వ్యాపారంగా మార్చేయడంతో.. ఆ ఐదేళ్లు పేదలు క్రీడా మైదానాలకు దూరమయ్యారు. మట్టిలో మాణిక్యాలు మట్టిలోనే ఉండిపోయారు. ప్రైవేట్ వ్యక్తులు వసూలు చేసే ఫీజు లకు భయపడి అటువైపు రావడమే మానేశారు.

పూర్తి వసతులతో స్టేడియం నిర్మాణం

ఒక స్టేడియం, లేక ఏదైనా క్రీడా ప్రాంగణం లీజుకిస్తే..నిర్వహణను లీజుకు తీసుకున్న వారే బాధ్యులు. ఇక్కడ ప్రయివేటు విధానంలో వసూ ళ్లు మినహా నిర్వహణ లేనేలేని పరిస్థితి నెలకొం ది. 2017లో అప్పటి మంత్రిగా లోకేశ్ శంకుస్థాపన చేస్తే.. ఈ ఇండోర్ స్టేడియాన్ని 2018లో రూ.2 కోట్లతో పూర్తి చేశారు. లోపల నాలుగు షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేశారు. షటిల్ కోసం ఉడెన్ ఫ్లోరింగ్‌ను రూ. కోటిన్నరతో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూర్తిచేయించారు. దీనిపై గ్రీన్ మ్యాట్ కూడా అమర్చారు. మరో రూ. 2 కోట్లకుపైగా ఖర్చుపెట్టి క్రీడా ప్రాంగణం చుట్టూ ప్రహరీ, లోపల క్రీడా మైదానం అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు సమకూర్చారు. పూర్తి స్థాయి వసతులు కల్పించి, అప్పట్లో ఇక్కడ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు కూడా నిర్వహించారు.

రొచ్చు..రొచ్చు..

వైసీపీ సర్కారు వచ్చాక తెనాలి ఇండోర్ స్టే డియంలో.. మెమోరియల్ తరహా క్రీడా పోటీలు మినహా, ప్రతిష్ఠాత్మక క్రీడల నిర్వహణే లేకుండా పోయింది. తర్వాత ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వె ళ్లి.. ఇండోర్ స్టేడియం పైకప్పు దెబ్బతింది. వర్షపు నీరు లీకేజీ కావడంతో.. రూ.కోట్ల ఖర్చుతో వేయించిన చెక్క ఫ్లోర్ దెబ్బతిని పోతోంది. దీనిని సరిచేయించాల్సింది పోయి, నీరు పడుతున్న చోట మున్సిపాలిటీ డస్ట్ బిన్‌లను పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇక రాత్రిళ్లు వర్షం పడితే మా త్రం చెక్క మొత్తం తడిచిపోయి పాడయిపోయి న పరిస్థితి ఉంది. ఉన్నవాటిని ఉన్నట్లు అప్పగించకుండా.. పాడయిపోయిన స్థితిలో తిరిగి శాప్‌కు అప్పగించారు. మళ్లీ ఇప్పుడు ఆక్షన్ పెట్టి మరొకరికి నిర్వహణ అప్పగించారు. వీరు కూడా వాటిని సరిచేయకపోగా, పాడయిన స్థానంలో ఏ మరమ్మతులు చేయించకుండా ఉన్నదానిని వా డుకుని డబ్బులు.. వసూలు చేసుకునే పరిస్థితే కనిపిస్తోంది.

నిధులు లేక..ప్రైవేట్‌కు...

ఒక స్టేడియం నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చవుతోంది. కోచ్‌లు సరిపడా లేరు. ఉన్నవారికి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. శాప్‌కు నిధుల లేమి కారణంగా స్టేడియాలను లీజుకు ఇస్తున్నాం. వేలం నిర్వహించడం వరకే మా బాధ్యత. నిర్వహణ అంశాలను ఎప్పటికప్పుడు శాప్ పర్యవేక్షిస్తుంది. యథాతద స్థితిలో స్టేడియం అప్పగించని వారిపై చర్యలుంటాయి. వారి నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తాం.

-నరసింహారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి, గుంటూరు

విజ్ఞానం మానవ...

కళ్యాణానికే వినియోగించాలి

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మానవ కల్యాణానికి ఉపయోగించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల హాస్టల్, కాలేజీ డే వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి, సభలో మాట్లాడారు. ఫుడ్ సైన్స్ అనేది కేవలం ఒక శాస్త్రమే కాకుండా సమాజాన్ని ఆరోగ్యంగా మార్చే శక్తి అని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఏవీ రమణారావు మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషిస్తూ విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. మరొక అతిథి పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలపై దృష్టి పెట్టి ప్రాక్టీకల్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాశాల ఫుడ్ టెక్నాలజిస్ట్ మ్యాగజైన్‌ను విడుదల చేశారు. హాస్టల్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఎ.మణి, డాక్టర్ ఎస్.బ్లెస్సీ సాగర్, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి తదితరులు

వడ్డీ చెల్లించలేదని...

ఇంటి నుంచి గెంటేశారు

- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు



ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తల్లీ, కుమారుడు

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న బాకీకి సంబంధించి అధిక వడ్డీ డబ్బులు చెల్లించలేదని.. తమను ఇంటి నుంచి బయటకు గెంటేసి, తాళాలు వేశారని పాత గుంటూరులోని శివాలయం వెనుక బజారుకు చెందిన బాధితురాలు.. కుమారుడితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. బాధితుల ఫిర్యాదు మేరకు.. కార్పొరేషన్‌లో ఉద్యోగం చేసే వడ్డీ వ్యాపారి బండి రాంబాబు వద్ద 2022 మార్చిలో ఆమె రూ.3లక్షలు అప్పుగా తీసుకుంది. దానికి వడ్డీ చెల్లిస్తూ వస్తున్నారు. రెండో దఫా 2022 నవంబరులో మరో రూ.4 లక్షలు అప్పు తీసుకున్నామన్నారు. మొత్తం రూ.7 లక్షలు అప్పు తీసుకొని వడ్డీ చెల్లిస్తున్నారు. అనారోగ్య కారణాల వల్ల వడ్డీ చెల్లించలేకపోయా యని బాధితురాలు పేర్కొంది. మే 26న రాంబాబు, అతని భార్య, బంధువు లు ఇంటిపై దాడి చేసి తనను, తన కుమారుడిని ఇంటి నుంచి బయటకు గెంటి తాళాలు వేశారని వాపోయింది. అప్పటి నుంచి అక్కడే ఉన్న గుడిలో తలదాచుకుంటున్నామని చెప్పారు. అసలు రూ.7 లక్షలు చెల్లిస్తానని ప్రాధేయపడినా.. ఒప్పుకోకపోగా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని చెప్పారు. అప్పుడు ఇంటిలోకి వెళ్లగా.. మళ్లీ దాడి చేసిన బయటకు గెంటేశారని బాధితురాలు వివరించారు.

మీకు తెలుసా?

అరచేతుల్లో ఆరోగ్యం

అరచేతుల ఉష్ణోగ్రత పేగుల ఆరోగ్యాన్ని సూచిస్తుందని వైద్యులంటున్నారు. వెచ్చని, చల్లని అరచేతులు భిన్నమైన ఆరోగ్య పరిస్థితులకు అద్దం పడతాయని వైద్యులు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

చేతుల ఉష్ణోగ్రత, శరీరంలోని రక్తప్రవాహం, శరీర వేడి నియంత్రణ సామర్థ్యం, నాడీ వ్యవస్థ సంతులనం లాంటి కీలకమైన వివరాలను అందిస్తుందని చెన్నైలోని శ్రీ బాలాజీ మెడికల్ సెంటర్ డైటీషియన్, దీపాలాక్షి పేర్కొంటున్నారు. పేగుల్లో నివసించే సూక్ష్మక్రిములు శరీర తాపమనాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. కాబట్టి యాంటీ బయాటిక్స్‌తో ఆ సూక్ష్మజీవుల మోతాదు అస్తవ్యస్థమైనప్పుడు, ఆ ప్రభావం శరీర ఉష్ణోగ్రతను హెచ్చుతగ్గులకు లోను చేస్తోందని అంటున్నారామె. పేగుల ఆరోగ్యం, నాడీ వ్యవస్థల పనితీరు మెరుగ్గా ఉన్నప్పుడు అరచేతులు వెచ్చగా ఉంటాయి. ఒకవేళ అరచేతులు చల్లగా ఉంటే, రక్తప్రవాహం మెరుగ్గా లేదనీ, ఒత్తిడి విపరీతంగా ఉందనీ, శరీరం మెరుగ్గా పని చేయడం లేదనీ అర్థం చేసుకోవాలి. ఈ ప్రత్యక్ష లక్షణాలు పేగుల్లోని ఉపయోగకరమైన సూక్ష్మజీవుల మోతాదును కనిపెట్టడానికి పనికొస్తాయి. కాబట్టి వాటిని పెంచుకునే ఆహార నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అంటున్నారామె.



పరిశోధన

పొట్ట కొవ్వుతో సోరియాసిస్ ముప్పు

పొట్ట భాగంలో కొవ్వు పేరుకు పోవడం వలన దీర్ఘకాలిక చర్మ సంబంధిత వ్యాధి సోరియాసిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని యూకే పరిశోధకులు కనుగొన్నారు. అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం..



పొట్ట భాగంలో కొవ్వుకూ, సోరియాసిస్‌కూ మధ్య ఎంతో దగ్గరి సంబంధం ఉందనీ, సోరియాసిస్‌కు బెల్లీ ఫ్యాట్ ఓ ప్రధాన కారణమని పరిశోధకులు తాజాగా కనిపెట్టారు. ఇందుకోసం నడుము, కటి నిష్పత్తి, పొత్తికడుపు కొవ్వు నిష్పత్తి, నడుము చుట్టుకొలత, పొట్ట చుట్టూరా ఉన్న మొత్తం కొవ్వు కణజాలాలతో పాటు శరీరంలోని 25 వేర్వేరు శరీరావయవాల్లోని కొవ్వు పరిమాణాలను పరిశీలించారు. ప్రత్యేకించి నడుము చుట్టూరా కొవ్వు ఎక్కువగా ఉన్న వారికీ సోరియాసిస్‌కూ దగ్గరి సంబంధం ఉన్నట్టు ఈ ప్రయోగం ద్వారా పరిశోధకులు కనిపెట్టారు. సోరియాసిస్‌కు జన్యు మూలాలు కూడా లేకపోలేదు. అయినప్పటికీ పొట్ట దగ్గర కొవ్వు కలిగిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటోంది. మరీ ముఖ్యంగా మహిళలకు ఈ ముప్పు మరింత ఎక్కువ. అలాగే బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా ఊబకాయం ఏ స్థాయిలో ఉందో అంచనా వేయగలుగుతున్నప్పటికీ, దీని ద్వారా సోరియాసిస్ ముప్పును కచ్చితంగా అంచనా వేయలేమని కూడా పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే సోరియాసిస్ ముప్పు విషయంలో, శరీరంలో కొవ్వు పేరుకున్న ప్రదేశం కీలకంగా మారుతుందనీ, నడుము చుట్టూరా పేరుకున్న కొవ్వు సోరియాసిస్ ముప్పును పెంచుతుందని తామీ ప్రయోగం ద్వారా కనిపెట్టినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు.

యాంటీ ఏజింగ్



బాలీవుడ్ నటి షెఫాలీ షా మరణంతో, యాంటీ ఏజింగ్ చికిత్సలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ చికిత్సల్లో భాగంగా తీసుకునే ఇంజెక్షన్లు, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కాస్మటిక్ క్లినిక్స్ ఏ మేరకు సురక్షితం? వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!

యవ్వన చికిత్సలు ఆచితూచి

సౌందర్య చికిత్సలన్నీ ప్రమాదకరమైనవి కావు. నిజానికి తగిన అర్హతలు, అనుభవం, సామర్థ్యం ఉన్న వైద్యుల పర్యవేక్షణలో ఈ చికిత్సలతో అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. పైబడే వయసుతో ముఖంలో చోటుచేసుకునే మార్పులను సరిదిద్దడానికి పలు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. యాంటీ ఏజింగ్‌లో భాగంగా 'గ్లూటాథయాన్' అనే ఇంజెక్షన్‌తో వైటెనింగ్ ట్రీట్మెంట్ తీసుకోవడంతో పాటు, యాంటీఆక్సిడెంట్లు కూడా తీసుకోగలిగితే, ఫలితం మెరుగ్గా ఉంటుంది. వీటితో పాటు ముఖం మీద వృద్ధాప్య ఛాయలను దూరం చేయడం కోసం స్కిన్ హైడ్రేషన్, ఫిల్లర్స్, కొల్లాజెన్ స్టిమ్యులేటర్స్, బొటాక్స్ లాంటివి అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవన్నీ పరిమితి మేరకు వాడుకున్నప్పుడే సహజసిద్ధ ఫలితం సొంతమవుతుంది. ఉదాహరణకు గ్లుటాథయాన్ తీసుకున్నప్పుడు, చర్మం తెల్లబడడంతో పాటు, నునుపుదనం పెరుగుతుంది. అయితే వైద్యులు సూచించిన మోతాదుకు మించి తీసుకుంటే, కచ్చితంగా దుష్ప్రభావాలను భరించవలసి ఉంటుంది.

గ్లూటాథయాన్ సురక్షితమే!

ఈ మందు మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో దొరుకుతుంది. అయితే మాత్రలతో పోలిస్తే, ఇంజెక్షన్లు మెరుగైన ఫలితాన్నిస్తాయి. ఇంజెక్షన్ కూడా సెలైన్ ద్వారానే ఇవ్వవలసి ఉంటుంది. ఈ ఇంజెక్షన్ ప్రభావం నాలుగు నుంచి ఐదు వారాల పాటు ఉంటుంది. తర్వాత కూడా నెలకు ఒకటి లేదా రెండు ఇంజెక్షన్లు తీసుకోగలిగితే, అదే ఫలితం మరికొంత కాలం కొనసాగుతుంది. వీటిని తీసుకోవడం మానేస్తే, రెండు మూడు నెలల్లో పూర్వపు స్థితికి చేరుకుంటారు. కాబట్టి యవ్వనంగానే కనిపించాలని కోరుకునే వారు, వైద్యుల పర్యవేక్షణలో వాళ్లు సూచించినంత కాలం ఈ ఇంజెక్షన్లు తీసుకోవచ్చు. వీటిని క్రమం తప్పక తీసుకున్నప్పుడు, రెండు నుంచి మూడు రెట్లకు చర్మపు రంగు మెరుగుపడుతుంది. 16 ఏళ్లు దాటిన యువతులు, 17 ఏళ్లు దాటిన యువకులు ఈ ఇంజెక్షన్లు తీసుకోవచ్చు. అయితే గ్లూటాథయాన్ ఇంజెక్షన్లను సరిపడా మోతాదులో, సరైన పద్ధతిలో తీసుకోలేకపోతే, ఫలితం ఉండదు. ఈ ఇంజెక్షన్ ఇవ్వడానికి కూడా కొన్ని నియమాలు పాటించాలి. దీని కంటే ముందు శరీరాన్ని సిద్ధం చేయడం కోసం, 45 నిమిషాల పాటు విటమిన్ సి, విటమిన్ బి6 లాంటి పోషకాలతో ఐవి అందించి, ఆ తర్వాతే గ్లూటాథయాన్‌ను సెలైన్ ద్వారా ఇవ్వవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆ ఔషధాన్ని శరీరం శోషించుకుని, సమర్థంగా వినియోగించుకోగలుగుతుంది. అలాగే సెలైన్‌ను ముదురు రంగు వస్త్రంతో కప్పవలసి ఉంటుంది. లేదంటే ఔషధ ప్రభావం సన్నగిల్లుతుంది.

పలు రకాల చికిత్సలతో...

పైబడే వయసు సూచనలను తగ్గించుకుని, యవ్వనంగా కనిపించడం కోసం సమతులాహారం తీసుకోవడంతో పాటు కంటి నిండా నిద్రపోవాలి. అయినప్పటికీ వాతావరణ కాలుష్యం, శరీరంలోకి చేరుకునే రసాయనాల వల్ల 30 ఏళ్లకే చర్మం రంగు తగ్గడం,



ఎగుడుదిగుడుగా మారడం లాంటి మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. చర్మం బిగుతుగా ఉన్నప్పుడే యవ్వనంగా కనిపిస్తాం. కాబట్టి అందుకోసం చర్మ తత్వం ఆధారంగా మాయిశ్చరైజర్ వాడుకోవచ్చు. అలాగే చర్మం మీద మృత పొర తొలగకపోయినా, చర్మం నిర్జీవంగా కనిపిస్తుంది. కాబట్టి ఆ పొర తొలగిపోవడం కోసం విటమిన్ ఎ కలిగిన రెటినాల్‌ను మూడు నుంచి ఆరు నెలల పాటు వాడుకుంటే ఫలితం ఉంటుంది. అలాగే పైబడే వయసులో వేధించే మరొక సమస్య, మంగు. మంగులో, మెలాస్మా సమస్య సర్వసాధారణం. దీన్ని తొలగించడం కోసం లేజర్‌తో పాటు, ముఖ చర్మంలోకి ఇంజెక్షన్లు, పైపూత మందులు వాడుకోవచ్చు. వీటిలో పైపూత మందులు అంతగా ప్రభావాన్ని కనబరచవు. కంటి కింద నలుపు, వలయాలకు పిగ్మెంట్ కారణమైతే, అందుకు తగిన చికిత్సను వైద్యులు ఎంచుకుంటారు. కొందరికి సన్నని గీతలు ఏర్పడి చర్మం కుంచించుకుపోయి, ఆ కారణంగా కంటి కింద నలుపు ఏర్పడుతుంది. కాబట్టి ఆ ప్రదేశంలోని చర్మం ఉబ్బినట్టు కనిపించడం కోసం బూస్టర్లను అందించవలసి ఉంటుంది. ఈ బూస్టర్లు, శరీరంలోని నీటిని పీల్చుకుని ఉబ్బినట్టుగా మారి చర్మపు నలుపు తగ్గుతుంది.

సాగిన చర్మం కోసం...

సాగిన చర్మాన్ని పైకి లాగి, బిగుతును పెంచే చికిత్సలు కూడా ఉన్నాయి. ఇందుకోసం థ్రెడ్స్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం చర్మంలోకి చొప్పించి, వాటిని అలాగే వదిలేసే థ్రెడ్స్ కూడా అందుబాటులోకొచ్చాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి కాబట్టి చర్మం బిగుతును సంతరించుకుంటుంది. డీప్ ప్లేన్ ఫేస్‌లిఫ్ట్, ఎండోస్కోపీ ఫేస్ లిఫ్ట్ అనే ఆధునిక చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటితో మచ్చలు తక్కువ, ప్రభావం ఎక్కువ. ఈ ప్రభావం దీర్ఘ కాలం పాటు నిలిచి ఉంటుంది. కొద్ది మేరకు ముఖ చర్మం సాగిన వారికి ఈ చికిత్సతో అద్భుతమైన ఫలితం సాధించవచ్చు. ఎక్కువ సాగిన వారికి వరుస చికిత్సలు అవసరమవుతాయి. చర్మం ఉపరితలం అడుగున చేసే చికిత్సల తదనంతరం నాలుగైదు రోజుల పాటు చర్మాన్ని రుద్దుకోకుండా ఉండాలి. అలాగే సన్‌స్క్రీన్ వాడుకోవాలి. లేజర్ చికిత్స తీసుకున్నప్పుడు ఏడు నుంచి పది రోజుల పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ క్రీమ్స్, మాయిశ్చరైజర్లు వాడుకోవాలి. థ్రెడ్ లిఫ్ట్ చికిత్స తదనంతరం ఐదు నుంచి ఏడు రోజులు చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఫేస్ లిఫ్ట్ సర్జరీ తదనంతరం మూడు నుంచి ఐదు వారాల పాటు జాగ్రత్తగా ఉండాలి.

చర్మపు బిగుతు

చర్మపు బిగుతును తాత్కాలికంగా పెంచే మిషన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రేడియో ఫ్రీక్వెన్సీ, మైక్రో నీడ్లింగ్ ఈ కోవకు చెందినవే! ఇవి చర్మపు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి, నునుపును పెంచుతాయి. దాంతో చర్మం సాగే తత్వం కొంత కాలం పాటు వాయిదా పడుతుంది.

చవక బేరం ప్రమాదమే!

ఆన్‌లైన్‌లో ఒక వస్తువు కొనేటప్పుడు రివ్యూలు చదివి, ఒకటికి నాలుగు వెబ్‌సైట్లు చూసి, నమ్మకం కుదిరిన తర్వాతే కొనుగోలు చేస్తూ ఉంటాం. అలాంటప్పుడు శరీరంలో అత్యంత ముఖ్య భాగమైన ముఖాన్నే వాళ్ల చేతుల్లో పెట్టేటప్పుడు, ఇంకెంత జాగ్రత్తగా ఉండాలో ఎవరికి వారు ఆలోచించుకోవాలి. సౌందర్య చికిత్సల విషయంలో రాజీ పడిపోవడం సరి కాదు. చవకలో దొరికే చికిత్సల ప్రభావం తక్కువగా ఉండడమే కాకుండా, వాటిలో ఉపయోగించే ముడి పదార్థాలు నాసిరకానికి చెందినవి కావడంతో, దుష్ప్రభావాలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి చికిత్స అందించే అర్హతలు, అదనపు శిక్షణ, అనుభవం, పరిజ్ఞానం ఉన్న డెర్మటాలజిస్టులు, ప్లాస్టిక్ సర్జన్‌లను మాత్రమే ఎంచుకోవాలి.

ఆరోగ్యంగా ఉంటే, యవ్వనంగా కనిపిస్తాం! కాబట్టి సహజసిద్ధంగా ఆరోగ్యంగా ఉంచే ఆహారశైలి, జీవనశైలి అనుసరించాలి. సమతులాహారం, వ్యాయామం చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. శాకాహారులు యవ్వనంగా కనిపించడమే కాకుండా, ఎక్కువ కాలం జీవిస్తారని అధ్యయనాల్లో రుజువైంది. కాబట్టి మాంసాహారాన్ని పరిమితం చేయాలి. పీచు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే చర్మ రక్షణ చేపట్టాలి. అందుకోసం ఉపయోగించే ఉత్పత్తులు నాణ్యమైనవి అయి ఉండాలి. చవక ఉత్పత్తులకు బదులుగా సురక్షితమైన ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాత్రివేళ చర్మాన్ని శుభ్రపరుచుకుని, మాయిశ్చరైజర్లతో తేమగా ఉంచుకోవాలి. సన్‌స్క్రీన్స్‌తో ఎండ నుంచి చర్మాన్ని రక్షించుకోవాలి.

డాక్టర్ సుధాకర్ ప్రసాద్
సీనియర్ కన్సల్టెంట్ కాస్మటాలజీ అండ్ ప్లాస్టిక్ సర్జరీ,
అపోలో హాస్పిటల్స్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్.



వానాకాలం వెతలు

ఊపిరితిత్తులు ఇలా సురక్షితం

వానాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు విజృంభించడం సహజం. అయితే అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సమర్థమైన మందులను ఎంచుకోగలిగితే, ఊపిరితిత్తుల వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చు అంటున్నారు వైద్యులు.

వానాకాలంలో ఎక్కువగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు విజృంభిస్తాయి. అయితే అలర్జీ తత్వం ఉన్న వాళ్లు, ఉబ్బసం ఉన్న వాళ్లలో ఈ కాలం ఆ రుగ్మతలు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. అలాగే ఈ కాలంలో చోటుచేసుకునే వాతావరణ మార్పుల వల్ల, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి అయిన సిఒపిడి రోగుల్లో ఆ సమస్య మరింత తీవ్రమవుతూ ఉంటుంది. అలాగే రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారు, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల మార్పిడి రోగులు, కీమోథెరపీ తీసుకుంటున్న క్యాన్సర్ రోగులు, తీవ్రమైన గుండెజబ్బులున్న వారు... ఇలా ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్న వారికి వైరల్ ఇన్‌ఫెక్షన్ ప్రభావం ఊపిరితిత్తుల మీద అధికంగా ఉంటుంది. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ శ్వాసనాళానికే పరిమితమవకుండా, ఊపిరితిత్తుల్లోకి కూడా ప్రయాణించి, వైరల్ న్యుమోనియా తలెత్తుతుంది.

వైద్యులను ఎప్పుడు కలవాలి?

వానాకాలంలో దగ్గులు, జలుబులు సర్వసాధారణం. ఇవి మూడు నుంచి ఐదు రోజుల పాటు వేధిస్తాయి. అయితే ఉన్న వాటికి కొత్త లక్షణాలు తోడైనప్పుడు వెంటనే అప్రమత్తం కావాలి. అవేంటంటే....



- లక్షణాలు ఐదు రోజులకు మించి కొనసాగినా...
- క్రమేపీ లక్షణాల తీవ్రత పెరుగుతున్నా
- విపరీతమైన నీరసం ఆవరించినా
- కళ్లు తిరుగుతున్నా
- విపరీతమైన డీహైడ్రేషన్‌కు గురైనా
- రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గినా
- గుండె వేగం పెరిగినా

అలాగే సిఒపిడి, ఉబ్బసం ఉన్న వారికి అప్పటికే ఉన్న లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. పిల్లికూతలు, కొన్ని అడుగులు నడకకే ఆయాసం అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను కలవాలి.


వ్యాక్సిన్లతో అడ్డుకట్ట

ఫ్లూ వ్యాక్సిన్: ఫ్లూతో ఊపిరితిత్తుల శక్తి సన్నగిల్లే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి ఏడాదీ ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలి

న్యూమోకోకల్ వ్యాక్సిన్: ప్రివెనార్ 13, న్యుమోవ్యాక్స్ 23 అనే రెండు రకాల ఫ్లూ వ్యాక్సిన్లు ఉంటాయి. 65 ఏళ్లు పైబడిన వాళ్లు, 50 ఏళ్లు పైబడి, దీర్ఘకాలిక జబ్బులున్న వారు ఈ వ్యాక్సిన్లను తప్పనిసరిగా తీసుకోవాలి. ఫ్లూ వ్యాక్సిన్‌ను ఏడాదికోసారి, న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను ఐదేళ్లకోసారి తీసుకోవాలి.

డిపిటి వ్యాక్సిన్: సిఒపిడి రోగులు ఈ వ్యాక్సిన్ వేసుకోవడం మంచిదనే మార్గదర్శకాలు తాజాగా విడుదలయ్యాయి.

షింజిల్స్ వ్యాక్సిన్: సిఒపిడి రోగులు, రోగనిరోధకశక్తి తగ్గిపోయిన వారు హెర్పిస్ జోస్టర్ ఇన్‌ఫెక్షన్ తిరిగి ప్రేరేపితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దాన్ని నియంత్రించడం కోసం షింజిల్స్ వ్యాక్సిన్ తీసుకోవాలి.



సమర్థమైన చికిత్సలున్నాయి

మునుపటితో పోలిస్తే, ప్రస్తుతం చికిత్సా ప్రక్రియలు మరింత పురోగతి సాధించాయి. మునుపు లక్షణాల ఆధారంగా మందులను సూచించేవారు. కానీ ఇప్పుడు జబ్బు తీవ్రతను అంచనా వేసి చికిత్సను నిర్ధారించడం కోసం ఎక్స్ రే, సిటి స్కాన్‌లు, ఊపిరితిత్తుల పనితీరును అంచనా వేయడానికి పల్మొనరీ ఫంక్షన్ పరీక్ష అందుబాటులోకొచ్చాయి. అలాగే ఇన్‌ఫెక్షన్ రకాన్ని తెలుసుకోవడం కోసం ఊపిరితిత్తుల్లోని కఫాన్ని సేకరించి పరీక్షించే బ్రాంకోస్కోపీ పరీక్ష కూడా ఇప్పుడు అందుబాటులో ఉంది. అలాగే సిఒపిడి రోగులకు కొత్త మందులు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. ఆక్సిజన్ మోతాదు తగ్గిపోయిన వారికి ఇంట్లోనే వాడుకునే వీలుండే లాంగ్ టర్మ్ ఆక్సిజన్ థెరపీ, బైపాప్ సపోర్ట్ పరికరాలు కూడా అందుబాటులోకొచ్చాయి. అలాగే ఇంతకు ముందు తాత్కాలికంగా తక్షణ ప్రభావాన్ని కనబరిచే ఇన్‌హేలర్లు మాత్రదే దొరికేవి. కానీ ఇప్పుడు దీర్ఘకాలం పాటు పని చేసే ఇన్‌హేలర్లు దొరుకుతున్నాయి. ఈ ఇన్‌హేలర్‌ను రోజుకు ఒక్కసారి పీల్చినా, దాని ప్రభావం ఎక్కువ సమయం పాటు పని చేయడమే కాకుండా, ఊపిరితిత్తుల సామర్థ్యం కూడా పెరుగుతుంది.

నియంత్రణ ఇలా...

వానాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలకు అడ్డుకట్ట వేయడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- ముందు నుంచి ఊపిరితిత్తుల వ్యాధులున్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జనసమ్మర్థ ప్రదేశాల్లో, కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మాస్క్ ధరించాలి
- చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి
- జలుబు, దగ్గు ఉన్నప్పుడు మాస్క్ పెట్టుకోవడం ద్వారా వ్యాధి ఇతరులకు సోకకుండా నియంత్రించవచ్చు
- ధూమపానం మానేయాలి
- ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రాణాయామం లాంటి శ్వాస వ్యాయామాలు చేయాలి
- రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

డాక్టర్ జి.ఐ.సుస్మిత రెడ్డి
కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు.



అధ్యయనం

రీసైకిల్డ్ ప్లాస్టిక్‌తో ప్రమాదం...

రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌లో ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపించే విష రసాయనాలు ఉన్నాయని తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలివీ...



ప్లాస్టిక్ వాడడం మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ఈ వస్తువుల వాడకం తీవ్రస్థాయికి చేరడంతో ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం కోసం రీసైక్లింగ్ విధానాన్ని వాడుకలోకి తీసుకొచ్చారు. అయితే ప్లాస్టిక్‌లోని 80 రకాల రసాయన సమ్మేళనాలు, విష పదార్థాలు రీసైకిల్ ప్రక్రియలో మరింత విషపూరితంగా మారి ఆ ఉత్పత్తులలోకి చేరతాయనే ఒక అధ్యయనం, జోర్నల్ ఆఫ్ హజార్డస్ మెటీరియల్స్‌లో తాజాగా ప్రచురితమైంది. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు ఆ విష రసాయనాలను నీటిలోకి విడుదల చేస్తున్నాయనీ, ఆ రసాయనాలు ఊబకాయాన్నీ, క్యాన్సర్ల ముప్పునూ పెంచుతాయనీ పరిశోధకులు పేర్కొంటున్నారు. అలాగే హార్మోన్ల స్రావాలను తీవ్రంగా ప్రభావితం చేయడంతో పాటు పిల్లల్లో ఎదుగుదలను నిరోధించడం, శరీరం శక్తిని ఖర్చు చేసే వేగాన్ని దెబ్బ తీయడం, పునరుత్పత్తి వ్యవస్థను నిర్వీర్యం చేయడం లాంటి ముప్పులను పెంచుతాయని పరిశోధకులు కొన్ని ప్రయోగాల ద్వారా కనిపెట్టడం జరిగింది. ఇందుకోసం వారు ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించిన రీసైకిల్డ్ ప్లాస్టిక్ పెల్లెట్స్‌ను 48 గంటల పాటు నీళ్లలో నానబెట్టారు. ఆ తర్వాత జెబ్రాఫిష్ లార్వేను ఐదు రోజుల పాటు ఆ నీళ్లకు బహిర్గతం చేశారు. ఈ ప్రయోగంలో, ఆ లార్వేలోని లిపిడ్ మెటబాలిజం, అంతఃస్రావ గ్రంథుల పనితీరుల్లో అవకతవకలు చోటు చేసుకోవడాన్ని వాళ్లు గమనించడం జరిగింది. కాబట్టి ప్లాస్టిక్, రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ వాడకానికి వీలైనంత దూరంగా ఉండడం ఉత్తమం.

అప్రమత్తం

డెంగుకు గురి కాకుండా...

వానలు ఊపందుకున్నాయి. వాటితో పాటే దోమలు కూడా. మరీ ముఖ్యంగా డెంగు దోమలు ఈ కాలంలో ఉధృతంగా పెరిగిపోతాయి. కాబట్టి వాటి బెడద లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

ఈడిస్ ఈజిప్టై అనే దోమ ప్రధానంగా డెంగూ వైరస్‌ను వ్యాప్తి చేస్తుంది. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్.. విపరీతమైన జ్వరం, భరించలేనంత తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులతో వేధిస్తుంది. కాబట్టి ఈ వైరస్ వ్యాప్తికి తోడ్పడే దోమలు ఇంటి పరిసరాల్లో లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం....

- పూల తొట్లు, వాటి సాసర్లు, పాత టైర్లు, బక్కెట్లు, నీళ్లు నిల్వ ఉండే వీలుండే పాత్రలన్నిటినీ ఖాళీ చేయాలి. అలాగే డ్రెయిన్లు, గట్టర్లలో అవరోధాలు ఏర్పడి, నీరు నిల్వ ఉండిపోకుండా చూసుకోవాలి.
- పొడవు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరిస్తూ, సాధ్యమైనంత మేరకు శరీరాన్ని కప్పి ఉంచే ప్రయత్నం చేయాలి.
- దోమ తెరలు వాడుకోవాలి. కిటికీలు, తలుపులకు స్క్రీన్స్ బిగించుకోవాలి.



- మరీ ముఖ్యంగా దోమలు విజృంభించే సాయంకాలం వేళ తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.
- ప్రతి కుటుంబం వారంలో ఒక రోజు పరిసరాల్లో నీళ్లు నిల్వ ఉండే వీలుండే కంటికి కనిపించని ప్రదేశాల కోసం గాలించే పనికి పూనుకోవాలి.
- కూలర్ల ట్రేలు, రిఫ్రిజిరేటర్ల డ్రిప్ ప్యాన్లలో నీళ్లు లేకుండా చూసుకోవాలి. గార్డెన్, బాల్కనీల్లో వదిలేసిన ఖాళీ సీసాలు, డబ్బాలను తొలగించాలి.



మార్కెట్లోకి టాటా ఏస్ ప్రో

పెట్రోల్, బై-ఫ్యూయల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో లభ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా మోటార్స్ మార్కెట్లోకి సరికొత్త తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సీవీ) టాటా ఏస్ ప్రో తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ పినాకీ హల్దార్ ఈ చిన్న కార్గో ట్రక్‌ను విడుదల చేశారు. ఈ ఎల్‌సీవీ ప్రారంభ ధర రూ.3.99 లక్షలు. పెట్రోల్, బై-ఫ్యూయల్ (సీఎన్‌జీ ప్లస్ పెట్రోల్), ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుందని హల్దార్ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక ఫీచర్లతో ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. 2005లో టాటా ఏస్‌ను కంపెనీ మార్కెట్లోకి తీసుకువచ్చినప్పటి నుంచి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తూ వస్తోందన్నారు. 694 సీసీ ఇంజన్‌తో పెట్రోల్ వేరియంట్‌ను తీసుకురాగా బై-ఫ్యూయల్ వేరియంట్‌ను సీఎన్‌జీ మోడ్ సహా 5 లీటర్ల పెట్రోల్ బ్యాకప్ ట్యాంక్‌తో రూపొందించినట్లు ఆయన చెప్పారు. కాగా 14.4 కిలో వాట్ బ్యాటరీతో కూడిన ఎలక్ట్రిక్ వేరియంట్ ఒకసారి చార్జింగ్‌తో 155 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వేరియంట్ ధర రూ.6.5 లక్షల నుంచి రూ.6.8 లక్షల మధ్యన ఉండగా బై-ఫ్యూయల్ వేరియంట్ ధరలు రూ.4.99 లక్షల నుంచి రూ.5.99 లక్షల మధ్యన ఉన్నాయని హల్దార్ తెలిపారు.

వింటేజ్ కాఫీ రూ.215 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా రూ.215.76 కోట్ల సమీకరణకు బోర్డు సభ్యుల నుంచి ఆమోదం లభించిందని హైదరాబాద్‌కు చెందిన వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ (వీసీబీఎల్) సోమవారం వెల్లడించింది. అయితే, ఈ ఇష్యూకు షేర్ హోల్డర్లతో పాటు ఇతర అనుమతులు ఇంకా రావాల్సి ఉందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించనున్న నిధులను 5,000 ఎంటీపీఏ సామర్థ్యంతో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ ఏర్పాటుకు ఉపయోగించనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా ప్రీమియం కాఫీ విభాగంలో మెరుగైన మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. కాగా, కంపెనీకి చెందిన స్ప్రే డ్రైడ్ అండ్ అగ్లోమెరాటెడ్ కాఫీ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతమున్న 6,500 ఎంటీపీఏ నుంచి 2026 మార్చి చివరికల్లా 11,000 ఎంటీపీఏకు పెరగవచ్చని వీసీబీఎల్ అంచనా వేస్తోంది.

డెరివేటింగ్ ట్రేడింగ్‌లో

91% మందికి నష్టాలే



సెబీ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈక్విటీ డెరివేటివ్ ట్రేడింగ్‌లో దాదాపు 91 శాతం మంది వ్యక్తిగత మదుపరులు నష్టాలే చవిచూశారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ ఇదే జరిగిందని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సోమవారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో వెల్లడించింది. 2023-24లో వ్యక్తిగత మదుపరులు ఈక్విటీ డెరివేటివ్ ట్రేడింగ్‌లో రూ.74,812 కోట్ల వరకు నష్టపోగా.. 2024-25లో నష్టాలు మరో 41 శాతం పెరిగి రూ.1,05,603 కోట్లకు చేరాయని సెబీ తాజా నివేదిక తెలిపింది. అంతేకాదు, 2023-24తో పోలిస్తే, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ నెరిపే వ్యక్తిగత మదుపరుల సంఖ్య కూడా 20 శాతం తగ్గిందని నివేదిక పేర్కొంది. రెండేళ్ల క్రితం మాత్రం ట్రేడర్ల సంఖ్య 24 శాతం పెరిగింది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్ ట్రేడింగ్ నియమావళిని బలోపేతం చేసేందుకు 2024 అక్టోబరు 1న చర్యలు చేపట్టిన అనంతరం సెబీ ఈ అధ్యయనం జరిపింది. అన్ని విభాగాల ఇన్వెస్టర్లను విశ్లేషించిన నియంత్రణ మండలి.. గత ఏడాది డిసెంబరు నుంచి 2025 మే మధ్యలో వ్యక్తిగత మదుపరుల ట్రేడింగ్‌పైన మాత్రం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఆ విశ్లేషణలో దాదాపు 91 శాతం మంది వ్యక్తిగత ఇన్వెస్టర్లు ఈక్విటీ డెరివేటివ్‌ల్లో నష్టపోయారని తేలింది. సమీక్షా కాలంలో ఇండెక్స్ ఆప్షన్స్ టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన ప్రీమియం టర్నోవర్‌లో 9 శాతం, నోషనల్ టర్నోవర్‌లో 29 శాతం తగ్గింది.

రెండేళ్ల క్రితంతో పోలిస్తే మాత్రం ఇండెక్స్ ఆప్షన్స్ లావాదేవీలు మాత్రం ప్రీమియం టర్నోవర్‌లో 14 శాతం, నోషనల్ టర్నోవర్‌లో 42 శాతం పెరిగింది. ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో వ్యక్తిగత మదుపరుల టర్నోవర్ ప్రీమియం టర్నోవర్‌లో 11 శాతం తగ్గిందని సెబీ విశ్లేషణలో వెల్లడైంది. ఒడుదుడుకులున్నప్పటికీ, ఈక్విటీ డెరివేటివ్స్‌లో, ముఖ్యంగా ఇండెక్స్ ఆప్షన్స్‌లో ట్రేడింగ్ భారీగానే జరుగుతోందని సెబీ గుర్తించింది.

డెరివేటివ్ ట్రేడింగ్‌పై మరింత నిఘా

డెరివేటింగ్ ట్రేడింగ్ మార్కెట్‌పై నిఘా పెంచనున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం తెలిపారు. నియంత్రణాధికారాల కంటే మెరుగైన నిఘా, నిబంధనల అమలు ద్వారానే తప్పు చేసినవారిపై చర్యలు చేపట్టగలమన్నారు. నిఘా పెట్టడం వల్లే జేన్ స్ట్రీట్‌పై చర్యలు తీసుకోగలిగామని.. నియంత్రణ మండలితో పాటు ఎక్స్ఛేంజీలు ఈ విభాగ ట్రేడింగ్‌పై నిఘా పెంచనున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, జేన్ స్ట్రీట్ మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల తరహాలో మార్కెట్లో ఇతర రిస్క్‌లేమీ కన్పించడం లేదని పాండే అన్నారు. డెరివేటివ్ ట్రేడింగ్‌లో అక్రమ పద్ధతుల్లో వేల కోట్ల రూపాయలు ఆర్జించిన అమెరికా ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి తమ ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని నియంత్రణ మండలి ఆదేశించింది.

క్యాప్‌జెమినీ గూటికి డబ్ల్యూఎన్ఎస్

డీల్ విలువ రూ.28,380 కోట్లు

ప్యారిస్ (ఫ్రాన్స్): డిజిటల్ బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్ (బీపీఎస్) కంపెనీ డబ్ల్యూఎన్ఎస్‌ను 330 కోట్ల డాలర్లకు (సుమారు రూ.28,380 కోట్లు) కొనుగోలు చేస్తున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ సోమవారం ప్రకటించింది. ఇందుకు ఇరు కంపెనీల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. డబ్ల్యూఎన్ఎస్‌కు చెందిన ఒక్కో షేరుకు క్యాప్‌జెమినీ 76.50 డాలర్లు చెల్లించనుంది. డబ్ల్యూఎన్ఎస్ షేరు గత 90 రోజుల సగటు ట్రేడింగ్ ధరతో పోలిస్తే 28 శాతం అధికమిది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వ్యాపార కార్యకలాపాల్లో క్యాప్‌జెమినీ అగ్రగామిగా ఎదిగేందుకు ఈ డీల్ దోహదపడనుంది. ఎందుకంటే, డబ్ల్యూఎన్ఎస్ ఏజెంటిక్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల ద్వారా బీపీఎస్ సేవలందిస్తోంది. మార్కెట్లో ఏజెంట్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల సేవలకు గిరాకీ శరవేగంగా పెరుగుతోంది. కాగా, అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న క్యాప్‌జెమినీ.. హైదరాబాద్ సహా భారత్‌లోని పలు నగరాల్లో కార్యాలయాలను కలిగి ఉంది. డబ్ల్యూఎన్ఎస్ విషయానికొస్తే, చెన్నైకి చెందిన కేశవ్ ఆర్ మురుగేశ్ లండన్ కేంద్రంగా 1990లో ఈ కంపెనీని ప్రారంభించారు. డబ్ల్యూఎన్ఎస్‌కు భారత్ రెండో కేంద్రంగా ఉంది. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలోనూ కార్యాలయాలను కలిగి ఉంది. ఈ కంపెనీ షేర్లు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో ట్రేడవుతున్నాయి.

జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం



▸▸ బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు నిర్వహణ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఆకాశ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు బేస్ మెయింటెనెన్స్ సేవలను అందించనున్నట్లు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) సేవల సంస్థ జీఎంఆర్ ఏరో టెక్నిక్ వెల్లడించింది. మూడేళ్ల పాటు ఈ సేవలందించేందుకు గాను ఆకాశ ఎయిర్‌తో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ తెలిపింది. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న తమ అత్యాధునిక ఎంఆర్ఓ కేంద్రంలో ఈ సేవలను అందించనున్నట్టు జీఎంఆర్ తెలిపింది. దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థలకు విశ్వసనీయ భాగస్వామిగా పెరుగుతున్న తమ స్థానానికి ఇది దర్పణమని జీఎంఆర్ ఏరోటెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ అన్నారు. తమ సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణా సామర్థ్యం, కస్టమర్ ప్రధాన వైఖరికి ఇది ఒక పరీక్ష అని పేర్కొన్నారు. విమానాల భద్రత, విశ్వసనీయతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని, జీఎంఆర్ ఏరోటెక్నిక్‌తో తమ భాగస్వామ్యం దీన్ని మరింత సుస్థిరం చేస్తుందని ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బెల్సన్ కోటిన్హో అన్నారు. 2022లో ప్రారంభమైన ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 23 దేశీయ, 5 అంతర్జాతీయ గమ్యాలకు సర్వీసులు నడుపుతోంది. లీప్-1బీ ఇంజన్లతో కూడిన 226 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డర్లు జారీ చేసింది.

● మహీంద్రా ఎలక్ట్రిక్.. తన ఎలక్ట్రిక్ వాహన లైన బీఈ6, ఎక్స్‌ఈవీ 9ఈ ప్యాక్ డెలివరీలను ఈ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. 59 కేడబ్ల్యూహెచ్, 79 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఆప్షన్లతో కూడిన ఈ కార్ల ప్రారంభ ధరలు రూ.21.90 లక్షలు, రూ.23.50 లక్షలుగా ఉన్నాయి.

● దక్షిణ భారతదేశంలోని అన్ని డీలర్‌షిప్‌లలో ప్రత్యేక సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ వెల్లడించింది. ఇందులో భాగంగా వినియోగదారులకు ప్రత్యేకమైన సేవలతో పాటు ప్యాకేజీలపై రాయితీలను అందించనుంది.

సూచీలు అక్కడక్కడే..


ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం పరిమిత శ్రేణిలోనే కదలాడినప్పటికీ, ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాటలకు లోనయ్యాయి. సెన్సెక్స్ చివరికి 9.61 పాయింట్ల అతి స్వల్ప లాభంతో 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏమార్పు లేకుండా 25,461.30 వద్ద ముగిసింది. భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన అదనపు సుంకాలు ఈ నెల 9 నుంచి అమలులోకి రానున్నాయి. పైగా, అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాకపోవడంతో మార్కెట్ మదుపరులు కొత్త పెట్టుబడుల విషయంలో వేచి చూసే ధోరణిని కనబరిచారు.

శాట్‌కామ్ సేవల్లోకి అనంత్ టెక్నాలజీస్!

4 టన్నుల జియో ఉపగ్రహ ప్రయోగంపై ఫోకస్

హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్.. శాట్‌కామ్ సేవల్లోకి ప్రవేశించాలని భావిస్తోంది. స్థానికంగా తయారు చేసిన ఉపగ్రహం సహాయంతో ఈ సేవలందించాలని చూస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే దేశీయంగా అభివృద్ధి చేసిన ఉపగ్రహం సాయంతో ఒక దేశీయ కంపెనీ సేవలందించటం ఇదే తొలిసారి అవుతుంది. ఈ సేవలతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, జెఫ్ బెజోస్‌కు చెందిన అమెజాన్ క్విపర్, యూటెల్‌శాట్‌కు చెందిన వన్ వెబ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతో అనంత్ టెక్నాలజీస్ పోటీ పడనుందని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఎండీ పావులూరి సుబ్బారావు ఎకనామిక్ టైమ్స్ పత్రికకు తెలిపారు. తమ కంపెనీ ఇప్పటికే అంతరిక్ష పరిజ్ఞానంలో ప్రభుత్వంతో కలిసి పని చేస్తోందన్నారు. 2028 నాటికి అంతరిక్షం నుంచి బ్రాడ్‌బ్యాండ్ సేవలందించేందుకు ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) నుంచి ఈ కంపెనీ ఇప్పటికే అనుమతి సాధించింది. అలాగే నాలుగు టన్నుల బరువు గల జియో స్టేషనరీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించే యోచనలో ఉంది. ఈ ప్రాజెక్టుపై కంపెనీ రూ.3,000 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ జియో కమ్యూనికేషన్ ఉపగ్రహం వినియోగదారులకు 100 గిగాబైట్ల సామర్థ్యాన్ని అందించగలుగుతుంది. అలాగే కంపెనీ ఉపగ్రహ ఆపరేటర్‌గా కూడా వ్యవహరిస్తున్నందు వల్ల డిమాండ్ ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని ఉపగ్రహాలను ప్రయోగించవచ్చు. ఇప్పటివరకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాత్రమే ఉపగ్రహాలు నిర్మించి, ప్రయోగించి, ఆపరేట్ చేయగలుగుతోంది. అంతరిక్ష సంస్కరణల్లో భాగంగా ఈ రంగంలోకి ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం ప్రవేశం కల్పించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,290 ▼	90,100 ▼	1,20,000 ▼
విజయవాడ	99,600 ▼	93,500 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	99,770 ▲	90,100 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,290 ▼	90,100 ▼	1,10,300 ▼
ప్రొద్దుటూరు	96,900 ▼	89,150 ▼	1,08,500 ▲
ముంబై	96,596 ▼	88,482 ▼	1,06,531 ▼

కష్టాల కడలిని దాటి..

'ఆకాశ'మే హద్దుగా ఎదిగి



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఎడ్జ్‌బాస్టన్‌లో టెస్టు విజయం కోసం భారత జట్టు దశాబ్దాలపాటు ఎదురుచూసింది. అయితే బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పది వికెట్లు పతనం చేయడం ద్వారా ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన పేసర్ ఆకాశ్ దీప్ ఈ గెలుపు సంబరాలకు ప్రధాన కారకుల్లో ఒకడు. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో తుది జట్టులోకి వచ్చిన ఆకాశ్ చిరస్మరణీయ ప్రదర్శనతో అబ్బురపర్చాడు. బర్మింగ్‌హామ్ టెస్టుకు ముందు అతడు 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. దీంతో ఆకాశ్‌కు బదులు అర్ష్‌దీప్‌కు చాన్స్ ఇవ్వాలన్న చర్చలు కూడా జరిగాయి. అయితే కోచ్, కెప్టెన్.. ఆకాశ్‌పై నమ్మకముంచి తుదిజట్టులో చోటు కల్పించారు. ఆ ఇద్దరి నమ్మకాన్ని నిలబెడుతూ ఆకాశ్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయితే బిహార్ నుంచి బర్మింగ్‌హామ్ వరకు ఎదిగిన ఆకాశ్ విజయం వెనుక ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు, సవాళ్లున్నాయి.

సీక్రెట్‌గా క్రికెట్ ఆడేస్తూ..

బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా దెహ్రి గ్రామంలో జన్మించిన ఆకాశ్ కుటుంబానికి క్రీడా నేపథ్యం లేదు. వాస్తవానికి ఈ రాష్ట్రంలో క్రికెట్‌కు పెద్దగా ఆదరణ కనిపించదు. ఇక బ్యాట్, బంతి పడితే భవిష్యత్ ఉండదని టీచర్‌గా పనిచేసిన ఆకాశ్ తండ్రి కూడా అతడిని ప్రోత్సహించలేదు. కొడుకు బాగా చదువుకుని ఉద్యోగం చేస్తే చాలనుకున్నాడు. ఆ గ్రామంలో బాలురు క్రికెట్ ఆడితే పెద్ద తప్పుగా పరిగణిస్తుంటారు. మిగతా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఆకాశ్‌తో కలవనిచ్చేవారు కాదట. అతడు క్రికెట్ ఆడడం తప్ప ఏమీ చేయడని, మీ చదువులు కూడా పాడవుతాయని హెచ్చరించేవారు. అందుకే ఆకాశ్ ఎవరికంటా పడకుండా క్రికెట్ ఆడాల్సి వచ్చేది.

బిహార్‌లో ఉంటే ఎదగలేమనుకున్న ఆకాశ్ బెంగాల్‌లోని దుర్గాపూర్‌కు మకాం మార్చాడు. అప్పటిదాకా బ్యాటర్‌గా ఉన్న అతను పేసర్‌గా శిక్షణ తీసుకుంటూ స్థానిక క్లబ్‌లకు ఆడాడు. కెరీర్ గాడిలో పడుతున్న దశలో ఆకాశ్ జీవితంలో ఊహించని విషాదాలు చోటు చేసుకున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే ఆకాశ్ తండ్రి, సోదరుడు అనారోగ్యంతో మరణించారు. దాంతో కుటుంబ బాధ్యతల కోసం అతను స్వస్థలానికి తిరిగిరాక తప్పలేదు. క్రికెట్‌వైపు మనసు లాగుతున్నా, కుటుంబ పరిస్థితుల రీత్యా అతను మూడేళ్ల ఆటకు దూరం కావాల్సి వచ్చింది. ఈ దశలో ఆకాశ్ పడిన వేదన అంతాఇంతా కాదు. ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత కోల్‌కతా వెళ్లి అరుణ్ లాల్ శిక్షణలో రాటుదేలి బెంగాల్ జట్టులో చేరాడు. 2019లో రంజీల్లో అరంగేట్రం చేసి 35 వికెట్లు తీశాడు. జట్టును రన్నరప్‌గా నిలిపాడు. ఇక తమ నెట్ బౌలర్‌గా ఉన్న ఆకాశ్ ప్రతిభను గమనించి ఆర్‌సీబీ 2021 ఐపీఎల్ వేలంలో రూ. 20 లక్షలకు తీసుకుంది. అప్పటి నుంచి 2024 వరకు ఆ జట్టుకే ఆడిన అతను వెనుదిరిగి చూడలేదు. అందుకే ఈ ఏడాది వేలంలో లఖ్‌నవూ జట్టు ఆకాశ్‌పై రూ. 8 కోట్లు వెచ్చించింది. చక్కటి ప్రదర్శనతో సెలెక్టర్లను ఆకట్టుకున్న ఆకాశ్ గతేడాది ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యాడు. రాంచీలో జరిగిన నాలుగో టెస్టుతో అరంగేట్రం చేసి 3 వికెట్లతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం కెరీర్‌లో 8 టెస్టులు ఆడిన ఆకాశ్ పరిమిత ఓవర్లలో ఇంకా ప్రాతినిధ్యం వహించలేదు. అయితే బుమ్రాపై పనిఒత్తిడి భారం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆకాశ్ ముందు ఇదే రీతిన చెలరేగితే భారత పేస్ దళం మరింత బలపడినట్టే.

ఆరు నెలల వ్యవధిలో తండ్రి, సోదరుడిని కోల్పోయి..

నా గురించి ఆందోళన వద్దు..

ఆకాశ్‌దీప్ సోదరి జ్యోతి



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో ఆకాశ్ దీప్ పది వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తన ప్రదర్శనను.. కేన్సర్‌తో బాధపడుతున్న సోదరికి అంకితం ఇస్తున్నట్టు మ్యాచ్ అనంతరం ఆకాశ్ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందుకు అతడి సోదరి జ్యోతి స్పందిస్తూ.. 'నా సోదరుడి ప్రదర్శనకు గర్విస్తున్నా. ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లే ముందు ఆకాశ్‌ను ఎయిర్‌పోర్టులో కలిశా. నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందవద్దని, దేశం కోసం ఆడాలని సూచించా. ప్రస్తుతం నాకు కేన్సర్ మూడో దశలో ఉంది. మరో ఆరు నెలలు చికిత్స తీసుకున్నాక పరిస్థితి ఏమిటనేది చెబుతామని డాక్టర్లు తెలిపారు' అని వివరించింది. అయితే తనకు కేన్సర్ ఉందంటూ ఆకాశ్ వెల్లడించిన విషయం తనకు తెలియదని ఆమె పేర్కొంది.

ఐసీసీ సీఈఓగా సంజోగ్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీఈఓగా సంజోగ్ గుప్తా నియమితుడయ్యాడు. సంజోగ్ పేరును ఐసీసీ చైర్మన్ జైషా సోమవారం అధికారికంగా ప్రకటించాడు. ప్రస్తుతం సంజోగ్ జియోస్టార్‌లో స్పోర్ట్స్ అండ్ లైవ్ ఎక్స్‌పీరియన్స్ విభాగానికి సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. 2010లో స్టార్ ఇండియాలో జర్నలిస్టుగా చేరిన సంజోగ్ అంచెలంచెలుగా ఎదిగాడు. కొత్త క్రికెట్ వ్యూహాలను రూపకల్పన చేయడంలో, క్రీడా సంబంధిత వ్యాపార రంగంలో సంజోగ్‌కు అపార అనుభవముందని జైషా తెలిపాడు. ఇక, ఈ పోస్టుకు 25 దేశాల నుంచి 2,500 దరఖాస్తులు రాగా, వడపోత అనంతరం 12 మందితో తుది జాబితాను తయారు చేసి, వారి నుంచి సంజోగ్‌ను ఎంపిక చేశామన్నాడు.

400 వద్దనుకున్నాడు

ముల్డర్ @367*

లారా రికార్డుకు 33 పరుగుల దూరంలో ఇన్నింగ్స్ డిక్లేర్



2 టెస్టుల్లో రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా ముల్డర్. 297 బంతుల్లో ముల్డర్ మూడొందల మార్క్‌ను అందుకొన్నాడు. 2008లో చెన్నైలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సెహ్వాగ్ 278 బంతుల్లోనే త్రిశతకం బాదాడు.

బులవాయో: టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా (400 నాటౌట్) అరుదైన రికార్డును అధిగమించాలనేది ప్రతి క్రికెటర్ చిరకాల స్వప్నం. కానీ, ఆ రికార్డుకు కేవలం 33 పరుగుల దూరంలోనే ఉన్నా వద్దనుకున్నాడు. దక్షిణాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్స్‌లతో 367 నాటౌట్) చరిత్ర సృష్టించే అరుదైన అవకాశాన్ని కాదనుకుని నిస్వార్థంగా ఆలోచించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో ఆటకు రెండో రోజు నిన్నటి స్కోరు 465/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 626/5 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ ముల్డర్ త్రిశతకం పూర్తి చేసుకోవడంతోపాటు జోరు మీదున్నాడు. ఈ క్రమంలో లారా క్వాడ్రపుల్ సెంచరీ రికార్డును బద్దలుకొడతాని అందరూ భావించారు. కానీ, 33 పరుగుల దూరంలో ఉండగా దక్షిణాఫ్రికా అనూహ్యంగా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే, సౌతాఫ్రికా తరపున అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా హషీమ్ ఆమ్లా (311)ను ముల్డర్ వెనక్కినెట్టాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కే కుప్పకూలిన జింబాబ్వే ఫాలో ఆన్‌లో పడింది. సీన్ విలియమ్స్ (83 నాటౌట్)కు సహకారం అందలేదు. స్పిన్నర్ ప్రెనెలన్ సుబ్రయన్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 456 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే సోమవారం ఆట ఆఖరికి 51/1 స్కోరు చేసింది.

టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు

లారా	400*	2004లో ఇంగ్లండ్‌పై
హేడెన్	380	2003లో జింబాబ్వేపై
లారా	375	1994లో ఇంగ్లండ్‌పై
జయవర్దనె	374	2006లో సౌతాఫ్రికాపై
ముల్డర్	367*	2025లో జింబాబ్వేపై



లారా

జొకో 16వ సారి..

క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశం ● వింబుల్డన్

లండన్: ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 1-6, 6-4, 6-4, 6-4తో 11వ సీడ్ అలెక్స్ డిమినార్‌పై గెలిచాడు. ఈ వేదికపై జొకో క్వార్టర్స్ చేరడం ఇది 16వసారి. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో 22వ సీడ్ కొబోలీ 6-4, 6-4, 6-7 (7), 7-6 (2)తో సిలిచ్‌కు చెక్ పెట్టాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అల్కారజ్ 6-7 (7), 6-3, 6-4, 6-4తో 14వ సీడ్ రుబ్లేవ్‌పై పోరాడి గెలిచాడు. మరో మ్యాచ్‌లో నోరీ 6-3, 7-6 (4), 6-7 (9), 6-7 (7), 6-3తో జారీని చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్ 7-6 (4), 6-4తో 18వ సీడ్ అలెగ్జాండ్రోవాకు షాకిచ్చి క్వార్టర్స్‌కు చేరింది. ఇతర రౌండ్-16 మ్యాచ్‌ల్లో 13వ సీడ్ అనిసిమోవా 6-2, 5-7, 6-4తో 30వ సీడ్ ఎన్‌సోకోవాపై, 19వ సీడ్ సంసనోవా 7-5, 7-5తో బౌజాస్‌పై విజయంతో ముందంజ వేశారు.

ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రీ జోడీ ఓటమి: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ జోరుకు ప్రీక్వార్టర్స్‌లో బ్రేక్ పడింది. రౌండ్-16 పోరులో స్పెయిన్, అర్జెంటీనా జంట గ్రానోలెర్స్/జెబలోస్ 6-4, 3-6, 7-6 (4)తో భాంబ్రీ ద్వయంపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్-16 మ్యాచ్‌లో భాంబ్రీ/జియాంగ్ (చైనా) జంట 6-7 (8), 3-6తో మార్సెలో (ఎల్‌సాల్వెడార్)/జాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

సిరీస్ ఆసీస్ వశం

రెండో టెస్టులోనూ విండీస్ ఓటమి

సెయింట్ జార్జ్ (గ్రెనడా): వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా 133 పరుగులతో గెలిచింది. దీంతో 3 టెస్టుల సిరీస్‌ను ఆసీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సొంతం చేసుకొంది. ఆసీస్ నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 143 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ రోస్టన్ చేజ్ (34) టాప్ స్కోరర్. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌటైంది. స్మిత్ (71), గ్రీన్ (52) రాణించారు. షమర్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 286, విండీస్ 253 రన్స్ చేశాయి.

ఆసియా వెయిట్ లిఫ్టింగ్‌లో భవానికి పసిడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ యువ లిఫ్టర్ రెడ్డి భవాని స్వర్ణ పతకం కొల్లగొట్టింది. కజకిస్థాన్‌లోని అస్తానాలో జరుగుతున్న ఈ పోటీల్లో 48 కిలోల విభాగంలో భవాని మొత్తంగా 159 కిలోల బరువెత్తి విజేతగా నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలు, స్నాచ్‌లో 69 కిలోల బరువెత్తి వీటిలో కూడా వ్యక్తిగత స్వర్ణాలు సాధించింది. విజయనగరం జిల్లాలోని కొండకరకం గ్రామం భవాని స్వస్థలం.

ఆఖరి వన్డే చేజారింది..

యువ భారత్‌పై ఇంగ్లండ్ గెలుపు

వర్సెస్టర్: భారత్ అండర్-19 జట్టుతో సోమవారం జరిగిన ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ ఏడు వికెట్లతో గెలుపొందింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే సొంతం చేసుకోగా..ఆధిక్యాన్ని 2-3కి ఆతిథ్య జట్టు తగ్గించింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 210/9 స్కోరుకే పరిమితమైంది. అంబరీష్ (66) అర్ధ శతకం చేయగా, వైభవ్ సూర్యవంశీ (33) మోస్తరుగా రాణించాడు. అలెక్స్ రాల్ఫీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ అండర్-19 31.1 ఓవర్లలో 211/3 స్కోరు చేసి నెగ్గింది. బెన్ మాయెస్ (82 నాటౌట్), డాకిన్స్ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. నమన్ పుష్కక్ రెండు వికెట్లు తీశాడు.

దండకారణ్యంలో హైటెన్షన్

- 25 వేల మంది బలగాలతో ముట్టడి
- గణపతిని చుట్టుముట్టిన బలగాలు?
- పీఎల్‌జీ కమాండర్ హిడ్మా కూడా అక్కడే??
- బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి
- పౌరహక్కుల సంఘం డిమాండ్
- కాల్పుల విరమణకు ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి

చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ దండకారణ్యంలోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌పై పోలీసు బలగాలు పట్టు సాధించాయా? వచ్చే ఏడాది మార్చికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని ప్రతినబూనిన కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో 25 వేల బలగాలను మోహరించిందా? మావోయిస్టు పార్టీ అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి గణపతితోపాటు.. గెరిల్లా రణతంత్రంలో ఆరితేరిన పీఎల్‌జీ ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వీ హిడ్మా, మరో అగ్రనేత దేవాను బలగాలు చుట్టుముట్టాయా? ఈ ప్రశ్నలకు అటు ఛత్తీస్‌గఢ్ పోలీసుల హెచ్చరికలు.. ఇటు పౌర హక్కుల నేతల ఆందోళనలు పరోక్షంగా ఔననే సమాధానం చెబుతున్నాయి. గణపతి, హిడ్మా లక్ష్యంగా భారీ ఆపరేషన్ జరుగుతున్నట్లు ఆరోపిస్తున్నాయి.

కర్రెగుట్టలతో మొదలు...

కేంద్ర బలగాలు ఈ ఏడాది మార్చి నుంచే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. అప్పట్లో 25 వేల మంది కేంద్ర బలగాలు కర్రెగుట్టల చుట్టూ మోహరించాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో.. ఇక్కడి కేంద్ర బలగాలను సరిహద్దులకు తరలించారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ పోలీసులు, లొంగిపోయిన నక్సల్స్‌తో ఏర్పాటు చేసిన డీఆర్జీ బలగాలు మాత్రమే కూంబింగ్ కొనసాగించాయి. గత నెల ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో అతిపెద్ద ఆపరేషన్‌ను నిర్వహించి, కేంద్ర బలగాల సహకారం లేకుండానే 17 మంది మావోయిస్టులను హతమార్చాయి. ఇప్పుడు... మరోసారి 25 వేలమంది కేంద్ర బలగాలు ఇంద్రావతి నేషనల్ పార్క్‌ను చుట్టుముట్టాయని పౌరహక్కుల నేతలు పేర్కొంటున్నారు.

ఆపరేషన్‌ను ఆపాలి: గడ్డం లక్ష్మణ్

నేషనల్ పార్క్ ఆపరేషన్‌ను వెంటనే ఆపేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ రావు డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలను బలగాలు చుట్టుముట్టాయనే సమాచారం అందుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "ఇప్పటికే ఆపరేషన్ కగార్ పేరుతో 560 మందిని ఎన్‌కౌంటర్ చేసి, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు. సజీవంగా పట్టుకున్న మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలి. వారికి ఎలాంటి హాని తలపెట్టరాదు. హిడ్మా, దేవాను లక్ష్యంగా చేసుకుని, అడవిని చుట్టముట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

గణపతి ఉన్నాడా?: ప్రొఫెసర్ హరగోపాల్

నేషనల్ పార్క్‌ను పోలీసులు చుట్టుముట్టారని, అక్కడ గణపతి, హిడ్మా వంటి అగ్రనేతలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మావోయిస్టులను లొంగిపోవాలని, లేదంటే చావుకు సిద్ధం కావాలని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి హెచ్చరికలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజాస్వామికవాదులు, హక్కుల సంఘాలు, వామపక్ష పార్టీలు, మేధావులు తక్షణమే ఈ మారణ హోమాన్ని ఆపాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులకు అవకాశం!

- నిఘా వర్గాల నుంచి పోలీసులకు సమాచారం
- సంస్థ కార్యాలయాల ముందు భద్రత ఏర్పాటు



హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై బీఆర్‌ఎస్ వర్గాలు దాడిచేసే అవకాశముందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో రాష్ట్ర పోలీసు విభాగం అప్రమత్తమైంది. హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఆంధ్రజ్యోతి కార్యాలయాల ముందు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి నిఘా వర్గాలకు దాడి అవకాశాలపై సమాచారం వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి నుంచే సంస్థ కార్యాలయాల వద్ద రక్షణ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్గాల వైఖరిపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా ఇంకా బుద్ధి రాలేదని వ్యాఖ్యానించారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు తమను నమ్మకపోవడంతో అత్త మీద కోపం దుత్త మీద తీసినట్లు మీడియా సంస్థలపై దాడులకు తెగబడుతున్నారని వ్యాఖ్యానించారు. తక్షణమే మీడియా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్చరించారు. మీడియా సంస్థలు ఏదైనా తప్పుగా రాస్తే చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే మీడియాకు బీజేపీ రక్షణ కవచంగా నిలబడుతుందని ప్రకటించారు. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు అండగా నిలవాలని బీజేపీ యువ మోర్చా నేతలకు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేస్తే టీ న్యూస్ అంతు చూస్తామని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు, మోదీ అభిమానులు తలచుకుంటే అడుగు కూడా బయట పెట్టలేరన్నారు. జగిత్యాల జిల్లాలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా బీఆర్‌ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడి చేస్తే బీఆర్‌ఎస్‌కు చుక్కలు చూపిస్తామని అన్నారు. "మీరు తలచుకుంటే పది ఇరవై మంది వస్తారు. యువ మోర్చా కార్యకర్తలు వందల మంది ఉన్నారు. మీ గుండాయిజం తెలంగాణలో నడవనివ్వం" అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నయనతార డాక్యుమెంటరీపై మరో కేసు



సినీ నటి నయనతార డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. విఘ్నేష్ శివన్-నయనతారల వివాహ డాక్యుమెంటరీ గత ఏడాది నవంబరులో 'నెట్‌ఫ్లిక్స్'లో విడుదలైన విషయం తెలిసిందే. తొలుత ఈ డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదల సమయంలో, అందులో 'నానుం రౌడీ దాన్' చిత్రంలోని మూడు నిమిషాల షూటింగ్ ఫుటేజీ ఉంది. ఈ వ్యవహారంపై నటుడు ధనుష్‌కు చెందిన వండర్ బార్స్ సంస్థ రూ.10 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేసు వేసింది. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉంది. తాజాగా డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని దృశ్యాలు డాక్యుమెంటరీలో అనుమతి లేకుండా వినియోగించారని, అందుకు రూ.5 కోట్లు నష్టపరిహారం చెల్లించాలంటూ కాపీ రైట్స్ కలిగిన ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు..రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని డాక్యుమెంటరీ రూపొందించిన డార్క్ స్టూడియో, నెట్‌ఫ్లిక్స్ సంస్థలను ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

'సత్యభామ' అందర్నీ అలరిస్తుంది

\- మాళవిక మనోజ్



హీరో సుహాస్ తాజాగా నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మించారు. ఈ చిత్రంతో మాళవిక మనోజ్(జో ఫేమ్) తెలుగులో కథానాయికగా పరిచయం అవుతున్నారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మాళవిక పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర ఎంతో ఆధునికంగా ఉంటుంది. సత్యభామ అనే పాత్రలో కనిపిస్తాను. అందర్నీ అలరించే పాత్ర నాది. నా రియల్ లైఫ్‌కు ఎలాంటి పోలిక లేని పాత్ర సత్యభామ. తెలుగులో నటించడం చాలా సంతోషంగా ఉంది. నాకెప్పుడూ వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించాలని ఉంటుంది. సాధారణంగా అన్ని సినిమాల్లో ఉండే ప్రేమ సన్నివేశాలు ఈ సినిమాలోనూ ఉన్నాయి. అయితే ఇందులోని సన్నివేశాల్లో కొత్త అనుభూతి ఉంటుంది. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు. అన్ని పాటలు నా మనసుకు హత్తుకున్నాయి. గ్లామరస్ రోల్స్ చేయాలా? వద్దా? అనే నిబంధన పెట్టుకోలేదు. ఇప్పటి వరకూ కథ నచ్చి, సౌకర్యంగా అనిపించిన పాత్రలు మాత్రమే చేశాను. నాకు నచ్చని క్యారెక్టర్స్‌ని నేను చేయను' అని అన్నారు.

బాక్సాఫీస్‌కు తుపాను



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ నెల 31న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఓ యాక్షన్ ప్రోమో విడుదల చేసి "ఇది కేవలం సినిమా కాదు. మేము ప్రేమతో నిర్మించిన గొప్ప ప్రపంచం. త్వరలోనే బాక్సాఫీస్ తుపానుకు ఈ చిత్రం నాంది పలుకుతుంది" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: జోమోన్.టి.జాన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

'కాంతార' ప్రీక్వెల్ సిద్ధం



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'కాంతారా చాప్టర్-1'. గతంలో వచ్చిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా వస్తోంది. సోమవారం రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా పోస్టర్‌ని విడుదల చేసింది. 'ఇతిహాసాలు పుట్టిన చోట గర్జనలు ప్రతిధ్వనిస్తాయి. 'కాంతార'తో లక్షలాది మందిని కదిలించిన కళాఖండానికి ప్రీక్వెల్‌గా ఇది రానుంది. ఈ గొప్ప చిత్రం వెనుక ఉన్న మార్గదర్శక శక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు. అక్టోబరు 2న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పురాణానికి నాంది. హృదయాన్ని కదిలించే కథకు తిరిగి మరోసారి స్వాగతం' అంటూ చిత్రబృందం పోస్టర్ కింద రాసుకొచ్చింది.

పల్లెటూరి మొనగాడు



హీరో రవితేజ సోదరుని కుమారుడు మాధవ్ 'మారెమ్మ' అనే సినిమాతో కథానాయకునిగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో మోక్ష ఆర్ట్స్ బేనర్‌పై మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ని చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పోస్టర్‌లో మాధవ్ గళ్ల చొక్కా, లుంగీ ధరించి, మెడలో టవల్‌తో ఓ పల్లెటూరి హీరోగా కనిపిస్తున్నారు. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న గేదె అతని బలం, ఆధిపత్యాన్ని సూచిస్తోంది. మాధవ్ పొడవాటి కర్రను పట్టుకొని ఏదైనా సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపించారు. కాగా, సినిమాను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు.

రెగ్యులర్ షూటింగ్ షురూ!



విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించారు మేకర్స్. విజయ్ సేతుపతి, సంయుక్తతో పాటు ప్రధాన పాత్రధారులు ఇందులో పాల్గొంటున్నారు. ఇందుకోసం ఓ భారీ సెట్‌ను నిర్మించి సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరిజగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది.

ఫాంటసీ వినోదం



కార్తిక్‌రాజు, నోయల్, మిస్తీ చక్రవర్తి హీరో హీరోయిన్లుగా రూపుదిద్దుకున్న చిత్రం 'దీర్ఘాయుష్మాన్ భవ' పూర్ణానంద్ దర్శకత్వంలో వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. ఈ నెల 11న నట్టీస్ ఎంటర్టైన్‌మెంట్స్ సంస్థ తరపున నిర్మాత నట్టి కుమార్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దామోదర ప్రసాద్, ప్రోమోస్ ను నటుడు ఓ కల్యాణ్, పాటలను జబర్ధస్త్ ఆర్.పి ఆవిష్కరించారు. అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమా ఇదనీ, ప్రేక్షకులు ఆదరించాలనీ కోరారు. దర్శకుడు పూర్ణానంద్ మాట్లాడుతూ 'ఫ్యామిలీ ప్యాక్ చిత్రమిది. అందరినీ ఆహ్లాద పరిచే కామెడీ ఉంది. సోషియో ఫాంటసీ చిత్రంగా మలిచాం' అన్నారు. నిర్మాత నట్టి కుమార్ మాట్లాడుతూ 'చిన్న సినిమాల సమస్యలను తీర్చేందుకు పరిశ్రమతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పూనుకోవాలి. చిన్న సినిమాకు రెండున్నర గంటల షోను కేటాయించాలి. మల్టీప్లెక్స్‌లో పేదవాడు కూడా చూసే విధంగా ఆక్యుపెన్సీలో 20 శాతం టికెట్ రేట్లను 75 రూపాయలుగా నిర్ణయించాలి' అని కోరారు.

బై లా ప్రకారమే ఎన్నికలు జరగాలి

- మెమొరాండం సమర్పించిన నిర్మాతలు



"తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎన్నుకున్న ప్రస్తుత కమిటీ గడువు ఈ నెలలోనే ముగియనుంది. వెంటనే ఎలక్షన్లు జరగడానికి వీల్లేకుండా ప్రస్తుత అసోసియేషన్‌లోని కొందరు సభ్యులు ఎన్నికలను వాయిదాకు ప్రయత్నిస్తున్నారు" అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఫిల్మ్ ఛాంబర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్, బసిరెడ్డి ఆధ్వర్యంలో ఓ సమావేశం నిర్వహించారు. బై లా ప్రకారమే ఎన్నికలు జరగాలని నాలుగు సెక్టార్స్‌కు చెందిన 60 మంది నిర్మాతలు మెమొరాండం సమర్పించారు.

అందుకే వాయిదా: దామోదర ప్రసాద్

ఈ విషయంపై ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ వివరణనిచ్చారు. "సాధారణంగా ఈ నెలాఖరుకు ఎన్నికలు జరగాలి. అయితే ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అలాగే కొన్ని పనులు మధ్యలోనే ఉన్నాయి. అందుకే ఈసీ మీటింగ్‌లో మరో ఏడాది పాటు గడువును పొడిగించాలని కోరాను. ఈసీ మీటింగ్ పెట్టినప్పుడు అందరూ రావాలి. వారి అభిప్రాయాలు చెప్పాలి' అని పేర్కొన్నారు.



రాముడి పారితోషికం ఎంత?

రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం ఫస్ట్ లుక్ ఇటీవల విడుదలై అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇందులో వీఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉండబోతుందని ఈ సినిమా గ్లింప్స్ చూడగానే అందరికీ అర్థమైంది. మరో విషయం ఏమిటంటే రూ. 1600 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ చిత్రం ఇది. ఈ సినిమాలో రాముడిగా నటిస్తున్న రణబీర్ కపూర్ పారితోషికం ఎంతో తెలుసా?.. రూ .150 కోట్లు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న 'రామాయణ' కోసం ఆయన అడిగిన పారితోషికం ఇచ్చి వర్క్ చేయించుకుంటున్నారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఇక సీతగా నటిస్తున్న సాయిపల్లవికి రెండు భాగాలకు కలిపి రూ. 12 కోట్లు ఇస్తున్నారు. రావణుడిగా నటిస్తున్న యశ్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి కనుక ఖర్చులకు తప్ప పారితోషికంగా ఏమీ తీసుకోవడం లేదు.

అప్పుడు రాముడు.. ఇప్పుడు దశరథుడు

రామానంద సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో అరుణ్ గోవిల్ శ్రీరాముడిగా, దీపిక సీతగా నటించి కోట్లాది మంది హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారు. 1987లో ఆ సీరియల్ వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'రామాయణ' చిత్రంలోనూ అరుణ్ గోవిల్ నటిస్తున్నారు. ఈసారి ఆయన దశరథుడి పాత్ర చేస్తుండడం గమనార్హం.

యధార్థ కథ ఆధారంగా..



దర్శకుడు బాలాజీ ముత్యాల దర్శకత్వంలో పృథ్వీరాజు, గోలీసోడా మధు ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ సోల్జర్'. 'ఫ్రమ్ మిలిటరీ మాధవరం' అనేది ఉపశీర్షిక. వీఆర్ఎమ్ పట్నాయక్, యూఎస్ఎన్ పట్నాయక్ నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో చిత్రం విడుదలవుతోందని మేకర్స్ తెలిపారు. ఓ యధార్థ కథ ఆధారంగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.

స్టీల్‌ప్లాంటులో బొగ్గు బుగ్గి!

బాయిలర్ కోల్ యార్డులో ఐదు రోజులుగా మంటలు.. సిబ్బంది తొలగింపుతో పర్యవేక్షణ లోపం.. పట్టించుకోని యాజమాన్యం



విశాఖ స్టీల్ ప్లాంటు బాయిలర్ కోల్ యార్డులో కాలిపోతున్న బొగ్గు

విశాఖపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని బాయిలర్ కోల్ యార్డులో గత ఐదు రోజులుగా బొగ్గు కాలిపోతోంది. అయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. స్టీల్‌ప్లాంటులో థర్మల్ విద్యుత్ కేంద్రం నడపడానికి ఈ బాయిలర్ కోల్‌ను వినియోగిస్తారు. ఇది అత్యధిక కెలోరిఫిక్ విలువ కలిగినది. అంటే దీన్ని మండిస్తే అత్యధిక వేడిని విడుదల చేస్తుంది. బూడిద శాతం తక్కువగా ఉంటుంది. ఎండలో వదిలేస్తే అధిక ఉష్ణోగ్రతకు దానంతట అదే మండుతుంది. అందుకే దీనిని నిల్వ చేసే రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో ప్రత్యేకంగా పర్యవేక్షించడానికి కాంట్రాక్టు కార్మికులు ఉంటారు. వారు నిత్యం ఈ బొగ్గుపై నీటిని చిమ్ముతుంటారు. దానివల్ల ఎండలకు మండకుండా ఉంటుంది. అయితే యాజమాన్యం నిర్వహణ వ్యయం తగ్గించేందుకు ఇటీవల దాదాపు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది. దాంతో యార్డుల్లో ఏమి జరిగినా చర్యలు చేపట్టేవారు కరవయ్యారు. వాస్తవానికి ఈ విలువైన బొగ్గును ఇలా ఆరుబయట వదిలేయకుండా షెడ్లు నిర్మించి, వాటిలో నిల్వ చేయాల్సి ఉంది. దానికి అనవసర వ్యయం ఎందుకంటూ బయట వదిలేస్తున్నారు. ఏ చిన్న తప్పు జరిగినా సంబంధిత ఉద్యోగులపై చర్యలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇప్పుడు దీనికి ఏమి సమాధానం చెబుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మంటలు పెద్దవి కాకముందే తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగినంత మంది సిబ్బందిని నియమించాలని కోరుతున్నాయి.

సచివాలయంలోకి స్మార్ట్ ఎంట్రీ



వెలగపూడి సచివాలయంలో భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న స్కానర్లను పరిశీలిస్తున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి మల్లికార్జునరావు

- ఉద్యోగులు, జర్నలిస్టులకు స్మార్ట్ కార్డులు
- సందర్శకులకు క్యూఆర్ కోడ్‌తో స్లిప్పులు
- వాహనాలకు ఫాస్ట్‌ట్యాగ్ తరహా స్టిక్కర్లు
- భద్రతకు ఆధునిక టెక్నాలజీ వినియోగం
- చకచకా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సెక్యూరిటీ లోపాలకు చెక్.. భద్రత కట్టుదిట్టం

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పరిపాలనకు గుండె కాయలాంటి సచివాలయం భద్రత విషయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనుమతి లేకుండా ఎవరుపడితే వాళ్లు లోపలికి ప్రవేశించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టింది. సెక్యూరిటీ లోపాలకు చెక్ పెట్టేందుకు వీలుగా.. స్మార్ట్ కార్డులు, క్యూఆర్ కోడ్ స్లిప్‌లు, స్టిక్కర్ల ద్వారా ఉద్యోగులు, సందర్శకులతోపాటు వాహనాలను లోపలికి అనుమతించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి సచివాలయ ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ రూంలో సంబంధిత పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ప్రభుత్వం ఇచ్చిన ఐడీ కార్డులు గేటువద్ద భద్రతా సిబ్బందికి చూపించి లోపలకు ప్రవేశించే వారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం అందించే మ్యాగ్నెటిక్ స్ట్రిప్‌లతో కూడిన స్మార్ట్ కార్డులు చూపించే లోపలికి, బయటకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ స్మార్ట్ కార్డును స్కాన్ చేయగానే బ్యారియర్లు ఆటోమేటిక్‌గా తెరుచుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఎవరు ఎప్పుడు లోపలికి ప్రవేశించింది, ఎప్పుడు బయటకు వెళ్లింది.. అనే వివరాలు స్పష్టంగా రికార్డవుతాయి.

బెంగళూరు కంపెనీకి పనులు..

సచివాలయ సిబ్బంది లోపలికి ప్రవేశించేటప్పుడు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వారిని గుర్తించాక, స్మార్ట్ కార్డును స్కాన్ చేయడం ద్వారా లోపలికి ఎంట్రీ అయ్యేలా ప్రోగ్రాం సెట్ చేస్తున్నారు. ఈ పనులను బెంగుళూరుకు చెందిన సత్యోలాజీ సంస్థకు అప్పగించారు. సాధారణ పరిపాలనశాఖ నుంచి ఇప్పటికే ఉద్యోగుల డేటాను తీసుకున్న ఆ సంస్థ వారం, పది రోజుల్లో స్మార్ట్ ఎంట్రీ పనులు పూర్తిచేస్తుందని, త్వరలోనే ఈ విధానం అమల్లోకి వస్తుందని భావిస్తున్నారు. అమరావతి సచివాలయంలో రెగ్యులర్‌తోపాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొత్తం కలిపి రెండు వేల మంది వరకు ఉంటారు. కేబినెట్ సమావేశాల సమయంలో, అసెంబ్లీ సమావేశాల సమయంలో సచివాలయానికి సందర్శకుల తాకిడి రెట్టింపవుతుంది. ఆ సమయంలో అందరినీ మాన్యువల్‌గా పరిశీలించి లోపలికి పంపాలంటే కష్టంగా మారుతుంది. అయితే ప్రభుత్వం తీసుకొస్తున్న టెక్నాలజీతో ఈ పని సులువుకానుంది. అలాగే భద్రత కూడా కట్టుదిట్టమవుతుంది.

అన్ని వివరాలూ క్యూఆర్ కోడ్‌లోనే...

సచివాలయంలోని మంత్రుల పేషీల వద్దకు, అధికారుల వద్దకు, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం, ఇతర పనుల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులు వస్తుంటారు. వారంతా ఇప్పటివరకు సంబంధిత అధికారి పేషీ నుంచిగానీ, మంత్రి పేషీ నుంచి గానీ వచ్చిన మెసేజ్‌తోపాటు, గేటు వద్ద భద్రతా సిబ్బందికి ఆధార్ కార్డు చూపించి పాస్ తీసుకుని లోపలికి ప్రవేశించేవారు. ఇక నుంచి అలాకాకుండా వారికిచ్చే పాస్‌లోనే క్యూఆర్ కోడ్ ముద్రించి ఇస్తారు. లేదా వారి ఫోన్ నంబర్‌కు క్యూఆర్ కోడ్ పంపుతారు. ఇందులో ప్రతి సందర్శకుడికీ ఒక విజిటింగ్ ఐడీ వస్తుంది. దీనిలో పేరు, వయస్సు, ఎక్కడి నుంచి వచ్చారు, ఏ పని మీద, ఎవరిని కలవడానికి వచ్చారు..? అనే వివరాలన్నీ ఉంటాయి. భద్రతా సిబ్బంది పరిశీలన అనంతరం ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే బ్యారియర్లు తెరుచుకుంటాయి.

వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లు

సచివాలయానికి వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ఉద్యోగుల వాహనాలకు ఫాస్ట్‌ట్యాగ్ తరహాలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ ఎఫ్ఐడీ) స్టిక్కర్లు ఇవ్వనున్నారు. ఆ స్టిక్కర్లను అంటించుకున్న వాహనాలు గేటు వద్దకు రాగానే అక్కడ ఏర్పాటు చేసిన కెమెరాలు దానిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి వాహనాన్ని లోపలకు అనుమతిస్తుంది. కారులో ఎవరు వచ్చారనేది కూడా సీసీ కెమెరాల్లో రికార్డవుతుంది. దీంతో అనుమతి లేకుండా సచివాలయంలోకి బయటి వ్యక్తులు ఎవరూ ప్రవేశించే అవకాశం ఉండదు.

లక్ష ఎకరాల్లో 'ఉపాధి' ఉద్యానవనాలు

- పేద రైతుల పొలాల్లో పండ్ల తోటలు
- నేడు 25 వేల ఎకరాల్లో నాటేందుకు సన్నాహాలు

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో పేద రైతుల పొలాల్లో లక్ష ఎకరాల్లో ఉద్యానవన పంటలు వేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంకల్పించింది. మంగళవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ లేఖలు రాశారు. సీజన్‌ను బట్టి ఉద్యానవన పంటలు వేసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కోరారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మొక్కలు కొనుగోలు చేయడం ఇప్పటికే పూర్తయింది. ఏయే జిల్లాల్లో ఎన్ని మొక్కలు నాటాలో లక్ష్యాలు నిర్దేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో 20 శాతం భూమిలో ఉద్యానవన పంటలు వేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 0.25 ఎకరాల నుంచి 5 ఎకరాల భూమి కలిగిన జాబ్ కార్డుదారులకు ఉద్యానవన పంటలు పెంచుకునేందుకు ఉపాధి నిధులను మంజూరు చేస్తారు. ఆయా రైతుల పొలాల్లో వేసే మొక్కల రకాలను బట్టి రేటు, వాటికి వేసే ఎరువులు, నిర్వహణ వ్యయం తదితర ఖర్చులను ఉపాధి నిధుల నుంచి అందిస్తారు.

417 పంచాయతీలకు భవనాలు మంజూరు

- ఒక్కో పంచాయతీకి రూ.32 లక్షలు

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 417 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన (ఆర్‌జీఎస్‌ఏ), జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి సంబంధించిన నిధులతో ఈ భవనాలను నిర్మిస్తారు. ఆర్‌జీఎస్‌ఏ ద్వారా ఒక్కో పంచాయతీకి రూ.25 లక్షలు మంజూరు చేయనుండగా, ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల నుంచి మరో రూ.7 లక్షలు కలిపి మొత్తం రూ.32 లక్షలు మంజూరు చేశారు. ఆ మేరకు పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

పదోన్నతులపై కోర్టు ఉత్తర్వులు మూడునెలల్లో అమలు చేస్తాం

హైకోర్టుకు నివేదించిన అడ్వకేట్ జనరల్.. విచారణ సెప్టెంబరు 1కి వాయిదా

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతి కల్పించే విషయంలో ఉమ్మడి హైకోర్టు 2018 ఇచ్చిన తీర్పును సానుకూలంగా మూడునెలల్లో అమలు చేస్తామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఉత్తర్వుల అమలు పురోగతిని కోర్టు ముందు ఉంచేందుకు విచారణను ఐదు వారాలకు వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం విచారణను సెప్టెంబరు 1కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటిం చింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు 2016, 2017లో ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన కోర్టు, పదోన్నతుల్లో అన్ని వర్గాల ఉద్యోగులకు తగినంత ప్రాతినిధ్యం ఉందా?లేదా? అనే విషయాన్ని కనీస అధ్యయనం చేయకుండా రిజర్వేషన్ కల్పించారని తప్పు పట్టింది. బాధిత ఉద్యోగుల వాదన విని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా ప్రతి ఉద్యోగి పదోన్నతినీ సమీక్షించాలని ఆదేశించింది. రిజర్వ్ కేటగిరీ ఉద్యోగులు పరిమితికి మించి పదోన్నతులు పొందినట్టయితే, రిజర్వేషన్ పరిధిలోకి రాని ఇతర ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి స్పష్టం చేస్తూ 2018 డిసెంబరు 11న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో ద సెక్రెటేరియట్ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయిస్ అసోసియేషన్, మరికొందరు ఉద్యోగులు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు సోమవారం విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.... ఉత్తర్వుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సమయం కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీల మీద కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం సమస్యను జటిలం చేస్తుందన్నారు. సెక్రెటేరియట్ ఉద్యోగులకు పదోన్నతి కల్పన గురించి మాత్రమే కమిటీ వేశారని, రాష్ట్రంలోని 31 ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు ప్రారంభించలేదన్నారు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ... కోర్టు ధిక్కరణ కింద అధికారులను బాధ్యులను చేసి శిక్షించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. అయితే, తీర్పును అమలు చేయమని కోరుతున్నారా?లేక శిక్ష విధించమని కోరుతున్నారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. గత ఆరేళ్లుగా ఉత్తర్వులు అమలు కాలేదని, అప్పటి నుండి కోర్టుధిక్కరణ పిటిషన్లు విచారణకు వచ్చేందుకు కూడా పిటిషనర్లు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది. సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేయడం చిన్న విషయం కాదని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను మూడునెలల్లో సానుకూలంగా అమలు చేస్తామని, అందుకు సమయం ఇవ్వాలని ఏజీ కోరుతున్నప్పుడు తాము నిరాకరించలేమని బెంచ్ పేర్కొంది. విచారణను వాయిదా వేసింది.



ఆందోళన చేపట్టిన వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్ షర్మిల

సీవోఏ అనుమతుల్లేకుండా అడ్మిషన్లా? జగన్, అవినాశ్‌దే ఈ పాపం

- వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నాటి వైసీపీ ప్రభుత్వం
- ఈ పాపం జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డిదే
- ప్రస్తుత ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్దాలి: షర్మిల

చెన్నూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీవోఏ) అనుమతులు లేకుండానే వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో విద్యార్థులకు అడ్మిషన్లు ఎలా ఇచ్చారు? కోర్సు కాలం పూర్తయితే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఏంటి?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. కడప జిల్లా చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె వద్ద వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనకు ఆమె సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆవేదన వెలిబుచ్చారు. సీవోఏ అనుమతులు లేకుండా 2020 నుంచి మూడేళ్ల పాటు మభ్యపెట్టి అడ్మిషన్లు ఇచ్చారని, ఇప్పుడు కోర్సుకాలం పూర్తయిపోతోందని, ఆ సర్టిఫికెట్లకు విలువ ఉండదని పేర్కొన్నారు. కోర్సు పూర్తయ్యే సరికి రూ.15 లక్షల మేర ఖర్చవుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో కష్టపడి చదివి ప్రయోజనం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. 67 మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ అనుమతులు లేకుండా నాటి వైసీపీ ప్రభుత్వం మభ్యపెట్టి విద్యార్థులను చేర్చుకోవడం దారుణమన్నారు. 'ఇప్పటి వరకు తొలి బ్యాచ్‌కే ఎన్‌రోల్‌మెంటు లేదు. ఇలా మూడేళ్ల పాటు విద్యార్థుల భవిష్యత్తును ఫణంగా పెట్టారు. ఇది నాటి సీఎం జగన్, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిల నిర్లక్ష్యమే' అని ధ్వజమెత్తారు. 2020 నుంచి 2022 వరకు మూడేళ్ల పాటు చదివిన విద్యార్థులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ సర్కార్ చేసిన తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని షర్మిల అన్నారు. కేంద్రంలో వారి కూటమినే అధికారంలో ఉందని, ఢిల్లీలో ఉన్న సీవోఏ నుంచి అనుమతులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లు విద్యార్థుల భవిష్యత్తుపై సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటి వరకు వర్సిటీకి సొంత భవనంతో పాటు పర్మినెంట్ వీసీ, ఫ్యాకల్టీ లేరని విమర్శించారు. దీనిపై లోకేశ్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ వసంతకుమార్‌తో సీవోఏ అనుమతులు, నాటి పరిస్థితులపై షర్మిల ఆరా తీశారు.

కల్లు, నీరా, ఎక్సైజ్ అకాడమీకి జేసీ నియామకం

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో గతంలో ఎప్పుడూ ఎవరికీ ఇవ్వని సబ్జెక్టులను కలిపి ఓ పోస్టు సృష్టించి... దానికి జాయింట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించారు. ఎక్సైజ్ శాఖలో మూడు జాయింట్ కమిషనర్ పోస్టులు ఉంటాయి. అందులో రెండు కమిషనరేట్‌లో ఉంటే, ఒకటి బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత జాయింట్ కమిషనర్ నాగలక్ష్మిని డిస్టిలరీస్ విభాగానికి జేసీగా నియమించారు. ఆ తర్వాత కొన్ని నెలలకు అకస్మాత్తుగా ఆమెను తొలగించారు. దాదాపు మూడు నెలల తర్వాత ఆమెకు పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీచేసింది. అయితే... కల్లు, నీరా, ఎక్సైజ్ అకాడమీ, కొత్తగా వచ్చే ఉద్యోగులకు శిక్షణ కరిక్యులమ్ తయారీ, వారికి శిక్షణ ఇవ్వడంలాంటి సబ్జెక్టులతో జేసీ పోస్టు రూపొందించి... దానిని నాగలక్ష్మికి అప్పగించారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ అంతా అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం అఫిలియేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఆలస్యం ఫలితంగా ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ల ప్రక్రియ వాయిదా పడింది. షెడ్యూలు ప్రకారం ఈ నెల 10 నుంచి 18 వరకు విద్యార్థులకు ఆప్షన్ల ఎంపిక గడువు ఉంది. ఇప్పుడు దానిని ఈ నెల 13 నుంచి 18 వరకు వాయిదా వేశారు. దీంతో విద్యార్థులకు ఆప్షన్ల ఎంపికకు గడువు తగ్గింది. తొలుత ప్రకటించిన తేదీల ప్రకారం తొమ్మిది రోజులు అవకాశం ఇస్తే, ఇప్పుడు దానిని ఆరు రోజులకు కుదించారు.

ఫీజులపై నాన్చుడు ధోరణి

ఇంజనీరింగ్ అడ్మిషన్లలో ఫీజులు కీలకం. 2024-25లో కనీస ఫీజు రూ.40 వేలు, గరిష్ఠ ఫీజు రూ.1.05 లక్షలుగా ఖరారు చేశారు. ఉన్నత విద్య కమిషన్ సిఫారసుల మేరకు ఈ ఫీజులు నిర్ణయించారు. అయితే ఈ ఫీజులపై కాలేజీల యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాలతోనే ఫీజులను అమలు చేయాలని గతేడాది నిర్ణయం తీసుకున్నారు. గతేడాది న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా పాత ఫీజులే కొనసాగించే అవకాశం ఉంది. అయితే దీనిపై ఉన్నత విద్యాశాఖ ఇంతవరకూ ఎటూ తేల్చలేదు. మరోవైపు కౌన్సెలింగ్ సమీపిస్తోంది. ఆప్షన్ల ప్రారంభ సమయానికి ఏ కాలేజీలో ఎంత ఫీజు అనేది విద్యార్థులకు వెబ్‌సైట్‌లో కనిపించాలి. వాటి ఆధారంగానే విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకుంటారు.

అందరికీ సీట్లు

ఈ ఏడాది రాష్ట్రానికి 2 లక్షలకు పైగా ఇంజనీరింగ్ సీట్లను ఏఐసీటీఈ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ విభాగంలో 1,89,748 మంది ఈఏపీసెట్‌లో అర్హత సాధించారు. వారిలోనూ కొందరు డిగ్రీ, ఇతరత్రా కోర్సుల వైపు వెళ్తూ ఉంటారు. దీంతో కన్వీనర్ కోటాలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీట్లు దక్కుతాయి. కాగా లక్షకు పైగా సీట్లు కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లోనే అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల్లో ఎక్కువ మంది సీఎస్ఈ సీట్లే కావాలని కోరుకుంటున్నారు. ఆ తర్వాత ఈసీఈకి ఎక్కువ డిమాండ్ ఉంది. ఇంకా రాష్ట్రంలో నాలుగు డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు అందుబాటులో ఉన్నాయి.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ బాధ్యతల స్వీకరణ రేపు



అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పార్టీ కార్యాలయ వర్గా లు తెలిపాయి. ఇటీవలే అధ్యక్షుడిగా ఎన్నికైన మా ధవ్.. ఎన్నిక నిర్వాహకుడు పాకా సత్యనారాయణ నుంచి ధ్రువీకరణ పత్రం, పురందేశ్వరి నుంచి జెం డా అందుకొని అధ్యక్షుడిగా ప్రమాణం చేశారు. అయితే అధికారికంగా ఈ నెల 19 లోపు(జాతీయ అధ్యక్షుడి ఎంపిక) బాధ్యతలు తీసుకోవాల్సి ఉం ది. ఆ తర్వాత రాష్ట్ర కమిటీతోపాటు మోర్చాల అధ్యక్షుల్ని నియమిస్తారు.

మహిళల రక్షణ కోసం 'శక్తి'

- ఏడాదిలో 257 కేసుల్లో నిందితులకు శిక్షలు
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడి



అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల భద్రతే లక్ష్యంగా 'శక్తి' బృందాలు, పోలీసులు నిరంతరం పనిచేయడంతో నిందితులకు శిక్షలు పడుతున్నాయని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అన్నారు. ఏడాదిలో మహిళలపై జరిగిన నేరాల్లో 257 కేసుల్లో నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడ్డాయని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవితకాల శిక్షలతో పాటు 20, 25 ఏళ్ల వరకు ఈ శిక్షలు ఉన్నాయన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే తప్పించుకోలేరని హెచ్చరించారు. రాష్ట్రంలో 900 హాట్‌స్పాట్లు గుర్తించి, 153 శక్తి బృందాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాలను శక్తి టీమ్స్ ఇప్పటి వరకూ 36,659 సార్లు సందర్శించి, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. మహిళలు, బాలికలకు సైతం అప్రమత్తంగా ఉండేలా 20,928 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నేరాల కట్టడికి కృషి చేసినట్లు డీజీపీ వివరించారు. శక్తి బృందాలకు 1266 ఎస్‌వోఎస్ కాల్స్ అందగా.. అన్నింటినీ సమర్థవంతంగా పరిష్కరించినట్లు చెప్పారు. డ్రోన్ల ద్వారా ఈవ్‌టీజర్లు, లైంగిక నేరస్తులపై నిఘా పెట్టి అసాంఘిక చర్యలు అరికట్టేందుకు పోలీసులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా తంగెళ్లమూడి గ్రామానికి చెందిన ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా.. శక్తి బృందాలు రక్షించాయని, శ్రీకాకుళం జిల్లా టెక్కలి, పలాస మండలాల్లో తప్పిపోయిన మహిళలను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించామని, పల్నాడు జిల్లా వినుకొండలో బాలుడిని రక్షించినట్లు వెల్లడించారు. భీమవరంలో పోక్సో కేసులో కోర్టు సోమవారం నిందితుడికి జీవితకాల శిక్ష విధించిందని తెలిపారు.

75% రాయితీతో పశుగ్రాస విత్తనాలు

- పంపిణీకి సిద్ధంగా 3,622 టన్నులు: వెటర్నరీ డైరెక్టర్

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాడి పశువుల్లో పాల దిగుబడి పెంపుతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెంపుదల కోసం ఈ ఏడాది రూ.28.54 కోట్లతో పశుపోషకులకు 75% రాయితీతో 3,622 టన్నుల పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమైన పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా ఆయన ఓ ప్రకటన చేశారు. 'రాష్ట్రవ్యాప్తంగా 72,440 హెక్టార్లలో సాగు చేయడానికి పంపిణీ చేస్తున్న 3,622 టన్నుల పశుగ్రాస విత్తనాల ద్వారా 18.11 లక్షల టన్నుల పశుగ్రాసం ఉత్పత్తి అవుతుంది. ఏకవార్షిక పశుగ్రాసాల్లో 2-3 కోతలొచ్చే పశుగ్రాసాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇవి ఎకరానికి 10-15 కిలోల విత్తనాలు వేయాల్సి ఉంటుంది. 45 రోజులకోసారి కోతతో ఎకరానికి 16-20 టన్నుల పచ్చిగడ్డి లభిస్తుంది. బహువార్షిక గడ్డి జాతి విత్తనాలు నాటిన 70 రోజులకు తొలి కోత కోశాక, ప్రతి 40-45 రోజులకో కోతతో ఏటా ఎకరానికి 60 టన్నుల పచ్చిగడ్డి వస్తుంది. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో 100% రాయితీపై పశుగ్రాసాల పెంపకానికి అవకాశం ఉంది. పశుపోషకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి' అని దామోదర్ నాయుడు కోరారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు జీవో విడుదల చేయాలి

- న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సరుకు రవాణా వాహనాలకు గ్రీన్స్ ట్యాక్సు తగ్గిస్తూ, మంత్రిమండలి తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన జీవోను ఈనెలాఖరులోగా విడుదల చేయాలని న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ (నమత) ప్రతినిధులు రవాణా శాఖ కార్యదర్శిని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో రవాణ, హోం శాఖల కార్యదర్శులను, నమత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీవీ చలపతిరావు, సంయుక్త కార్యదర్శి శేషగిరి తదితరులు కలసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. 'ఆల్ ఇండియా పర్మిట్ కలిగిన ఏపీ వాహనాలపై ఇతర రాష్ట్రాల్లో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. త్రైమాసిక పన్నుకు గ్రేస్ పీరియడ్ వర్తింపజేయకుండా ఏపీ లారీల యాజమానులపై కేసులు పెడుతున్నారు. త్రైమాసిక పన్నుకు సంబంధించి గ్రేస్ పిరియడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల్లో కేసులు రాయకుండా చూడాలి. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి, ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో లారీ డ్రైవర్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి' అని హోం కార్యదర్శికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఆకాంక్షిత జిల్లాల జాబితాలోకి అన్నమయ్య, సత్యసాయి, ప్రకాశంలనూ చేర్చాలి: లంకా

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య జిల్లాలను కూడా ఆకాంక్షిత జిల్లాల జాబితాలో చేర్చాలి. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా' అని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వికసిత భారత్, స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగంగా రాష్ట్రంలోని ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకుల్లో అభివృద్ధిని వేగవంతం చేయాల్సి అవసరం ఉంది. దేశంలో 117 ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులు ఉంటే... రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కడప జిల్లాలతోపాటు, 15 బ్లాకులు ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులుగా ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఉన్న సంక్లిష్ట పరిస్థితులే సత్యసాయి, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో కూడా కనిపిస్తుంటాయి. అందుకనే వాటిని కూడా ఈ జాబితాలో చేర్చే అంశాన్ని సీఎం చంద్రబాబు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించేలా ప్రయత్నిసా' అని దినకర్ అన్నారు.

మంత్రి డోలాకు హైకోర్టులో ఊరట

- దిష్టిబొమ్మ దహనం కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి హైకోర్టులో ఊరట లభించింది. 2021లో అప్పటి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసిన వ్యవహారంలో సింగరాయకొండ పోలీసులు నమోదు చేసిన కేసు, దాని ఆధారంగా దిగువ కోర్టులో జరుగుతున్న విచారణపై తదుపరి చర్యలన్నింటినీ 8 వారాలపాటు నిలుపుదల చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న ఫిర్యాదుదారు, అప్పటి సింగరాయకొండ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు నోటీసులు జారీచేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేసిన వ్యవహారంలో తనపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2021లో ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో పాటు చార్జ్‌షీట్‌ను కొట్టివేయాలని కోరుతూ మంత్రి డోలా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఆధారంగా కందుకూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జరుగుతున్న విచారణపై తదుపరి చర్యలు నిలుపుదల చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది నల్లూరి మాధవరావు వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. కేసును కొట్టివేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పోలీసులు ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. కేసులో మొత్తం 48 మంది నిందితులుగా ఉన్నారన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పీఎఫ్, ఏపీజీఎస్ఐ చెల్లింపులు త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌టీయూ అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్యతో కలిసి సోమవారం సచివాలయంలో సీఎస్ విజయానంద్‌కు వినతి పత్రం సమర్పించారు. 11వ పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని కోరారు. కొత్త పీఆర్‌సీకి చైర్మన్‌ను నియమించి, 30 శాతం ఐఆర్ చెల్లించాలన్నారు. 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ స్కీం అమలు చేయాలన్నారు.

జగన్ పర్యటనకు.. 500 మందికే అనుమతి

» హెలిప్యాడ్ వద్దకు 30 మంది మాత్రమే రావాలి

» చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ స్పష్టీకరణ



చిత్తూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యం మండలం మార్కెట్‌యార్డులో రైతులను కలిసేందుకు బుధవారం వస్తున్న మాజీ సీఎం జగన్‌కు భద్రత దృష్ట్యా షరతులతో కూడిన అనుమతి ఇచ్చినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు, ఇతర జిల్లాల్లో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా.. రైతులతో ముఖాముఖికి 500 మంది వచ్చేందుకు అనుమతి ఇచ్చామన్నారు. హెలిప్యాడ్ వద్ద 30 మందికి మాత్రమే పర్మిషన్ ఇస్తామన్నారు. జగన్ పర్యటన ముగిసేవరకు ఎలాంటి రోడ్‌షోలు, బహిరంగ సభలకు అనుమతి లేదని స్పష్టంచేశారు. సోమవారం చిత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే మార్కెట్ యార్డు, హెలిప్యాడ్ ప్రాంతం, రూట్ మ్యాప్, ట్రాఫిక్ తదితర అంశాలను పరిశీలించామన్నారు. హెలిప్యాడ్ చుట్టూ డబుల్ లేయర్ బారికేడ్లను ఏర్పాటు చేసుకోవాలని, పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వైసీపీ నేతలకు సూచించామన్నారు.

వైసీపీ హయాంలో రైతు ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లింపు

అమరావతి, జూలై7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు తాజాగా కూటమి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించింది. గత ప్రభుత్వం కాలంలో 2022లో ఐదుగురు, 2023లో 77 మంది, 2024లో మే నెల వరకూ 46 మంది రైతులు... మొత్తం 128 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను వైసీపీ ప్రభుత్వం వివిధ దశల్లో పెండింగ్‌లో పెట్టింది. వాటిలో 81 కేసుల్లో రైతు కుటుంబాలకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.5.67 కోట్లు విడుదల చేసింది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకూ మొత్తం 104 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు నమోదయింది. ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి అసవరమైన 7.28 కోట్ల బిల్లులను అధికారులు సిద్ధం చేశారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కటుంబాల్లో మిగిలిన వారి బిల్లులు వివిధ దశల్లో ఉన్నాయని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు సోమవారం రాత్రి తెలిపారు.

దుర్మార్గుడి దండయాత్రను అడ్డుకోండి: అచ్చెన్న

న్యూఢిల్లీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతుయాత్ర పేరుతో జగన్ అనే దుర్మార్గుడు చేసే దండయాత్రను రైతులు అడ్డుకోవాలని వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు పిలుపిచ్చారు. ఐదేళ్ల పాలనలో ఆయన రైతుల కోసం ఏం చేశాడో నిలదీయాలన్నారు. ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఇప్పుడిప్పుడే రైతులు సంతోషంగా ఉంటున్నారని, వాళ్లను మళ్లీ అగాధంలోకి నెట్టాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. ఆయన ఎక్కడ కాలు పెట్టినా అక్కడంతా సర్వనాశనమేనని చెప్పారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో శ్రీకాకుళం ఎమ్మెల్యే జి.శంకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలో జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. యాత్రల పేరుతో కారు టైర్ల కింద హత్యలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వ్యక్తి చనిపోయిన ఏడాది తర్వాత పరామర్శలు, 80 శాతం పంటలు కొనేసిన తర్వాత రైతు యాత్రలు చేయడం జగన్‌కు మాత్రమే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. తోతాపురి మామిడి ధరపై జగన్ నీచ రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన పాలనలో ఆ మామిడి ధర కిలో రూ.6 నుంచి రూ.4కు పడిపోయిందని, ఒక్క రూపాయి కూడా సబ్సిడీ ఇవ్వలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం కిలోకు రూ.12 ధరను నిర్ణయించిందని, అందులో రూ.8 ప్రాసెసర్లు/వ్యాపారులు భరించాలని, అదనపు మద్దతు ధరగా ప్రభుత్వం రూ.4 చెల్లిస్తోందని తెలిపారు. దీనికి సంబంధించి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్(ఎమ్ఐఎస్) కింద రూ.130 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మామిడి రైతుల దగ్గర 3.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు.

పర్యటనల పేరిట ప్రాణాలు తీస్తున్నారు: అనగాని

తిరుపతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజలను తప్పుదోవ పట్టించడానికే మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలు చేపడుతున్నారంటూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షం పర్యటనల పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తోందని ఆరోపించారు. మామిడి రైతులకు అన్యాయం జరుగుతోందని జగన్ గగ్గోలు పెడుతున్నారని, అయితే గతంలో అయినా ఇప్పుడైనా రాష్ట్రంలో మామిడి రైతును ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని అన్నారు.

కర్ణాటకలో నాలుగే.. ఏపీలో 12కి కొంటున్నాం: శ్రీనివాసరెడ్డి

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర గురించి అవగాహన లేని జగన్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తూ రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. 'కూటమి ప్రభుత్వం తోతాపురి మామిడిని కిలో రూ.12కి కొనుగోలు చేయాలని నిర్ణయించగా ఇందులో రూ.8 ఫ్యాక్టరీలు, మిగిలిన రూ.4 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. జగన్ కర్ణాటకలో మామిడి కిలో రూ.16కి కొనుగోలు చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి కర్ణాటకలోని మండీల్లో కిలో రూ.2, ఫ్యాక్టరీల్లో రూ.4కి కొనుగోలు చేస్తున్నారు' అని వివరించారు.

పరామర్శకు దండుపాళ్యం బ్యాచ్: సప్తగిరి ప్రసాద్

మామిడిలో ఎన్ని రకాలు ఉంటాయో కూడా తెలియని జగన్ మామిడి రైతుల పరామర్శకు వెళ్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. 'చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించేందుకు 9న దండుపాళ్యం బ్యాచ్ బయలుదేరుతోంది. వెయ్యి ఎలుకల్ని తిన్న పిల్లి కాశీ యాత్రకు బయలుదేరినట్లు జగన్ పరామర్శ యాత్ర ఉంది. ఈ పరామర్శకు రైతు ద్రోహి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంటేసుకుని రావడం దారుణం' అని ప్రసాద్ అన్నారు.

మళ్లీ పాదయాత్ర హాస్యాస్పదం: బీసీ జనార్దన్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'దేశంలో ఏ పార్టీకి లేనంత వ్యతిరేకత వైసీపీకి రాష్ట్రంలో ఉంది. అలాంటి పార్టీకి అధ్యక్షుడైన జగన్ మళ్లీ పాదయాత్ర చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది' అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోట, కన్నెలూరు గ్రామాల్లో మంత్రి మీడియాతో మాట్లాడారు. జగన్ చేతకాని పాలనతో 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ సింగిల్ డిజిట్‌తో సరిపెట్టుకోవాల్సి వస్తుందన్నారు.

పీ-4లో తొలి అడుగు!

» పోసిబాబు కుమారుడికి మెరుగైన ఉద్యోగం

» సీఎం హామీతో చర్మకారుడి కుటుంబంలో వెలుగు

రాజమహేంద్రవరం, జూలై7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన ప్రయోగం పీ4 పథకం కింద తూర్పు గోదావరి జిల్లాలో మార్గదర్శి బంగారు కుటుంబం తొలి అడుగు వేసింది. కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లి గ్రామానికి ఈ నెల 1న వచ్చిన సీఎం చంద్రబాబు.. స్థానిక చర్మకారుడు సనమండ్ర పోసిబాబును స్వయంగా తన కారులో ఎక్కించుకుని అతడి ఇంటికెళ్లి వారి జీవన స్థితిగతులను ఆరా తీసిన సంగతి తెలిసిందే. అనంతరం సీఎం చంద్రబాబు అతడి పరిస్థితి గమనించి పోసిబాబు కుమారుడు మోహన్‌కు మెరుగైన ఉద్యోగమిస్తామని, పోసిబాబుకు షాపు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ఈ కుటుంబాన్ని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దత్తత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేవలం వారం రోజుల్లోనే పోసిబాబు కుమారుడు మోహన్‌కు పెరవలి మండలం ఖండవల్లిలోని రవళి స్పిన్నింగ్ మిల్లులో మెరుగైన ఉద్యోగం లభించింది. మోహన్ ఇప్పటికే రవళి స్పిన్నింగ్ మిల్లు యూనిట్-5లో ఫిట్టరుగా పనిచేస్తుండగా, సీఎం హామీ మేరకు అతడికి టెక్నికల్‌గా ప్రాధాన్యమున్న క్యాపికన్ డిస్టిలరీ పోస్టు ఇస్తూ మిల్లు యాజమాన్యం సోమవారం నియామక ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో భాగంగా మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో రూ.13 వేల వరకూ జీతం ఉంటుంది. తర్వాత జీతం పెంచుతారు. ఈ సందర్భంగా మోహన్ సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని కలవగా, ఆమె అభినందించి ఉద్యోగం బాగా చేసుకోవాలని సూచించారు. మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మా ఇంటికి వచ్చి, మా పరిస్థితిని ఆరా తీసి, మా అభివృద్ధికి బాటలు వేయడాన్ని జీవితంలో మరువలేమన్నారు.



కలెక్టర్ ప్రశాంతిని కలిసి మాట్లాడుతున్న పోసిబాబు కుమారుడు మోహన్

సవాళ్లకు సై అంటేనే..

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. "మంగళగిరి నియోజకవర్గంలో 1980ల్లో ఎప్పుడో ఒకసారి తప్ప తెలుగుదేశం గెలిచింది లేదు. అలాంటి నియోజకవర్గాన్ని ఎంచుకొని పోటీ చేశాను. తొలి ఎన్నికల్లో ఓడిపోయాను. మొన్నటి ఎన్నికల్లో ఎవరూ సాధించనంత భారీ మెజారిటీతో గెలిచాను. ఐదేళ్ల పాటు రేయింబవళ్లు ఆ నియోజకవర్గ ప్రజల కోసం పని చేయడమే ఇందుకు కారణం. విద్యా శాఖ మంత్రి పదవి కూడా ఒక సవాల్‌గానే స్వీకరించాను. అందరూ వద్దన్నారు. ఉపాధ్యాయ సంఘాలను సంతృప్తి పరచడం కష్టమన్నారు. విద్యా శాఖను మార్చగలిగితే ఏ శాఖనైనా మార్చగలననే నమ్మకంతో, పట్టుదలతో ముందుకు వెళుతున్నా. సృష్టిలో అందరికన్నా ఎక్కువ భారం మోసేది తల్లి. ఆ తల్లి భారాన్ని కొంతైనా తగ్గించాలనే ఉద్దేశంతో తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డ చదువుకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. మంత్రి పదవిని ఒక పవిత్రమైన బాధ్యతగా తీసుకున్నా. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్న కూడా చెట్లు పెంచాలని విద్యార్థులకు పిలుపునిస్తున్నారు. ఆయన సూచనల మేరకు పాఠశాలల్లో గ్రీన్ పాస్‌పోర్టు ప్రారంభిస్తాం. ప్రతి విద్యార్థి ఒక మొక్కను మూడేళ్లు పెంచాలి. దానిని ఉపాధ్యాయుడు పరిశీలించి మార్కులు వేస్తారు. 'ఒక క్లాస్ ఒక టీచర్' అనే నినాదంతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వాడబోతున్నాం" అని లోకేశ్ అన్నారు.



బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి లోకేశ్, పక్కన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

వీఆర్ స్కూలు అద్భుతం

"సమాజంలో ఉన్న నిరుపేదలను, సంపన్నుల సహకారంతో కాస్త పైకి తేవడానికి ప్రవేశపెట్టిన పీ4 పథకం ఎలాంటి మార్పులు తెస్తోందో వీఆర్ స్కూలు చూసిన తరువాత అర్థమయ్యింది. ఈ స్కూలు చూసి ఆశ్చర్యపోతున్నా. నేను చదువుకున్న స్కూలు కన్నా బాగుంది. మంగళగిరిలో ఇలాంటి స్కూలు లేదనే ఈర్ష్య కూడా కలుగుతోంది. ఆరు నెలల క్రితం శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన విద్యాలయంగా మార్చిన మంత్రి నారాయణను, ఆయన కుమార్తె షరిణిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. దక్షిణ భారత దేశంలోనే ఇలాంటి ప్రమాణాలు గల ప్రభుత్వ పాఠశాల మరొకటి లేదు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం నియోజకవర్గానికి ఒక్కటైనా ఇలాంటి స్కూలు ఏర్పాటు చేస్తాం. ఏడాదిలోపు మంగళగిరిలో కూడా ఇలాంటి స్కూలు ఏర్పాటు చేస్తాను. వసతులతో పాటు విద్యాప్రమాణాలు, ఫలితాల్లో కూడా నారాయణ మాస్టర్‌తో పోటీ పడతాను" అని అన్నారు. పీ-4 కింద ప్రభుత్వ స్కూళ్లను దత్తత తీసుకొని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు, నారాయణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి షరిణి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని లోకేశ్ సత్కరించారు. మరింత మంది దాతలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సరదాగా క్రికెట్.. వాలీబాల్

వీఆర్ స్కూలు ప్రారంభోత్సవం సందర్భంగా లోకేశ్ పాఠశాల ఆవరణం మొత్తం కలియతిరిగారు. క్లాస్ రూంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులు, హైడ్రోఫోనిక్ ల్యాబ్‌లు, యాక్టివిటీ హాలు తదితరాలను పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేసిన ప్లే గ్రౌండ్ చూసి లోకేశ్ సంతోషించారు. కాసేపు క్రికెట్ ఆడి బ్యాటింగ్ చేశారు. వాలీబాల్ ఆడారు. తనతో పాటు ఆడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మైదానమంతా తిరిగారు.

నారాయణకు అభినందనలు

గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థతో పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి భ్రష్టుపట్టించిందనడానికి వీఆర్ స్కూలే ఉదాహరణ అని మంత్రి నారాయణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకారంతో ఈ పాఠశాలను పునఃప్రారంభించామన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దడానికి కారణమైన మంత్రి నారాయణను అభినందించారు.

ఆరోగ్య రొట్టె పట్టుకున్న లోకేశ్

నెల్లూరు బారాషాహీ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో లోకేశ్ పాల్గొన్నారు. భక్తులతో కలిసి ఆరోగ్య రొట్టెను పట్టుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని కోరుకొంటూ తాను ఆరోగ్య రొట్టె పట్టుకున్నానని తెలిపారు. సుమారు రెండు గంటల పాటు దర్గా ప్రాంగణంలో భక్తుల మధ్య గడిపారు. భక్తులను పలుకరించి సౌకర్యాలపై ఆరా తీశారు.

ఇద్దరు యాచక పిల్లల దత్తత

ఇద్దరు యాచకుల పిల్లలను మంత్రి లోకేశ్ దత్తత తీసుకున్నారు. వారి ఉన్నత చదువుల వరకు వారి బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వీఆర్ హైస్కూలు క్రీడా మైదానంలో ఆడుకుంటున్న యాచక వృత్తికి చెందిన ఇద్దరు చిన్న పిల్లలను మున్సిపల్ కమిషనర్ నందన్ చూసి, మంత్రి నారాయణ వద్దకు తీసుకెళ్లారు. వారి పేర్లు పెంచలయ్య, వెంకటేశ్వర్లు. ఇక్కడ చదువుకుంటారా? అని మంత్రి వారిని అడిగారు. స్కూలులో చేర్చుకుంటే చదువుకుంటామని పిల్లలు చెప్పారు. నారాయణ ఈ విషయాన్ని లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. నెల్లూరు నగరంలో యాచక వృత్తిలో ఒక బడి ఈడు పిల్లాడు కూడా ఉండటానికి వీల్లేదని, అలాంటి వారిని గుర్తించి వీఆర్ స్కూలులో అడ్మిషన్ కల్పించాలని లోకేశ్ అన్నారు. పెంచలయ్య, వెంకటేశ్వర్లును దత్తత తీసుకొంటున్నట్టు సభా వేదికపై ప్రకటించారు. వారు ఉన్నత చదువులు చదివే వరకు విద్యాపరంగా అవసరాలన్నీ తానే చూసుకుంటానని భరోసా ఇచ్చారు.

కార్పొరేట్‌కు దీటుగా వీఆర్ హైస్కూల్

నెల్లూరులో ఘన చరిత్ర గల వీఆర్ (వెంకటగిరి రాజాస్) హైస్కూల్ పూర్వవైభవం సంతరించుకుంది. అత్యాధునిక హంగులతో ఈ పాఠశాల రూపుదిద్దుకుంది. 1875లో ప్రారంభమైన వీఆర్ విద్యా సంస్థలకు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ఎంతోమంది ఇక్కడే చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అలాంటి మహోన్నత పాఠశాల గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడింది. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ, నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంత్రి నారాయణ ఈ స్కూలును సుమారు రూ.15 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ విద్యా సంస్థలో వెయ్యిమంది నిరుపేద విద్యార్థులు అడ్మిషన్లు పొంది డిజిటల్ విద్యను అందుకోబోతున్నారు. ప్యానల్ బోర్డులు, ల్యాబ్‌లు, అత్యాధునిక ఆటస్థలం, బెంచీలు, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఆరు జతల యూనిఫాం వంటి వసతులతో నెల్లూరుకే తలమానికంగా నిలుస్తోంది. ఉదయం, సాయంత్రం అల్పాహార విందు, మధ్యాహ్న భోజనం, బడికి దగ్గరగా ఉన్న విద్యార్థులకు ఉచిత సైకిళ్లు, దూరంగా ఉన్నవారికి బస్ సౌకర్యం కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాలల కంటే దీటుగా ఉత్తమ విద్యను అందించనున్నారు.



నిఘా నేత్రం!

(మొదటి పేజీ తరువాయి)

అదుపు చేయాలని చెప్పారు. దీనికోసం ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజీని కూడా తీసుకోవాలని... దీనికి అనుగుణంగా నిబంధనలు మార్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరస్తుల ఆచూకీ కోసం ప్రైవేటు వ్యక్తులు, సంస్థల సీసీటీవీ ఫుటేజీని పోలీసు విభాగం వినియోగించుకునేలా ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సీసీ కెమెరాల నిరంతర నిఘాతో శాంతిభద్రతల పర్యవేక్షణ సులువవుతుందని పేర్కొన్నారు.

నిఘాతో భయం...

క్రైమ్ హాట్ స్పాట్లపై సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టాలని సీఎం ఆదేశించారు. నిఘా పటిష్ఠంగా ఉందని తెలిస్తే నేరస్థులు భయపడతారని చెప్పారు. పోలీసు వ్యవస్థకు సహకరించని వ్యక్తుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్లలో ప్రజా భద్రత కోసం, నేరాల కట్టడికి, దర్యాప్తు నిమిత్తం, శాంతిభద్రతల పర్యవేక్షణకు పెద్దసంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింపజేయాలని అన్నారు. బహిరంగ కూడళ్లలో సీసీ కెమెరాలను పోలీసు విభాగం ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాల్లో డ్రోన్ల, సీసీ కెమెరాల వినియోగం పెంచాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా ఆరా తీశారు. ప్రభుత్వ రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. రెవెన్యూ రికార్డులను కూడా ప్రక్షాళన చేసేందుకు నూతన సాంకేతికతను వినియోగించాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటికీ సంబంధించిన సమాచారం కూడా టెక్నాలజీ సాయంతో భద్రపరిచే చర్యలు చేపట్టాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలన్నీ ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో పిడుగులు పడే ప్రాంతాల్లో ప్రాణాలు కాపాడేలా ముందస్తు సమాచారం అందించాలని, అక్కడ సైరన్ మోగించాలని సూచించారు. రిజర్వాయర్లను పూర్తి సామర్థ్యంతో నింపాలని చెప్పారు. పీ4ను వినియోగించుకుంటూ 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి పని చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ శాఖ తమ దగ్గరున్న లబ్ధిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు.

14న ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 14 సాయంత్రం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. మూడు రోజులపాటు సాగే ఈ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతోపాటు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులను ఆయన కలవనున్నారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు వివాదంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రితో సీఎం చర్చించే అవకాశం ఉంది.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సమగ్ర అధ్యయనం

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని, ఇప్పుడున్న ఈ తరహా కంప్యూటర్ల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు వాటిని తయారు చేస్తున్న సంస్థలను పరిశీలించాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఆ శాఖ అధికారులతో సీఎం సమీక్షను నిర్వహించారు. గతనెల 30న జరిగిన క్వాంటమ్ కంప్యూటింగ్ వర్క్‌షాపులో చేసిన తీర్మానాలను అమలు చేయడంపైనా సమీక్షించారు. ఈ తీర్మానాల మేరకు జనవరి ఒకటిన అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ప్రారంభించడంపై బుధవారం జరిగే క్యాబినెట్ భేటీలో ప్రతిపాదనలు పెట్టి ఆమోదం పొందనున్నారు. కాగా, క్వాంటమ్‌పై అధ్యయనానికి.. మంగళవారం బెంగళూరులో సుమారు 12 ప్రఖ్యాత ఐటీ కంపెనీల ప్రతినిధులతోఐటీ శాఖ మంత్రి లోకేశ్, కార్యదర్శి కాటమనేని భాస్కర్ భేటీ కానున్నారు.

మరీ ఇంత తాత్సారమా?

» నేహారెడ్డిపై చర్యలకు ఇన్నాళ్లు మీనమేషాలు

» హైకోర్టు ఆగ్రహంతో ఎట్టకేలకు కేసు నమోదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డిపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఎట్టకేలకు కేసు నమోదైంది. నేహారెడ్డి భీమిలి బీచ్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాల వ్యవహారంలో హైకోర్టు ఇప్పటికే పలుసార్లు గట్టిగా స్పందించినా, ఆమెపై కేసు నమోదులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారు. తాము ఆదేశించినా క్రిమినల్ కేసు పెట్టడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ఆంధ్రప్రదేశ్ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రటరీని గత నెల విచారణ సందర్భంగా హైకోర్టు నిలదీసింది. దీంతో అధికారులు చివరకు కదిలారు. వచ్చే వాయిదాకు కేసు నమోదు చేసిన వివరాలతో పాటు సీఆర్‌జెడ్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించి నిర్వహిస్తున్న ఐదు రెస్టో బార్లపై ఏమి చర్యలు తీసుకున్నారో వివరించాలని అప్పట్లో హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో నేహారెడ్డితో పాటు ఆమెకు చెందిన అవ్యాన్ రియల్టర్స్ సంస్థపై భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఫిర్యాదుచేశారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆ చట్టానికి సంబంధించిన సెక్షన్లతో కేసుపెట్టారు. దీనిపై పోలీసులు విచారించాల్సి ఉంది. భీమిలి బీచ్‌లో నేహారెడ్డి చేపట్టిన నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని, దానికి అయిన వ్యయంతోపాటు ఆ చర్యల వల్ల పర్యావరణానికి కలిగిన నష్టాన్ని అంచనావేసి, దానిని కూడా ఆమె నుంచే వసూలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే గత మార్చి నెలలో పునాదులను కొంతవరకూ తొలగించారు. దానికి రూ.60 లక్షలు వ్యయం అయింది. ఆ కాంట్రాక్టర్‌కు రూపాయి కూడా ఇవ్వకపోవడంతో పనులు ఆపేశారు. మరో వైపు దీని వల్ల జరిగిన పర్యావరణ నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఒక కమిటీని వేయాల్సి ఉంది. అది కూడా ఏర్పాటు కాలేదు. సీఆర్‌జెడ్‌లో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన అంశంపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పిల్ వేయగా, వాటిపై హైకోర్టు విచారణకు ఆదేశించింది. వాటిని సర్వే చేయడానికి జాతీయ సముద్ర అధ్యయన సంస్థకు జీవీఎంసీ సుమారుగా రూ.17 లక్షలు చెల్లించింది. వారు సర్వే చేసి అన్ని రెస్టో బార్లు నిబంధనలు ఉల్లంఘించాయని నివేదించింది. వాటిపై చర్యలు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో ఆయా సంస్థలు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోగలిగాయి. ఆయా సంస్థల యాజమాన్యాలను పిలిచి వివరణ తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లను హైకోర్టు పేర్కొంది. వారు చెప్పే సమాధానాలను బట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ఈ అంశం రెండు వారాల్లో విచారణకు రానుంది.

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ఇంటిపై మహిళల దాడి

» కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలే కారణం!

» ఆమె వల్ల ఆమె భర్త వేమిరెడ్డికి ప్రాణహాని ఉందన్న ప్రసన్న

» ఆయన్ను నిద్రలోనే లేపేస్తారని వ్యాఖ్య

» ఆగ్రహంతో మాజీ ఎమ్మెల్యే ఇంటికెళ్లిన మహిళలు

నెల్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు.. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంపై మహిళలు దాడిచేశారు. ఫర్నిచర్, కారు ధ్వంసం చేశారు. సోమవారం సాయంత్రం ప్రసన్న కోవూరులో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఓ పిచ్చోడు కాబట్టి ఆమె మాయలో పడ్డారు. ప్రభాకర్‌రెడ్డిని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి ఆమె పెళ్లి చేసుకుంది. ఇప్పుడు ఆయన కూడా ఆమె వల్ల సంతోషంగా లేరు. ఇదేమి ఖర్మని బాధపడుతున్నాడు. ఆమె వల్లే ఆయనకు ప్రాణహాని ఉంది. ఆయన్ను నిద్రలోనే లేపేస్తారు. ప్రభాకరరెడ్డన్నా.. నీకు చెబుతున్నా, నీవు నిద్రలోనే చనిపోతావు, బయటైనా ఎక్కడో ఒక చోట లేపేస్తారు, నీకు వేల కోట్ల ఆస్తులున్నాయి, మంచోడు, తెలివైన వాడని పేరుంది. జాగ్రత్తగా ఉండాలి నువ్వు' అని అన్నారు. ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలు జిల్లాలో సంచలనం రేపాయి. ఒక మహిళా ఎమ్మెల్యేనుద్దేశించి ఇంత నీచంగా మాట్లాడతారా అని మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పెద్దసంఖ్యలో నెల్లూరు నగరంలోని సుజాతమ్మ కాలనీలో ప్రసన్న నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో ఇంట్లోని ఫర్నిచర్‌ను, కారును ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, వైసీపీ నాయకులు హుటాహుటిన ప్రసన్న నివాసం వద్దకు చేరుకున్నారు. పోలీసులు వచ్చి ఘటనాస్థలిని పరిశీలించారు. దీనిపై అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇలాంటి సంఘటన ఇదివరకు ఎన్నడూ జరుగలేదన్నారు. 9సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవులు చేపట్టిన ఓ కుటుంబంపై ఇలా దాడి చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. దాడి వెనుక ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హస్తం ఉందని, వారిద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



దాడిలో దెబ్బతిన్న కారు

నిండుకుండలా శ్రీశైలం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు మంగళవారం రానున్నారు. ఉండవల్లి నివాసం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఉదయం 11 గంటలకు నంద్యాల జిల్లా సున్నిపెంటలో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11:35 గంటలకు శ్రీశైలం చేరుకుంటారు. తొలుత భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని.. 11:50-12:10 గంటల మధ్య కృష్ణమ్మకు జలహారతి ఇస్తారు. తర్వాత శ్రీశైలం డ్యాం గేట్లను ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తారు. ఇంజనీర్లు, డ్యాం అధికారులతో డ్యాం పరిస్థితులపై చర్చిస్తారు. నీటి వినియోగ సంఘాల ప్రతినిధులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది. అనంతరం రోడ్డు మార్గాన సున్నిపెంటకు వెళ్లి హెలికాప్టర్లో అమరావతికి తిరిగి వెళ్తారు. సీఎంతో పాటు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, శ్రీశైలం చీఫ్ ఇంజనీర్ ఖాదిర్, ఎస్ఈ వేణుగోపాల్ తదితరులు కూడా పాల్గొంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, కడప ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ, శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. సున్నిపెంట, శ్రీశైలం, డ్యాం పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరింపజేశారు.

సగం జిల్లాల్లో వర్షాభావం..

రాష్ట్రంలో సగం జిల్లాల్లో అంటే 13 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 92.33 మిల్లీమీటర్ల సగటు వర్షపాతానికి గాను 13 శాతం తక్కువగా నమోదైంది. కోనసీమలో 72.55 మిల్లీమీటర్లకు గాను 13.2 శాతం, గుంటూరు జిల్లాలో 50.6 మిల్లీమీటర్లకు గాను 29.95 శాతం, బాపట్లలో 61.7 మిల్లీమీటర్లకుగాను 17.64 శాతం, పల్నాడులో 51.07 మిల్లీమీటర్లకు గాను 40.63 శాతం, ప్రకాశం జిల్లాలో 47.27 మిల్లీమీటర్లకు 10.94 శాతం, నెల్లూరు జిల్లాలో 49.3 మిల్లీమీటర్లకు గాను 41.7 శాతం, నంద్యాల జిల్లాలో 33.05 మిల్లీమీటర్లకు 6.56 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోనూ కరువు ఛాయలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఖరీఫ్ ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని సాగునీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీటినిల్వ..

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీశైలం	215.81	192.5	1,71,550	83233
నాగార్జునసాగర్	312.05	164.1	55892	9461
పులిచింతల	45.77	19,76	-	-
ప్రకాశం బ్యారేజీ	3.07	2.81	7385	7385
ఆల్మట్టి	129.72	91.76	110512	115045
జూరాల	9.66	7.39	110028	111218
తుంగభద్ర	100.86	76.71	63856	63856

పాతికేళ్లలో రికార్డు

- జూలై తొలి వారంలో శ్రీశైలం గేట్లు ఎత్తడం ఇదే ప్రథమం

కర్నూలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం పాతికేళ్ల రికార్డును సొంతం చేసుకుంది. జూలైలో తొలిసారిగా మొదటి వారంలో క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువన నాగార్జునసాగర్ జలాశయానికి వరద జలాలు విడుదల చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 1960లో చేపట్టి 1981లో జాతికి అంకితం చేశారు. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు.. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. 12 క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేశారు. కుడిగట్టు విద్యుత్ కేంద్రం విద్యుదుత్పత్తి సామర్థ్యం 770 మెగావాట్లు, ఎడమ గట్టు కేంద్రం సామర్థ్యం 900 మెగావాట్లు. జలాశయం వరద నీటి లెక్కలు పరిశీలిస్తే.. 2009 అక్టోబరు 2న అత్యధికంగా 25 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. అంతేకాదు పాతికేళ్ల వరద లెక్కలు పరిశీలిస్తే.. జూలై ఆఖరి వారంలోనో, ఆగస్టు తర్వాతో గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు జూలై మొదటి వారంలోనే గేట్లు ఎత్తడం పాతికేళ్ల రికార్డుగా నిలుస్తోంది. ఈ ఏడాది కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు జూన్ ప్రారంభం నుంచే వరద మొదలైంది. క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. కర్నూలు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు లేకున్నా.. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. వాటి గేట్లు ఎత్తి దిగువకు వరద విడుదల చేయడంతో కృష్ణమ్మ శ్రీశైలం డ్యాంను ముందే నింపేసింది. సోమవారం రాత్రి 8గంటల వరద లెక్కల ప్రకారం డ్యాం వద్ద 1,71,550 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. నీటినిల్వ 193.40 టీఎంసీలకు చేరింది. ఎగునవ జూరాల నుంచి 1,08,359 క్యూసెక్కులు, సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర నది) నుంచి 63,856 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్కేంద్రాల్లో విద్యుదుత్పాదన ద్వారా సాగర్‌కు 67,433 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి రాయలసీమ కాలువలకు 15 వేలు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 83,233 క్యూసెక్కులుగా ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి ఈ నెల 10న టీబీపీ ఎల్లెల్సీ కాలువకు, సుంకేసుల బ్యారేజీ నుంచి 14న కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని కర్నూలు కలెక్టరు పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశంలో తీర్మానం చేశారు.

సాగర్‌లో 164 టీఎంసీలు..

సాగర్ గరిష్ఠ నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలకు గాను ప్రస్తుతం 164.1 టీఎంసీల నిల్వ ఉంది. మరో 147.95 టీఎంసీలు వస్తే తప్ప నిండదు. శ్రీశైలానికి ఆ స్థాయిలో భారీ వరద వచ్చి దిగువకు వదిలితే.. సాగర్ గరిష్ఠ స్థాయికి చేరాక.. కిందకు పులిచింతల.. ప్రకాశం బ్యారేజీకి నీటిని వదిలే అవకాశముంది.



ధవళేశ్వరం ఆనకట్ట నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద

శబరి, సీలేరు వరదతో ఎరుపెక్కిన గోదావరి

- ఎగువన భారీవర్షాలతో 4 రోజుల్లో తీవ్ర ఉధృతికి అవకాశం
- పోలవరం స్పిల్‌వేలోకి 1,95,294 క్యూసెక్కులు
- ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి 1,85,143 క్యూసెక్కులు



పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి ఉధృతి

పోలవరం/ధవళేశ్వరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోదావరి నీరు ఎరుపెక్కింది. ఉపనదులైన శబరి, సీలేరు వరద నదిలో కలుస్తుండడంతో ఉధృతి పెరగడంతో పాటు రంగు మార్చుకుంటోంది. ఎగువన మహారాష్ట్రలో మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. ఈ ప్రభావంతో రానున్న 3-4రోజుల్లో వరద మరింత పెరిగే అవకాశాలున్నాయని కేంద్ర జలసంఘం, జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 1,95,294 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 27.99 మీటర్లు, దిగువన 18.45 మీటర్లు.. కాఫర్ డ్యాంకు ఎగువన 28.15 మీటర్లు, దిగువన 17.45 మీటర్లు, కాఫర్ డ్యాంల మధ్య 16.04 మీటర్ల నీటిమట్టం నమోదైంది. స్పిల్‌వే గుండా వస్తున్న వరదనీటిని ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇంకోవైపు.. భద్రాచలం వద్ద నీటి మట్టం 18.20 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం బ్యారేజీకి 2,05,155 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఎగువ నుంచి 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రావచ్చన్న అంచనాతో బేసిన్‌ను ఖాళీ చేయాలని నిర్ణయించారు. దిగువన కాటన్ బ్యారేజీ నుంచి 172 గేట్లను కొద్దిగా ఎత్తి 1,85,143 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,450 , పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

కోస్తాలో బలమైన గాలులు

- వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచన

విశాఖపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి): భూ ఉపరితలం నుంచి 12 కిలోమీటర్ల ఎత్తులో ఈస్టర్లీ జెట్ (వియత్నాం నుంచి దక్షిణ భారతం మీదుగా ఆఫ్రికా వరకు) గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో మధ్య కోస్తా, దానికి ఆనుకుని ఉత్తర కోస్తాలో సోమవారం బలమైన తూర్పుగాలులు వీచాయి. దీంతో సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈస్టర్లీ జెట్ ప్రయాణించే ప్రాంతానికి ఎగువన అంటే ఛత్తీస్‌గఢ్, ఉత్తర తెలంగాణ, మధ్య మహారాష్ట్రల్లో రుతుపవనాలు చురుగ్గా మారాయి. ఛత్తీస్‌గఢ్‌లో కుంభవృష్టిగా వర్షాలు కురవడంతో గోదావరికి వరద మొదలైందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. రాష్ట్రంలో ఈస్టర్లీ జెట్ ప్రభావంతో బలమైన గాలులు తప్ప వర్షాలు లేవన్నారు. రానున్న 2, 3 రోజుల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు.

మద్యం స్కాం నిందితులకు కోర్టు ఝలక్

- చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత
- రాజ్ కసిరెడ్డికి ఇంటిభోజనం నో





విజయవాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో అరెస్టయి విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చాణక్య దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టేసింది. చాణక్య బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. అలాగే కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించలేమని కోర్టు స్పష్టం చేసింది. జైలులో ఉన్న తనకు ఇంటి భోజనం అనుమతించడంతోపాటు సదుపాయాలు కల్పించాలని కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయాధికారి భాస్కరరావు సోమవారం కొట్టివేశారు. మరోవైపు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సిట్ పోలీసులు సోమవారం ఏసీబీ కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై వాదనలను పదో తేదీకి వాయిదా వేస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు.

క్యామ్‌సైన్ డైరెక్టర్ మధుసూదన్‌కు షరతులతో బెయిల్



అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడటంతో పాటు నిధులు దుర్వినియోగం చేసిన వ్యవహారంలో క్యామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్(ఏ2)కు హైకోర్టు పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేంత వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని సూచించింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఈ మేరకు తీర్పు ఇచ్చారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనం వ్యవహారంలో విజయవాడ సూర్యారావుపేట పోలీసులు మధుసూదన్‌పై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ1)ను పోలీసులు నిందితుడిగా చేర్చిన విషయం తెలిసిందే.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి క్వాష్ పిటిషన్ ఉపసంహరణ

- ముందస్తు బెయిల్‌కు హైకోర్టులో పిటిషన్




అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన తరఫు న్యాయవాది స్పందిస్తూ.. వ్యాజ్యాన్ని ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి క్వాష్ పిటిషన్ ఉపసంహరణకు అంగీకరించారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో మంగళగిరి సీఐడీ పోలీసులు మోహిత్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. కేసులో చాలా తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని, అందువల్ల రక్షణ కల్పించలేమని న్యాయస్థానం పేర్కొంది. పోలీసులు అరెస్ట్ చేస్తారన్న ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ దాఖలు చేసుకోవాలని ఆయనకు సూచించింది.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ప్రధానంగా ఉన్న ఆరోపణ అని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా తుడా వాహనాలు వినియోగించి కోట్ల రూపాయలు తరలించడం సాధ్యం కాదన్నారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దిగువ కోర్టు కొట్టివేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరపనుంది.

అధికార పార్టీకి భయపడి పోలీసులు కేసు పెట్టారు: పేర్ని నాని

- సత్తెనపల్లి పీఎస్‌లో విచారణకు హాజరు



సత్తెనపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎన్ని కేసులు పెట్టినా జగన్ జెండా వదిలే ప్రసక్తే లేదని మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పోలీసు విచారణకు ఆయన సోమవారం హాజరయ్యారు. పేర్ని నానికి పట్టణ పోలీసులు 41 నోటీసు ఇచ్చి పంపించివేశారు. ఈ సందర్భంగా ఆయన పీఎస్ వద్ద మీడియాతో మాట్లాడారు. 'అధికార పార్టీ నేతలకు భయపడి పోలీసు ఉన్నతాధికారులు, కింది స్థాయి అధికారులు మాపై కేసులు నమోదు చేశారు. మాజీ సీఎం జగన్‌తో కలసి పర్యటనకు రావటం వల్ల నాపై కేసు నమోదయింది. సత్తెనపల్లి పోలీసులు ఆదివారం మచిలీపట్నంలో మా ఇంటికి వచ్చి నోటీసు ఇచ్చి వెళ్లారు. 11 సెక్షన్ల కింద నేరం నమోదు చేశారు' అని పేర్ని తెలిపారు.

వల్లభనేని వంశీకి అస్వస్థత

- ఆస్పత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు



విజయవాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అస్వస్థతకు గురయ్యారు. గన్నవరంలోని ఇంట్లో ఉన్న సమయంలో శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడంతో స్థానిక వైద్యుల సూచనతో ఆయనను కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వంశీకి కొంతకాలంగా వెన్నెముక నొప్పి, శ్వాసకోస ఇబ్బందులు ఉన్నాయి. విజయవాడ జిల్లా జైల్లో ఉన్నప్పుడు ఈ సమస్యలతో బాధపడుతుండడంతో జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ బందరు రోడ్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

చంపుతామంటున్నారు... రక్షణ కల్పించండి

- ఇసుక రీచ్ కోసం డబ్బు తీసుకున్నారు.. అడుగుతుంటే బెదిరిస్తున్నారు
- మాజీ ఎంపీ నందిగం, అనుచరుడు సన్నీపై ఫిర్యాదు
- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు



బాధితుడు షేక్ ముజీబుర్ రెహమాన్

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'మా వద్ద అప్పుగా తీసుకున్న రూ.25 లక్షలు చెల్లించమంటే చంపేస్తామంటూ మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఆయన అనుచరుడు ఆశిక్ సన్నీ బెదిరిస్తున్నారు. నన్ను, మా తమ్ముడిని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. మాకు ప్రాణ రక్షణ కల్పించండి' అంటూ ఓ మైనారిటీ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. గుంటూరు ముప్తీ వీధికి చెందిన షేక్ ముజీబుర్ రెహమాన్, అతని సోదరుడు షేక్ నౌషాద్ ఆటోనగర్‌లో ఆటోమొబైల్ విడి పరికరాల వ్యాపారం చేస్తుంటారు. వారి స్నేహితుడు, కానిస్టేబుల్ అఫ్జల్ అలీ ఖాన్ గతంలో బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌కు గన్‌మన్‌గా పనిచేశాడు. ఆయన ద్వారా సన్నీ పరిచయమయ్యాడు. తాను ఇసుక వ్యాపారం చేస్తుంటానని, సురేశ్ తనకు ఇసుక రీచ్ ఇచ్చాడని రెహమాన్ సోదరులతో చెప్పిన సన్నీ... వ్యాపార నిమిత్తం రూ.25 లక్షలు అవసరమైందని, ఆ మొత్తం సర్దుబాటు చేస్తే మూడు నెలల్లో తిరిగిచ్చేస్తానని నమ్మబలికాడు. రెహమాన్ తన భార్య బంగారు నగలను బ్రాడీపేటలోని రెప్కో బ్యాంకులో తాకట్టు పెట్టి మూడు దఫాలుగా రూ.25 లక్షలు సన్నీకి ఇచ్చాడు. 3 నెలలు గడిచినా తిరిగివ్వకపోవడంతో రెహమాన్ పలుసార్లు ఫోన్ చేసి అడిగాడు. 'చిల్లిగవ్వ కూడా ఇవ్వను. ఏం చేసుకుంటావో చేసుకో. నన్నేమీ పీకలేవు. నాకు అధికార పార్టీ ఎంపీతో పాటు రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లతో సంబంధాలున్నాయని సన్నీ బెదిరించాడు. అతడి అనుచరులు నరికేస్తామన్నారు. నందిగం సురేశ్ అండదండలు ఉన్నాయని, మీరేమీ పీకలేరంటూ బెదిరించారు. దీంతో నా సోదరుడు నౌషాద్ తీవ్ర మనస్తాపంతో 2023 డిసెంబరు 14న ఆత్మహత్యాయత్నం చేశాడు. 10 రోజుల అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. దానిపై అప్పుడు, తాజాగా కూడా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగ లేదు' అని రెహమాన్ వాపోయారు. గతంలో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే లాలాపేటకు పంపారని.. అక్కడకు సన్నీ, ఎంపీ సురేశ్ కాన్వాయ్‌తో వచ్చి పోలీసులను సైతం బెదిరించాడని చెప్పారు. ఇప్పుడు కూడా డబ్బులు అడుగుతుంటే రూ.10 వేలు బిహారీలకు ఇస్తే మిమ్మల్ని చంపేస్తారంటూ సన్నీ, అతడి అనుచరులు బెదిరింపులకు దిగారని.. ఈ నేపథ్యంలో తన తమ్ముడు మళ్లీ ఆత్మహత్య చేసుకుంటానని అంటున్నాడని వివరించారు. మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఆశిక్ సన్నీ, అనుచరుల నుంచి తమకు రక్షణ కల్పించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రెహమాన్ కోరారు.

ఆసరా కోసం పెళ్లి చేసుకుంటే ఆస్తంతా కొట్టేశాడు!

- మొదటి భార్య చనిపోయిందని నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించిన ఘనుడు
- రెండో భార్య నుంచి రూ.28 కోట్లు స్వాహా చేసి పరార్



నాగమణి, శివప్రసాద్‌ల పెళ్లి ఫొటో

చిత్తూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆస్తిపాస్తులు ఉన్నా.. భర్త, కుమారుడి మరణంతో ఓ మహిళ ఒంటరిగా మిగిలింది. జీవిత చరమాంకంలో తనకు ఆసరా ఉంటాడని భావించి ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుంటే.. అతడు ఆమెను నిండా ముంచేశాడు. దీనిపై బాధితురాలు సోమవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎస్పీ మణికంఠను కలిసి ఫిర్యాదు చేసింది. వివరాలివీ.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన నాగమణి భర్త కర్ణాటకలో విద్యుత్‌శాఖలో డీఈ కేడర్‌లో పనిచేశారు. వీరి కుమారుడు 15 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. పదేళ్ల క్రితం భర్త వెంకటప్పరెడ్డి కూడా అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా మిగిలారు. వయసు మీద పడుతుండడంతో.. తనకు, తన ఆస్తికి భద్రతతో పాటు, జీవిత చరమాంకంలో ఓ తోడు కావాలని, జమున అనే పెళ్లిళ్ల బ్రోకర్ ద్వారా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌ని కలిసింది. నాగమణి ఆర్థిక పరిస్థితి తెలియడంతో.. శివప్రసాద్ తన భార్య కరోనాతో చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్‌ను చూపించాడు. తనకు పిల్లలు కూడా లేరని, ఒంటరిగా ఉన్నట్లు చెప్పాడు. నాగమణి ఈ మాటలు నమ్మింది. 2022లో శివప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. తనను పూర్తిగా నమ్మాక.. నాగమణిని మోసం చేయడానికి శివప్రసాద్ పథకం రూపొందించాడు. ఆ ప్రకారం రూ.1700 కోట్లు తనకు ఆర్బీఐ నుంచి రావాల్సి ఉందంటూ ఓ నకిలీ లెటర్‌ను చూపించాడు. ఈ నిధులు విడుదలవ్వాలంటే రూ.15కోట్లు ట్యాక్స్ రూపంలో చెల్లించాలని నమ్మించాడు. నాగమణి బ్యాంకు అకౌంట్ నుంచి శివప్రసాద్ అన్న చక్రవర్తి, వదిన హేమలత అకౌంట్లకు రూ.3 కోట్లు మళ్లించాడు. నాగమణికి సంబంధించిన రూ.10కోట్ల విలువ చేసే వ్యవసాయ భూమి, బెంగళూరులో రూ.15 కోట్ల విలువ చేసే అపార్ట్‌మెంట్‌ను విక్రయించాడు. ఆ తర్వాత ఆర్బీఐ విషయమై నాగమణి నిలదీయడంతో గతేడాది డిసెంబరులో ఇంటి నుంచి పరారయ్యాడు. శివప్రసాద్‌ను వెతుక్కుంటూ నాగమణి శేషాపురానికి రాగా, ఆయన తన భార్య, కుమార్తె, బంధువులతో కలసి ఉండటాన్ని చూసింది. నాగమణిని చూసిన శివప్రసాద్ అక్కడి నుంచి కూడా పరారయ్యాడు.

పబ్లిక్‌గా పేకాట

(మొదటి పేజీ తరువాయి)

కొల్లగొడుతున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటిందంటే ఈ గ్రామంలో సందడి మొదలవుతోంది. ఆరుబయటే పెద్దపెద్ద షెడ్లు వేశారు. ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడ పేక ఆడటానికి తండోపతండాలుగా తరలివస్తున్నారు. పేకాట రాయుళ్లకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా చుట్టూ బౌన్సర్లను పెట్టి నిరంతరం కాపలా కాస్తుంటారు. ఒక్కో కాపలాదారుకు రోజుకు రూ.1,200 చొప్పున భత్యం చెల్లిస్తూ షెడ్లు చుట్టూ పటిష్ఠమైన రక్షణ వలయాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో జూదరులు పబ్లిక్‌గా ఆడుతున్నారు. ఒక వేళ తనిఖీలు చేసినా అవి ఉత్తుత్తి తనిఖీలే తప్ప అసలు నిర్వాహకులను, ఆటగాళ్లను మాత్రం టచ్ చేయడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కాయిన్ల సిస్టమ్..: భీమవరానికి చెందిన వ్యక్తి వెలమవారిపాలాన్ని పేకాట అడ్డాగా మార్చినట్టు చెబుతున్నారు. ప్రతి రోజూ రూ.కోట్లలో నగదు చేతులు మారుతున్నట్లు అంచనా. పేకాట ఆడేవారు రూ.5 వేలు, 10వేలు, 20వేలు విలువ చేసే కాయిన్లు కొనుగోలు చేసి వాటితో తమకు నచ్చినవిధంగా జూదం ఆడుకోవచ్చు. క్షణాల్లో తలరాతలు మార్చేసే కోతముక్క ఇక్కడ బాగా ఫేమస్. సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారుజామువరకూ జూదం సాగిస్తున్నారు. రాత్రంతా పేకాట జరుగుతున్నా పోలీసులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటంలేదని స్థానికులు వాపోతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.